# ఆంధ్రసచిత్రవారపత్రిక




1-2-74

55 పైసలు



"మంచివాడు" లో హాలం




ARMS-HC-012-143-TEL

# ఉత్తరాలు

### ముఖచిత్రం

ప్రముఖ సినీనటి, వాణిశ్రీ ముఖ చిత్రంతో వెలువడిన(21—12—73) పత్రిక అత్యంతాకర్షణీయంగా ఉంది. నిజంగా అట్ట మీది బొమ్మ గంగదో మంగదో నిర్ణయం చేయలేక తికమక పడ్డాం.

పి. వి. ఎం. రావు,
పక్కి. గోపాలకృష్ణపట్నాయక్, వంశధార ఆర్. ఎస్. (గంజాం)

### కథలు

పత్రికలో ప్రచురించబడుతున్న ''ఆశకు సంకెళ్లు'' సీరియల్ చాలాబాగుంది. బుధవారంనాడు పత్రిక కొంటే మరల బుధవారం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడవలసి వచ్చింది. ఈ విధంగా కె. రామలక్ష్మిగారు కూడ మా ఆశకు సంకెళ్లు వేశారు. 'వాణిశ్రీ' ముఖ చిత్రంతో వచ్చిన పత్రిక చాలబాగుంది. దానిలోని ''నిష్కృతి'' ''దెయ్యాల వంతెన'' చాల బాగున్నాయి.

వై. వి. సుబ్బారావు, (బాపట్ల)

ఈ వారం ముగిసిన ''ఆశకు సంకెళ్లు'' సీరియల్ నవల పాఠకుల హృదయాలకు సంకెళ్లు వేసి ముగిసినది.

పి.శ్రీనివాసరెడ్డి, సింధనూరుపోస్టు, ద్వా తాలూకా.

శ్రీమతి కె. రామలక్ష్మిగారి 'ఆశకు సంకెళ్లు'' చాల బాగుంది. ముగింపు చాల ఆలోచన పూర్వకంగా ఉంది. ఈ మధ్య ప్రచురించబడిన చాల సీరియల్ నవలలో ఇది చాల బాగుంది.

ఎ. ఎస్. ఆర్. కృష్ణయ్య, (కరీమ్‌నగర్)

శోభన్— వాణిశ్రీ ముఖ చిత్రంతో వెలువడిన ఆంధ్ర సచిత్ర వారపత్రిక చాల బాగుంది. స్వయంకృతం పెద్దకథ మా హృదయాలను కట్టుకుంది. సుందరి పాత్ర మా మనసులో [illegible]. దోసెడు పెళ్లిళ్లు, పరాజితులు కథలు [illegible] వున్నవి. శ్రీనివాస్‌గారు సినిమా గురించి కొత్త కొత్త విషయాలను తెలియజేస్తున్నందుకు మా కృతజ్ఞతలు.

ఇ శివరాము గౌడ్, ఇ.నారాయణ గౌడ్, షాద్‌నగర్.

11-1-1974 సంచికలో శ్రీ ఎల్. చంద్రమవుళి ఇలా వ్రాశారు. ''నాగేశ్వరరావుగారు సభలలో మాట్లాడటం నేర్చుకోవాలి. కృష్ణ నటుడు కాకపోవచ్చు. కాని అలా అందరి ఎదుట అలా అనడం అనుచితం'' ఇప్పుడు వారు చేసినపని ఏమిటి? నాగేశ్వరరావుగారికి మాట్లాడుటరాదని పత్రికలో వ్రాయటం అనుచితం కాదా!

ఎన్. సుబ్రహ్మణ్యేశ్వరరావు (బంటుమిల్లి)

## పేయింగ్ గెస్ట్ సీరియల్ కథ!

వకుళకు చాలా అందగత్తెనన్న స్వాతిశయం ... దాన్ని చిత్తుచేసిన సత్యం మంచివాడుగనుక గండం గడిచిందనొచ్చునా? వసుధ నిజంగా సార్థక నామధేయురాలు. చెల్లెళ్లకు తండ్రిలేనిలోటు తీర్చిన విద్యావతి ... ఈ నిండుకుండను ''మూగి''వాడు అంటూ వకుళ తీసిపారేసిన [?] సత్యం గమనించక పోలేదుగాని తనకు తెలియకుండానే పుట్టింటివారెలాపోయినా నాకు అక్కరలేదు నాక్కావలసింది మా అత్తారింట, మా పుట్టింటివారిపట్ల మెప్పు మాత్రమేనన్న 'వనజ' కూడా ఒకరకంగా వసుధకి మేలే చేసింది... మధ్య తరగతి పుత్తడిబొమ్మల ముచ్చటయిన కథ...పై వారంనుంచి ప్రారంభం కానున్నది. సం.

# ఆంధ్రసచిత్ర వారపత్రిక

***వ్యవస్థాపకులు :***
***దేశోద్ధారక కాశీనాథుని***
***నాగేశ్వరరావు పంతులుగారు***

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 - 1972)

శుక్రవారం : 1-2-1974
శ్రీ ప్రమాదినామ సం. మాఘమాస శు. నవమి

***సంపుటము : 67 సంచిక : 23***

స్థాపితం 1908
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

***ఆంధ్రపత్రిక కార్యాలయము***
***గాంధీనగరం, విజయవాడ-3***

విడి ప్రతి వెల 55 పైసలు


## విషయానుక్రమణిక



# హైదరాబాద్ నోట్ బుక్

### జాగ్రత అవసరం :

పసిపిల్లల విషయంలో ఏ మాత్రం ఏమరినా ప్రమాదం సంభవిస్తుందనడానికి పోలీసు సూపరింటెండెంటు శ్రీ పుల్లన్నగారి ఏడాదిన్నర పిల్లవాడు పవన్‌కుమార్ దుర్మరణం విచారంతో చెప్పవలసి వస్తుంది. ఈ పసిపాపడు జనవరి 2వ తేదీన కన్ను మూశాడు. ఇంటిల్లిపాదీ పనిలో వున్నారు, మారేడుపల్లిలోని ఇంట్లో. పసిపాపడు ఆడుకుంటూ ఆవరణలోని నీటితొట్టె వద్దకు తప్పటడుగులతో వెళ్ళాడు, దానిలో పడ్డాడు. పక్కింటి బాల్కనీమీద వున్న ఒక ఇల్లాలు కాకతాళీయంగా చూచి, దిగి పరుగెత్తి వచ్చి, పాపడిని తీసి వైద్యుని పిలిచేలోపే కన్నుమూశాడు పాపం! పసిపిల్లలకు అంతా ఆశ్చర్యం! అన్నీ తెలుసుకోవాలనే కుతూహలం మిక్కుటంగా వుంటుంది. ఆ కుతూహలం జ్ఞానానికి మార్గం అనిమనం అనుకోక, అల్లరి అనుకుంటాము. వాళ్లేమో ప్రమాదం అనుకోరు కనుక పెద్దలు ఎప్పుడూ వారిని కనిపెట్టుకుని వుండాలి.

### డాక్టర్ చెన్నారెడ్డి—ఆరు సూత్రాలు :


ప్రత్యేక తెలంగాణాను కోరే కాంగ్రెసు పోరం డాక్టర్ చెన్నారెడ్డివర్గం షట్‌సూత్ర ప్రణాళికను ఆచరణలో పెట్టి చూడడానికి అంగీకరించింది. ఈ సంగతిని డాక్టర్ రెడ్డి ఈ నెల 3వ తేదీన పత్రికా ప్రతినిధులకు తెలపడంతో నగరవాసులకు "ఇంతట్లో ఇకమీదట ఆందోళన వుండదు, హాయిగా వుండవచ్చు" అనే విశ్వాసం కలిగింది. "విడిపోవడం ఒక్కటే తరుణోపాయమని మొదట అనుకున్నాము ఇప్పుడు ఇతర మార్గాలనూ ఆచరణలో పెట్టిచూద్దాము అనుకున్నాము" అన్నారు డాక్టర్ రెడ్డి. ఈ సమయస్ఫూర్తికి పురలోకమంతా ఆయనను అభినందిస్తున్నారు.

### శ్రీ వీరమాచనేని తొలి ప్రసంగం:

రాష్ట్ర అడ్‌హాక్ కాంగ్రెసు సంఘం అధ్యక్షుడు శ్రీ వీరమాచనేని వెంకటనారాయణ ఈ నెల 4వ తేదీన గాంధిభవన్‌లో పత్రికా ప్రతినిధులతో ముచ్చటిస్తూ, రాష్ట్రసమైక్యాన్ని భౌగోళికంగానే కాక భావిదృష్టితోను పరిరక్షించాలని అనడం ఆయనవంటి స్వాతంత్ర్యయోధునికి తగినట్టువుంది. సమైక్యానికి కావలసిన మొట్టమొదటి మూల ద్రవ్యం భావసమైక్యం. మనసులు కలవనప్పుడు ఒక ఒరలో రెండు కత్తులలాగే ఇమిడికొంటూ వుండవలసి వుంటుంది. సమైక్యరాష్ట్రం పూవుల సెజ్జ వంటిదికావాలి. ప్రధాన కార్యదర్శి శ్రీ టి. హయగ్రీవాచారి అన్నట్టు కాంగ్రెస్ సంఘం ఇక ముమ్మరంగా కార్యక్రమం కొనసాగిస్తుంది గనుక శ్రీ వెంకటనారాయణవంటి కాంగ్రెస్ కురువృద్ధుడు నాయకుడయ్యాడు గనుక ప్రజలకు హితం చేకూరగలదనే ఆశించవచ్చు.

### ఆసియా వారోత్సవాలు :

ఆసియా సమస్యపట్ల, ఆసియా సమిష్టి రక్షణ, పరస్పర సహకారం ఆవశ్యకతపట్ల ప్రజల



అనుకున్నట్లే కేంద్రంలో క్యాబినెట్ హోదాగల మంత్రిగా పదవిస్వీకారం చేసిన ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి. వారు ప్రస్తుతానికి కమ్యూనికేషన్ల శాఖ నిర్వహిస్తున్నారు. వారికి మరికొన్ని అదనపు శాఖల బాధ్యత అప్పగించబడే అవకాశాలున్నాయని పరిశీలకుల అంచనా....

దృష్టిని మళ్ళించడానికి ఏప్రిల్ మొదటివారంలో దేశమంతటా "ఆసియా వారోత్సవం" జరుపాలని ఈ నెల 4, 5, 6 తేదీలలో ఉర్దూహాలులో జరిగిన శాంతి రక్షణ స్నేహసంబంధాల జాతీయ మహాసభ తీర్మానించింది. ముఖ్యమంత్రి తొలినాటి సభ

## హైదరాబాద్ నోట్ బుక్

సభకు అధ్యక్షతవహించగా, మాజీ కేంద్ర రక్షణ మంత్రి శ్రీ కృష్ణమీనన్ ప్రారంభోత్సవం జరిపారు. దేశ విదేశాల నుంచి దాదాపు 1000 మంది ప్రతినిధులు ఈ సభలో పాల్గొన్నారు. రమేశ్ చంద్ర, కె. వి. ఎస్. మీనన్, సోవియట్ ప్రతినిధి వర్గ నాయకుడు ఆరిమోవ్, ఇటలీ ప్రతినిధి విట్టోరియో గాస్పరిల్లో, బెహానియమ్‌ప్రొటెస్ (ఇరాక్) మూసా మూలాలా (దక్షిణాఫ్రికా) తమ్మారెడ్డి సత్యనారాయణ, పిడతల రంగారెడ్డి, పి. నరసారెడ్డి మొదలైనవారు ప్రసంగించారు.





### నాగయ్యకు జోహార్లు

కీర్తిశేషుడు పద్మశ్రీ శ్రీ చిత్తూరు నాగయ్య అర్ధశతాబ్దిగా చేసిన కళాసేవను విజయనగర కాలనీలో జరిగిన సభలో పలువురు ప్రశంసించారు. అధ్యక్షత వహించిన మంత్రి శ్రీ పి. రాజమల్లు పోతన, వేమన, త్యాగయ్య, రామదాసు చిత్రాలలోనూ, తదితర చిత్రాలలోను నాగయ్య నటనప్రజ్ఞను వివరించారు. వృద్ధ సినిమా నటుడు శ్రీ వంగర వెంకట సుబ్బయ్య, "నటన" సంపాదకుడు శ్రీ రామాచారి సంగీతనాటక అకాడమీవారు నాగయ్యకు తగిన స్మారకచిహ్నం నెలకొల్పాలని సూచించారు.

### శ్రీ ఎ. ఎస్. రామన్ తెలుగు కవిత

ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా మాజీ సంపాదకుడు శ్రీ ఎ. ఎస్. రామన్ ఆంగ్లంలో గొప్ప రచయిత, విమర్శకుడు, పత్రికా రచయిత అని అందరికీ తెలుసు కాని, ఆయన తెలుగులో కవిత చెప్పేవాడన్నా, ఏకాంకికలు వ్రాశాడన్నా అప్పట్లో భారతిలోను, ఆంధ్రపత్రికలోను ప్రచురితమయ్యాయన్నా ఆ మాటకు నాకు ఆశ్చర్యమే కలిగింది. ఇటీవల ఈ నెల 6వ తేదీన "సుధర్మ ఆధునిక చిత్రశాల"లో జరిగిన సమావేశంలో ఆయనే నాతో ఈ సంగతి చెప్పి అందరినీ ఆశ్చర్యంలో ముంచారు. "నా పేరు నేను వాడలేదు" అన్నారు. "అవధానం సీతారామయ్య అనే పేరుతో వ్రాసేవాడిని అది నా పూర్తి పేరు" అన్నారు ఆయన. "అప్పుడు నేను విశాఖలో ఆనర్సు చదువుతున్నాను. దాదాపు 20 ఏకాంకికలు, 10 కవితలు వ్రాశాను. సౌందరనందాన్ని నాటకం చేశాను" అన్నారు. "వాటిని ప్రచురించి ఉంటే 30 సంవత్సరాల నాటి మా కల్పనాశక్తి తెలుస్తుంది" అన్నారు ఆయన ఒక మందహాసం చేశారు. అప్పుడు ఆయన మితభాషి. ప్రసన్నసుందర ముఖం. ఎవ్వరయినా ప్రవర్తన రచనలాగే తీర్చిదిద్దిన సంభాషణ. తెలుగుతనం ఉట్టిపడే మాటలు, ఒకసారి పరిచయమైతే ఎప్పటికీ మరువలేని ధోరణి — ఈ మాటలు గొప్ప రచయితను చేశాయి, పత్రికలో పాటు. ఆయన తెలుగు రచనలు పుస్తకంగా ప్రచురించుకోవాలి.

### ఉపశ్రుతి :

"త్వరలోనే మనకు మూడు విశ్వవిద్యాలయాలు కావలసినంత కాపీలు, [illegible]" అన్నాను. "కాపీలు తప్పుకాదండీ, దానిని హోపెన్‌బుక్ (గ్రంథం చూచి వ్రాసే) పద్ధతి పెట్టమనండి పరీక్షల్లో. వారు వస్తారు" అని ఒక తలపండిన కాలేజీ ప్రిన్సిపాలు.

—తిరుమల రామచంద్ర


ఆహార దొమ్మీలు
సమ్మెలు
అల్లర్లు
వర్గ వైషమ్యాలు
బంద్‌లు
అసంతృప్తి
చుట్టూ అగ్ని పర్వతాలు
యు.పి. ముఖ్యమంత్రి బహుగుణాకు రెండుసార్లు పెళ్ళి అయిందని వార్త!
పనులు గుట్టగా పెరగనీ - మనకి రెట్టింపు ఓవర్ టయిమ్ దొరుకుతుంది!
ప్రభుత్వరంగం ఉద్యోగులు
నేను కాలేజీ మానేస్తా నాన్నా! ఎల్.ఐ.సి. వాళ్ళు 'మెట్రిక్' కూడా కాని వారికి పెద్ద జీతాలు ఇస్తున్నారటగా...!

# సీరియల్.....
# పట్టీలోని కెరటాలు

ఎం.పి.ఆర్. రాధాకృష్ణ

*(గత సంచిక తరువాయి)*

"**కా**స్త కాఫీ వంటిదేమయినా, మేం సంతోషిస్తాం!" కేకవేశాడు శ్రీహరి.

"ఆ 'మేము' లో నన్నుకూడా చేర్చినట్లు భావిస్తున్నాను!" అన్నాడు సుధాకర్.

ఇద్దరికీ కాఫీ యిచ్చి, టిఫెన్ తయారు చేయడానికి మళ్లీ వంటగదిలోనికి వెళ్లిపోయింది అరుణ.

"ఇక్కడ కాస్త పనివుండి వచ్చాను. రేపు ట్రావలెర్స్ బంగళాకు వెళ్లిపోతాను. అది ముందే నాకోసం రిజర్వు అయింది. ఏకంగా అక్కడే దిగి, తర్వాత ఇక్కడకు వస్తే, అరుణ ఊరుకోదని, తిన్నగా ఇక్కడికే వచ్చాను." అన్నాడు శ్రీహరి.

"అదేమిటి? మా యిల్లు మీకు నచ్చలేదా?"

"కాదు ... కాదు ... మీకెందుకు శ్రమ ..."

శ్రీహరి మాటలు పూర్తికాకుండానే ... "అరుణా" అంటూ పిల్చాడు సుధాకర్.

అరుణ వచ్చింది.

"ఈయనగారు రేపు వెళ్లిపోతారట!"

అరుణ ఆశ్చర్యంగా చూసింది ... "నిజంగానే అన్నావా?"

"అదికాదు, అరుణా ..." శ్రీహరి ఏదో చెప్పబోయాడు.

"ఏదీకాదు. నువ్వీ ఊర్లో ఉన్నంతకాలం మా యింటిలో వుండవలసిందే! అంతేకాదు ఇకముందు ఎప్పుడు వచ్చినా, మా యింటికి రాకపోయావంటే ... తెలుసుగా, నాకు కోపం వస్తే ఏంచేస్తానో!"

"తెలుసు...తెలుసు! బుద్ధి పొరపాటయి అన్నాను. ఎక్కడకూ వెళ్లను..." అన్నాడు శ్రీహరి లెంపలు వేసుకుంటూ.

అరుణ తిరిగి లోపలికి వెళ్లిపోయింది. రెండు నిమిషాల్లో టిఫెన్ ప్లేటుతో తిరిగి వచ్చింది.

"ఇదిగో టిఫెన్! నీకేం కావాలన్నా అడుగు. చేసిపెడతాను. అంతేగాని ... ఎక్కడికీ పోతాననకు. నాకసలే చిరాకు!" అంది.

"వెళ్లను తల్లీ ... వెళ్లను. సరేనా!" శ్రీహరి నవ్వాడు.

## 3

"జీవితానికో పరమార్థం వుండాలి..." శ్రీహరి సిగరెట్ వెలిగించి, విలాసంగా పొగ వదుల్తూ అన్నాడు.

అరుణ వింతగా చూసింది ... "పరమార్థం సంగతి అలా వుంచు. ఈ ధూమపానం ఎప్పటినుండి? చాటుమాటు వ్యవహారం కాస్త పబ్లిక్‌గా మారిందే!"

"పెద్దవాడనయ్యానుగా! ఈ మాత్రం స్వతంత్రించకూడదంటావా?"

"ఎంతమాట? పైగా కలెక్టరువి కూడా!"

"కలెక్టర్లు సిగరెట్లు కాల్చకూడదనే రూలేం లేదు!"

"రూల్స్ సంగతి నిన్నే అడిగి తెలుసుకోవాలి. సిగరెట్లు కాల్చడమే ప్రస్తుతం నీ జీవిత పరమార్థమనుకుంటాను."

శ్రీహరి నవ్వేశాడు... "ఇంత చిన్న విషయమే జీవితానికో పరమార్థమనుకుంటే, అంతకుమించిన అల్ప సంతృప్తి తత్వం వేరొకటి లేదు."

"అయితే నీ జీవిత పరమార్థమేమిటో?"

"గొప్పవాడిని కావాలి. జీవితంలో ప్రత్యేకంగా ఏదో సాధించాలి."

అరుణ గట్టిగా నవ్వింది.

శ్రీహరి చిరాకుపడ్డాడు... "ఎందుకా నవ్వు?"

అరుణ అతి కష్టంమీద నవ్వు ఆపుకుంది... "ఐ.ఏ,యస్. ఆఫీసరువి నువ్వు ప్రభుత్వ ప్రతినిధివి. నువ్వేం సాధించగలవు?"

"ఎందుకు సాధించలేను? ప్రభుత్వం మాత్రం ప్రజలకోసంకాదా? దాని ప్రతినిధిగా నేను ప్రజాసేవ చేస్తున్నట్లే!"

"కాదనను. ప్రభుత్వ ప్రతినిధిగా ప్రభుత్వ ఆదేశాన్ని తూ. చ. తప్పకుండా అమల్లో పెట్టగలవు. గ్రాంట్లు మంజూరు చేస్తావు... అప్పులిప్పిస్తావు... సవ్యంగా సాగినంతకాలం. అవసరమనుకుంటే అదే ప్రజలను తుపాకులతో పిట్టల్ని కాల్చినట్లు కాల్పించిపారేస్తావు. ప్రజలు అసంతృప్తి చెంది ప్రభుత్వంమీద అలజడి రేపినపుడు— ఆ ప్రజల కష్టసుఖాలేమైనాకానీ... ఇటువంటి విషయాల్లో నీకు నీ స్వంతమనే ఆశయం వుండదు. ప్రభుత్వం తరపున వకాల్తా పుచ్చుకొని, నీ స్వంత అభిప్రాయం లేకుండా... ఏమైనా చేయగలవు! ఇదేనా, నీ ప్రజాసేవ? ఇదేనా నీ పరమార్థం?"

శ్రీహరి ఇబ్బందిగా కదిలాడు... "పోనీ... ప్రజాసేవను కాస్త పక్కకునెట్టి, మిగిలిన విషయాలు తీసుకుందాం. విల్‌పవర్ అంటూ వుంటే... నేను సాధించలేనిదేముంది?"

"ఏదీలేదు. కలెక్టరునుండి ఛీఫ్ సెక్రెటరీ వరకూ, ఇంకో అదృష్టం బాగుంటే ఏ దేశానికో ఎంబాసిడర్... ఇవన్నీ పరమార్థాలే! ఎటొచ్చీ... స్వంతానికి! అంతకుమించి నువ్వు సాధించగలిగేదేముంది?"

"అంటే మానవ సమాజం కోసం నేను

**జరిగినకథ: రా**జారావు జానికమ్మల సంతానం అరుణ. వారింటి ప్రక్కనున్న రామారావు,అతని భార్య సరస్వతి— ఈ ఇద్దరితో అరుణకి స్నేహం. రామారావు చిన్ననాటి స్నేహితుడు సుధాకర్. విశాఖపట్నం నుండి ఆఫీసు పనిమీద హైదరబాద్ వచ్చిన సుధాకర్ అరుణని చూసి ఆమెని రామారావు ప్రోత్సాహంతో వివాహం చేసుకోవాలనుకుంటాడు. సుధాకర్ తండ్రి శివరావు భార్య వద్దన్నా అరుణ సుధాక… వివాహం జరిపిస్తాడు. అరుణ సుధాకర్‌లు విశాఖపట్టణం వస్తారు. అరుణ చిన్ననాటి స్నేహి… శ్రీహరి అరుణ ఇంటికి విశాఖపట్టణం వస్తాడు.

కృషి చేయలేననేగా నీ అభిప్రాయం!'' శ్రీహరి అడిగాడు

''అసలు నువ్వు చెప్తున్న పరమార్థం మీద ఒక నిశ్చితమైన అభిప్రాయం నీకే ఉన్నట్లు లేదు! ప్రజాసేవ నుండి, పెద్ద పొజిషన్ వరకూ వెళ్ళి, తిరిగి మానవసేవ లోనికి దిగావు. తరచిచూస్తే, ఈ ప్రపంచంలో ఏదోవిధంగా తోటి వ్యక్తికి ఉపకరించని వ్యక్తి లేడు. ఎందుకంటే, మనిషి సంఘజీవి కాబట్టి! జీవితానికో పరమార్థముండాలని అనుకుంటే, అది స్వంతానికి కాకూడదు. మన చుట్టూ ఉన్న సమాజం కోసం కావాలి.

''అయితే, నేను ఉద్యోగం చేసుకుంటూ యివేవీ సాధించలేనా?''

''నీ పరమార్థాన్ని కాస్త కట్టిపెట్టు. అసలు నీ ఉద్దేశమేమిటో స్పష్టంగా చెప్పు''

ఏం చెప్పను? ఇంకా స్పష్టంగా ఏదీ తేలందే! సరే, ఆ విషయానికేంగాని, ప్రేమ గురించి నీ అభిప్రాయం ఏమిటి?''

అరుణ నవ్వింది... ''పరమార్థం కాస్త ప్రేమాయణంగా మారిపోయిందేమిటి మిత్రమా? ఇంతకూ ఈ టాపిక్‌ను నువ్వెక్కడ తేల్చదలచుకున్నావో సూటిగా చెప్పేసెయ్! కనీసం... అటునుండి నరుక్కొని వద్దాం.''

''కాదు... నువ్వీ విషయం ముందు చెప్పి తీరాలి.''

''బాగానే ఉంది. మహాసముద్రంలో ఏక్కడో నీటిబొట్టు ఉందన్నట్లు, ఉన్న పళంగా ప్రేమమీద లెక్చరివ్వమంటే... నా తరంగాదు.''— నవ్వింది.

''నిన్ను లెక్చరివ్వమనడంలేదు. నీ అభిప్రాయం చెప్తే చాలు. ప్రేమ అనేది మహాసముద్రమే అంటావా?'' శ్రీహరి అడిగాడు.

''సప్త సముద్రాలున్నాయని పురాణాల్లో వర్ణించారు. నేయి సముద్రం, పాల సముద్రం, పెరుగు సముద్రం... ఇలా మొత్తం ఏడు సముద్రాలట! వాటిలో... ఉప్పు సముద్రాన్ని మనకు మిగిల్చి మిగిలినవన్నీ దేవతలు తీసుకుపోయారట. 'ఎంత స్వార్థం వారికి'— అను కునేబదులు...'ఎంత ప్రేమతో మన యీ ఉప్పు సముద్రాన్ని మిగిల్చారు'— అనుకుంటే చాలు! అసలు కిటుకు అర్థమయిపోతుంది.''

శ్రీ హరి వింతగా చూశాడు... ''మంచి వన్నీ వాళ్ళు తీసేసుకుని ... ఉప్పు మన మొహాన కొడితే ... అది ప్రేమతో చేసిన పనా?''

''ఆహా ... నిశ్చయంగా అది మన మీద ప్రేమే! ఎందుకంటావేమో! ఉప్పు లేనిదే ఏ పదార్థానికీ రుచిరాదు మిగిలినవి...అంటే,



# ఏటిలోని కెరటాలు




పాలు, నేయి మొదలైనవి మనకు తగినంత దొరుకుతూనే వుంది. ఉప్పు లేకుండా, దేన్నీ నోట్లో పెట్టుకోలేం. అందుకే 'ఉప్పు .. ఉత్తమ రుచికారి' అన్నారు పూర్వులు."

"నిన్ను ప్రేమ గురించి చెప్పమన్నాను గాని, లవణోపాఖ్యానం కాదు" విరాగ్గా అన్నాడు శ్రీహరి.

అరుణ నవ్వేసింది... "అంత విరాగ్గైతే ఎలా గురూగారూ! ప్రేమ ... ప్రేమ ... అంటూ ఎలవరించేబదులు ఎవర్నైనా ప్రేమించావో చెప్తే .. విని ఆనందిస్తాను."

"ప్రేమ గురించి మాట్లాడాలంటే ... ప్రేమించితీరాలనే రూలు ఎప్పటికీ లేదే!"

"మొత్తంమీద గవర్నమెంటు సర్వెంటు అనిపించుకొన్నావ్ ... ప్రతి విషయానికి రూల్సు. పాయింట్సు ...అంటూ!" అరుణ నవ్వింది.

"నిజం అరుణా ! సీరియస్‌గా అడుగుతున్నాను. ఈమధ్య ఎక్కడో చదివాను. ఉడుకు రక్తం ప్రభావంలో పడి, మనసులో కలిగిన వికారానికి "ప్రేమ" అనుకొని భ్రమపడి, జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు - అని! అంటే ఈరోజుల్లో కట్టలకొద్దీ ఎగుమతి అవుతున్న ప్రేమ సాహిత్యమంతా వట్టి హాస్యం అనేకదా అర్థం. ఈ మధ్య కొందరు ప్రేమను, టీనేజ్‌లో కలిగే ఒక రసాయనిక ప్రక్రియ అంటున్నారు. చరిత్ర తిరగేసి చూస్తే, ప్రేమికుల కన్నీటి గాథలు కొల్లలుగా కనిపిస్తాయి! కాలంతో బాటు ప్రేమలోని గొప్పదనం, దానికున్న విలువలు కూడా మారిపోతున్నాయనుకుంటాను."

అరుణ క్షణం మాట్లాడలేదు. తరువాత సాలోచనగా తల పంకించి, అంది... "ప్రేమ వేరు ...పరస్పర ఆకర్షణ వేరు, శ్రీహరి! మనం కాలేజీలో చదివే దినాల్లో, ఎందరో అబ్బాయిలు, అమ్మాయిలు మనచుట్టూ వుండేవారు. అందమైన దృశ్యం మనసుని చలింపచేస్తుంది. రుచికరమైన పాటిని కొద్దిగా ఎక్కువ తింటాం. అలాగే ఒక అందమైన అమ్మాయిని చూసినపుడు 'చాలా బాగుంది సుమా!' అనుకోవడం వేరు ... ఆ అమ్మాయి వెంటపడి ప్రేమ పాఠాలు వల్లించడం వేరు. అందాన్ని మాత్రమే ఆరాధించే వ్యక్తి సిసలైన ప్రేమికుడు కాలేడు. ప్రేమ బాహ్యసౌందర్యాన్ని చూడదు ... మనిషిలోని మంచితనాన్ని ప్రేమిస్తుంది. ప్రేమించగలిగే హృదయం ఒక్కటే ప్రేమలో వున్న విలువను గ్రహిస్తుంది. ప్రేమ, ప్రేమను ప్రేమిస్తుంది. అందుకే ప్రేమ అనిర్వచనీయమైనది. 'దేనికోసం ప్రేమిస్తున్నాను?...'అని ప్రశ్నించుకున్నప్పుడు — ఏదైనా సమాధానం వస్తే...అది ప్రేమే కాదని నా అభిప్రాయం. సంశయరహితమై, మనోవికారాలకు అతీతంగా వుండేదే ప్రేమ."

"ఏమిటో తీవ్రంగా చర్చిస్తున్నట్టున్నారు ?" అప్పుడే ఆఫీసునుండి వచ్చిన సుధాకర్ అడిగాడు.

"రండి...రండి! సమయానికి వచ్చారు. అరుణాదేవిగారు ప్రేమమీద లెక్చర్లిస్తుంటే, వింటున్నాను."అన్నాడు శ్రీహరి నవ్వుతూ.

"లెక్చర్లకేం లోటులేదు...ఒక్క ఆచరణ తప్ప!" సుధాకర్ నవ్వాడు.

అరుణ మురచురా చూసింది "మీకిప్పుడేం తక్కువైంది ?"అంది.

"ఏదీ ... వచ్చి చాలాసేపయినా, 'అయ్యో...ఆఫీసులో కష్టపడివచ్చారు, కప్పు కాఫీ పోద్దాం' — అనే ఆలోచన కలిగిందా నీకు?"

"కాఫీకి, ప్రేమకు ముడి పెట్టకండి..." అంటూ లేచి, లోనికి వెళ్ళి, క్షణంలో కాఫీ కప్పులతో ప్రత్యక్షమైంది.

"కాఫీ ఇవ్వనంత మాత్రానికే, పెళ్ళానికి ప్రేమ లేదనుకునే మగాడికి ప్రేమ లేనట్టే!" అంది, కాఫీలు అందిస్తూ.

అందుకున్న కప్పు ఒక్క గుక్కలో ఖాళీ చేసి..."మగవారి ప్రేమను శంకించకు! మగవాడు ప్రేమించినంత గాఢంగా ఏ ఆడదీ ప్రేమించలేదు ..." అన్నాడు సుధాకర్ కవ్వింపుగా.

"ఓహో . ఇంతకాలానికి బయల్దేరారండీ ... ప్రేమనగర సామ్రాజ్యాధినేతలు! ఏదీబాబూ ... మచ్చుకొక ఉదాహరణ చెప్పండి...వింటాం." సవాలు చేస్తున్నట్టు అంది అరుణ.

"ఒకటేమిటి ? కొల్లలున్నాయి. లైలా—మజ్నూ, దేవదాసు — పార్వతి . . ఈ రెండు జంటలలో పెళ్ళిళ్ళు చేసుకున్నావాళ్ళెవరు ? ఆడవాళ్ళు ! లైలా ఒకడిని పెళ్ళాడితే, పార్వతి మరో ముసలాడిని ! పెద్దల వత్తిడి వలన అలా చేశామని ఎంగావి కబుర్లు చెప్పకపోతే, ఏ రైలుక్రిందనో పడి చావలేక పోయారా? పైగా తప్పంతా, మగవారిదా?"

"ఓహో ... మరి మీ మగ మహారాజు లేంచేశాడు స్వామీ...! పార్వతి అర్ధరాత్రపుడు సాహసం చేసివచ్చి 'నన్ను పెళ్ళి చేసుకో' అని చెప్పాడితే, ఏంచేశాడు మీ దేవదాసు?"

"దేవదాసు తాగుబోతు అయ్యాడని తెలిసి, వారించాలని వచ్చిన పార్వతితో ... 'నన్ను లేవదీసుకుపోనా!' అని దేవదాసు అంటే...మీ పార్వతి మాత్రం ఏంచేసింది ?"

అరుణ, ముఖం ముడుచుకుంది . . "ప్రశ్నకు జవాబు ... ఇంకొక ప్రశ్న కాదు."

"ఎందుక్కాదు ? "ఒక సమస్యకు పరిష్కారం, వేరొక సమస్య కావచ్చు ! పార్వతి తనకు దక్కలేదనే ఆవేదనలో, దానిని మరచిపోవటానికి దేవదాసు తాగుడుకు అలవాటు పడ్డాడు. ఎంతగా దానికి 'ఎడిక్ట్' అయ్యాడంటే...ప్రాణప్రదంగా ప్రేమించిన పార్వతి దూరమైతే సహించగలిగాడు కాని, తాగుడు మానుకోలేకపోయాడు. కారణం ఏమిటంటావ్ ?"

"మీరే చెప్పాలి!" వెటకారంగా అంది అరుణ.

"తాగటం మానుకొని చేసేదేముంది, పార్వతి నామస్మరణ తప్పింది! పళ్ళూడగొట్టుకోవడానికి ఏ రాయి అయితేనేం ? ఎంత స్మరించినా, పరాధీన అయిన పార్వతి తనకు దక్కదు. ఆఫ్టరాల్ డబ్బు పారేస్తే బాటిల్ దొరుకుతుంది. వ్యథ పోగొట్టుకోవడానికి, అందుబాటులో ఉన్నది అందుకోవడమే మానవసహజం!"

"దేర్‌ఫోర్ ... దేవదాసు గొప్ప ప్రేమికు

చెప్పు అని అడుగు . అంతేనా ?"

"కరెక్ట్ !"

"ఇక తగ్గండి...! ఎంత బాధాకరమైనా, దేవదాసు ఊహతోనే పార్వతి చివరివరకూ బ్రతికింది గాని, ఆ బాధను మర్చిపోవటానికి తనెందుకు త్రాగలేదు ?"

"ఆడదిగనుక, అవకాశం లేక. పార్వతి వంటరిగా ఉండి, చెత్తగా చేతిలో డబ్బుంటే, తనూ కచ్చితంగా త్రాగి ఉండేది ! సందేహం లేదు." దృఢంగా అన్నాడు సుధాకర్.

"మొండివాళ్ళతో మాట్లాడలేం ..." ఉడుక్కుంటున్నట్లు అంది అరుణ.

సుధాకర్ భుజాలు ఎగరేశాడు..."మొండి వాళ్ళనకు ! పాయింట్ అంటే పాయింటే."

"మొత్తంమీద అరుణను చిత్తుచేసి పారేశారు. మీరు రాకముందు నన్ను హడల గొట్టేసింది. సమయానికి వచ్చి బ్రతికించారు." నవ్వుతూ అన్నాడు శ్రీహరి.

"ఈ విషయంలో మనం మనం ఒకటి. మీరేం కంగారుపడకండి. ఈవిడగారి మొండి వాదనలతో, నా మెదడు కూడా మొండిబారి పోయింది..." అన్నాడు సుధాకర్.

"ఆహాసుమతి...బగ మహారాజబుడదూ ! ఎందుకు సపోర్ట్ చేసుకోరు ? మీ జాతి నైజమే అంత !" అరుణ రోషంగా ముక్కు పుటాలు ఎగరేసి, కోపంగా అంది.

సుధాకర్ నవ్వేశాడు..."అదిగో ... ఉడుక్కుంటున్నావ్ ! మేమేదైనా అంటే, అన్నా మని మా మీద ఏడుస్తారుగాని, మగవారిని విమర్శించేముందు మీకూ, తండ్రి, అన్నలూ, తమ్ముళ్ళూ ఉన్నారని అనుకోరేం ? కేవలం ఒకరిని విమర్శించాలనే ఉబలాటమే కాక, ముఖ్యం ! అది సద్విమర్శకూడా కావాలి "

"నిజమే, అంగీకరిస్తున్నాను. కాని ఒక్క మాట చెప్పండి. మగవాళ్ళు ఎలా తిరిగినా పట్టించుకోని సంఘం, ఆడదాన్ని ఇన్నికట్టు బాట్లతో ఎందుకు ఉంచాలి?"

"కట్టుబాట్లంటే ముందు అర్థం చెప్పాలి. అదీకాక ... సాంప్రదాయం కూడా ఒకటుంది. కొన్ని సాంప్రదాయాలు ఆడ వాళ్ళకు విరుద్ధమైనవే ! అందుకే ముందు సాంప్రదాయ విప్లవం కావాలి. భౌతిక విప్లవం కాదు కావలసినది! 'ఎలాంటి బట్టలు వేసు కుంటేనేం ... ఎలా తిరిగితేనేం ... ఎవడితో పోతేనేం ?' అనుకునే వైరితనం, పురోగతి కాదు. ఉన్న సంస్కృతిని కాపాడుకుంటూ, సాంప్రదాయాల మాటున పొంచిఉన్న అనాచారాలను పార్రదోలాలి. అదీ నిజమైన సంస్కరణ. ఆడ, మగ...ఎవరి పరిధుల్లో వాళ్ళున్న నాడు—పరస్పర నిందారోపణలకు ఆస్కారం లేదు !" అన్నాడు సుధాకర్.

"హియర్...హియర్..." శ్రీహరి ఉత్సాహంగా చప్పట్లు కొట్టాడు. అరుణ, సుధాకర్ వైపు ఆశ్చర్యంగా చూసింది.

"ఏమిటో అనుకున్నాను. ఘటికులే..." అంది మెచ్చికోలుగా.

"రైట్ ఇప్పటికి చాలు ! శ్రీహరి రేపు వెళ్ళిపోతున్నారు. కాబట్టి...ఈరోజు సినిమాకి వెళ్దాం" అన్నాడు సుధాకర్.

"ఓకే...అలాగే ! అరుణదే ఆలస్యం !" అన్నాడు శ్రీహరి, సుధాకర్ ప్రతిపాదనను బలపరుస్తూ.

"ఇదిగో ... క్షణంలో వచ్చేస్తాను ..." అంటూ లోనికి పరుగెత్తింది, అరుణ.

# 4

శ్రీహరి వెళ్ళిన నాలుగవరోజున, హటాత్తుగా ఊడిపడ్డారు. రాజారావుగారు, జానకమ్మ, రాజా, విజయ— అందరూ !

వాళ్ళందరినీ నవ్వుతూ లోనికి తీసుకొని వస్తున్న సుధాకర్‌నుచూసి ఆశ్చర్యపోయింది అరుణ !

తనతో చెప్పకుండా సుధాకర్ చేసిన ఈ



బయట వుంటే పెళ్ళాం పిల్లల్తో హాయిగా వుందువా ?

—మరెలాగండీ ! పోలీసు మామూళ్ళు యివ్వవని పెళ్ళాం పిల్లల మీదే ఒట్టు పెట్టు కున్నానండీ—

పనికి, అరుణకు బాగా కోపంవచ్చినా, అప్పటికి ఊరుకుని... అందరినీ నవ్వుతూ పలక రించింది !

"అదేమిటేకే... అలా చిక్కిపోయావ్ !" అంది జానకమ్మ కూతురివైపు విశితంగా చూస్తూ !

అరుణ సిగ్గుపడి ఏదో చెప్పబోయేలోగా... "అక్క చిక్కిపోలేదమ్మా... గొద్దిగా బాలి స్తింది..." అన్నాడు రాజా !

"నువ్వాదుకో, వెధవా ! ప్రతిదానికి తయారౌతావు !" అని చిన్నగా కసిరి... "ఇంతకాలమైన తరువాత,ఇప్పుడేనా ఉత్తరం వ్రాయడం ?" అంటూ అరుణను నిలదీసింది జానకమ్మ ! అందరూ స్నానాలు చేసి, ప్రయాణం బడలిక తీర్చుకున్న తరువాత... జానకమ్మ మెల్లగా అసలువిషయం బయటకు దిగింది !

"అమ్మాయిని తీసుకుపోతాం బాబూ !" అంది వాందిగా !

"అప్పుడే..." అని ఆశ్చర్యపోయి, "నాకా అమ్మాయి ఇష్టం !" అనేశాడు, సుధాకర్ వేసెదికేక !

"పెళ్ళయినాక ఒక్క పండుగకు కూడా రాలేదు. ఈసారి కాస్త ముందే తీసుకు వెళ్తాం !" అంది జానకమ్మ !

"అబ్బాయో, అమ్మాయో పుట్టాక ఉత్తరం వ్రాస్తాం ! అప్పుడు మీరు వద్దురు గాని..." అంది విజయ !

"అదేమిటే... ఈమధ్యలో ఒక్కసారయినా రాకపోతే ఎలా ?"

ఆశ్చర్యంగా అంది జానకమ్మ !

అందరూ నవ్వేశారు.

"నువ్వు మరీనూ ! ఏమీ అర్థంకాదు." అన్నారు రాజారావుగారు.

"విజయ, బావగారితో హాస్యమాడింది ! అయనెందుకురారు ?"

రాజా ధీమాగా అన్నాడు !

ఆ రాత్రి, నిద్రపోయేముందు అరుణ. సుధాకర్‌ను నిలదీసింది .

"నాకు చెప్పకుండా ఎందుకు ఉత్తరం వ్రాశారు ?" అంటూ !

"స్టజంట్ సర్‌ప్రైజ్ ఇద్దామని . ఏం, తప్పా ?"

"తప్పా, తప్పున్నరా ? నాతో చెప్తే నేను కాదంటానా ?" అరుణ కోపంగా అంది !

సుధాకర్ నవ్వాడు , అరుణను దగ్గర

బాహువుల్లో బంధించాడు! "ముందే చెప్తే ఈ కోపం...అందం...ఎలా వస్తాయి?"

అరుణ రుసరుసలాడింది... "చాల్లెండి, మాటలు నేర్చారు!"

"నువ్వు నేర్పిందేగా? కోపమా?—" లాలనగా అడిగాడు.

"కాదు... సంతోషం. తమ నిర్వాకానికి, ఆనందం పట్టలేక పోతున్నాను!" చిరాగ్గా అంది!

సుధాకర్ నవ్వాడు... "అదే నాక్కావలసింది!"

కొన్నిక్షణాలు మౌనంగా దొర్లిపోయాయి!

"రేపేనా, ప్రయాణం?" దీనంగా అడిగాడు.

"అమ్మ, మరీ, మరీ రమ్మని బలవంతం చేస్తోంది!"

సుధాకర్ మాట్లాడలేదు!

"పోనీ, రాలేనని చెప్పేస్తాను. మిమ్మల్ని విడిచి నాకూ వెళ్ళాలని లేదు!"

"వద్దు...వద్దు..." సుధాకర్ కంగారుగా అన్నాడు! రాక రాక మీ వాళ్ళు వచ్చారు తప్పకుండా వెళ్ళు! చాలా రోజులు నిన్ను విడిచి ఉండాలనే బాధ మినహా, నువ్వు వెళ్ళడానికి నా అభ్యంతరం ఏమీ లేదు!"

తిరిగి మౌనం...

"మీకు బాబంటే యిష్టమా, పాపంటే యిష్టమా?" హఠాత్తుగా అడిగింది అరుణ!

సుధాకర్ నవ్వాడు..."ఏం,! నా ఇష్టాన్ని బట్టే కంటావా?... నీ యిష్టమే ...నా యిష్టం!"

"అలా తప్పించుకోకండి...చెప్పి తీరాలి!"

సుధాకర్ ఒక్కక్షణం ఆలోచించాడు ...

"నాకు పాప కావాలి!" అరుణ వింతగా చూసింది... "అందరూ అబ్బాయి కావాలని కోరుకుంటారు! మీరు, ఆడపిల్ల కావా లంటారేం?"

"ఏమో" చెప్పలేను! కాని, నాకు ఆడపిల్లే కావాలి. చాతనయితే, ఇవ్వటానికి ప్రయత్నించు!" నవ్వాడు!

అరుణ కూడా నవ్వేసింది... "మీ మాటే నెగ్గుతుంది లెండి!"

"ఏమిటో గ్యారంటీ?"

"మాస్తారుగా! అదంతే!"

ఆర్రాత్రంతా కబుర్లతో తెల్లవారిపోయింది!

## 5


అరుణకు ఆడపిల్ల పుట్టింది! బాలసారె

# ఏటిలోని కెరటాలు

నాడు సుధాకర్ పాపకు 'జ్యోతి' అని పేరు పెట్టాడు ... దుర్గమ్మ పేరు కలిసి వచ్చేలా పేరుపెట్టమని జానకమ్మ ఎంతగా చెప్పినా వినకుండా! "మా అమ్మ పేరు పెట్టుకోడం నాకు నామోషీ అనికాదు! చాలా సంతోషంగా పెడతాను! కాని, రేపు ఇది పెద్దదయి ..పాత పేరు పెట్టినందుకు నన్ను తిట్టుకో కూడదు!" అన్నాడు, ఆమె మాటను మర్యాదగా తిరస్కరిస్తూ!

రాజారావుగారు కూడా అల్లుడినే బలపర్చారు

"ఈకాలం పిల్లల తరహాయే వేరు! అనసూయ, సుబ్బమ్మ, కామాక్షి, సూర్యకాంతం




వంటిపేర్లు నాజూగ్గా, నవనాగరికంగా లేవని, పేర్లు మార్చేసుకుంటున్నారు! కాలంతోపాటు మనుషులు మారుతున్నట్లే, పేర్లుకూడా మారుతున్నాయ్!" అన్నారు!

మొత్తంమీద సుధాకర్ పెట్టినపేరే సార్థకమైంది!

తరువాత... అరుణను, పాపను తీసుకుని విశాఖపట్నం బయల్దేరాడు సుధాకర్!

"అమ్మా ... విజయనుకూడా పంపవే! పాపతో కొంచెం కష్టంగా ఉంటుందినాకు. నాల్రోజులుండి వచ్చేస్తుంది!" అంటూ తల్లిని అడిగింది అరుణ!

విజయకూడా ఆసక్తి చూపటంతో, జానకమ్మ అంగీకరించింది!

విశాఖపట్నం తిరిగి వచ్చేశారు!

"మొత్తంమీద పాపను కని, మాట నిలబెట్టుకున్నావ్!" అన్నాడు సుధాకర్, ఆ రాత్రి!

"కాదు... మీ మాట నిలబెట్టాను..."

"గడుసుదానివే..."

"మీ అర్థాంగినేగా!" నవ్వింది!

"నువ్వు లేనపుడు, క్షణమొక యుగంలా గడిచిందనుకో!"

"ఇప్పుడు యుగమొక క్షణంగా గడుస్తుంది కాబోలు!"

సుధాకర్ జ్యోతిని ఎత్తుకొని ముద్దు పెట్టుకున్నాడు.

"పోలికలన్నీ మీవే!"

"ఇక బుద్ధులు నీవి వస్తాయికాబోలు!" నవ్వాడు!

"వస్తే మంచిదేగా! మంచి రచయిత్రి అవుతుంది!"

"అన్నట్లు...నీ వ్రాతప్రతులన్నీ చూపిస్తానన్నావ్! తెచ్చావా?"

సుధాకర్ జ్ఞాపకంవచ్చినట్లు అడిగాడు!

"తెచ్చానులెండి... కాని ఏముంది చూడ్డానికి?"

"ఏముంటే అదే చూస్తాను!"

అరుణ, పెట్టెలోనుండి తీసి, కాగితాల కట్ట అందించింది.

"తీరుబడిగా చదువుకోండి!" అంది నవ్వుతూ!

అరుణ నిద్రపోయిన తరువాత, కాగితాలు తీసి చూశాడు...

మొదలుపెట్టి విరమించుకున్నవి... సగం వరకూ వ్రాసి వదిలేసినవి... పూర్తి అయి ముఖం చాటుచేసుకున్నవి... మొత్తంమీద చాలా ఉన్నాయి!

"ఈ సమాజం మారాలి... ఎదుగూ, బొదుగూలేని సమాజంలో నవ చైతన్యం రావాలి!


ఆ చైతన్య ప్రవంతిలో ప్రజలు మునిగి పోవాలి...

మునిగి, భావవిప్లవాన్ని సాధించాలి..." అంటూ వ్రాసిందొకదానిలో!

"ఆడది అరిటాకువంటిదని పాత చింతకాయ కబుర్లుచెప్పే ఈ మునలమ్మ మనస్తత్వం మారాలి...

ఆడదికూడా మనిషేనని... ఆడదానికీ మనసుందని అందరూ గుర్తించాలి!

(ఇంకావుంది)






* సిఫారసు చేయబడిన అధికతమ చిల్లర ధర (స్థానిక పన్నుల అనుసారం)

# నాకో మొగుడున్నాడు

## పద్మిని

ఒకటి... రెండూ... మూడు... లెక్క పెట్టుకుంది కల్యాణి. నోట్లన్నీ డబ్బాలో పెట్టి, చేతిలోని చిల్లర చప్పుడు కాకుండా డబ్బాలోకి వదిలింది. డబ్బా గట్టిగా మూత పెట్టి చీరల అడుగున దాచేసింది.

మూడు వందల రూపాయలు! కల్యాణి కళ్ళముందు మెదిలాయి. భారంగా నిట్టూర్చింది!

ఇంతలో గడియారం ఠంగుమని తొమ్మిది గంటలు సూచించడంతో గబగబా వంటింట్లోకి వెళ్లింది. అప్పటికే చెల్లెళ్ళు శిరీషా, కుసుమా, తమ్ముళ్ళు సుధాకర్, వేణు భోజనానికి ఉపక్రమించేస్తున్నారు. వంటింట్లోకి వచ్చిన కల్యాణిని చూడగానే "అదేమిటే కల్యాణీ ఈ రోజు ఆఫీసుకు వెళ్ళవా ఏమిటి? తొమ్మిదవ్వస్తూంది బస్ దొరకద్దూ" అంది కల్యాణి తల్లి, కల్యాణికి పీట వాలుస్తూ. వాల్చిన పీటమీద కూర్చుని "ఎందుకు వెళ్ళనూ? పెట్టు" అంది. "అయినా నీ పిచ్చిగానీ అక్కకేమే? బస్ దొరక్కపోతే ఆటోలో వెడ్తుంది లేదంటే టాక్సీలోకూడా వెడ్తుంది." అంది పెద్దచెల్లెలు శిరీష ఎత్తిపొడుపుగా. కల్యాణి చెల్లెలువంక కోపంగా చూసింది. అక్కవంక నిర్లక్ష్యంగా చూస్తూ "నీ కోపం ఎవడికి లెఖ్ఖలే" అన్నట్లుగా చూసింది శిరీష. కల్యాణి తల్లి ఆ మాటలకు "సంపాదించుకుంటుంది, ఎందులోనైనా వెడ్తుంది. నువ్వూ సంపాదించు" అంది కల్యాణికి అన్నం వడ్డిస్తూ, రెండోకూతురి వంక చూస్తూ. "ఊఁ అల్లాగే" అంది శిరీష ఈసడింపుగా. ఆ ఈసడింపులోని అర్థం కల్యాణి మనసు కలుక్కుమనేట్టుగా చేసింది. తన కిష్టమైన ఆవపెట్టి వండిన అరటికాయకూర కలుపుకుంటూ అప్రయత్నంగా చెల్లెలివంక చూసింది. వయసు అందంతో మెరిసిపోతుంది. నొక్కులజుట్టు రెండు జడలుగా వేసుకుంది. కళ్ళు మీనాల్లా తళతళ లాడుతున్నాయి. బొద్దుగాఉన్న ముద్దబంతి పువ్వులా ఉంది శిరీష. ఆ జుట్టూ! ఆ సొగసూ! ఆ వయసుదికదా... ఆ వయసు దాటితే ఆ సౌందర్యమే ఉండదా? శిరీష తన చెల్లెలేగా. దాని అందం తనకు లేదా?... ఏమిటో ఊహవచ్చిన క్షన్నేళ్ళకి ఈ ముప్పయవపడిలోపడి తను అందం గురించి ఆలోచిస్తూంది —

— "అదేమిటే అప్పుడే నీ తలలోంచి నెరసిన వెంట్రుకలు కనబడుతున్నాయి?" కల్యాణీ, వెనుకవైపునుంచి వచ్చిన కల్యాణి బామ్మ ఎవరో అడిగినట్టు పుటుక్కున్న తెంపి చూపించింది.

కల్యాణి ఆలోచనలను ఆ తెల్లవెంట్రుకలు వెక్కిరించాయి!

"ఆఁ ఈ కాలం కొబ్బరినూనెల మహత్యమండీ. అవి నూనెలా? అందుకే అలా నెరిసిపోవడం" కల్యాణి తల్లి అత్తగారికి వివరిస్తూంది.

"వెధవన్నర కాలం వచ్చిపడిందికదా లేకపోతే ఇంతింత చిన్నపిల్లలకి తలలు నెరవడమేమిటీ?" ఆశ్చర్యపడ్తూ, ఆ తెల్లటి వెంట్రుకలు బయటపడేసి చేతులు కడుక్కోడానికి వెళ్ళిందావిడ. వెళ్తున్న బామ్మకేసి చూస్తూ— "నీ కన్నా చిన్నదాన్నే కావచ్చు బామ్మా. కానీ చాలామందికన్నా పెద్దదాన్ని" అస్పష్టంగా అనుకుంది కనులకు కన్నీటితెర, గొంతుకలో దుఃఖపుపొడ అడ్డుపడగా!—

* * *

టాంక్ బండ్ మీద విహరించేవారిని 'హుస్సేన్ సాగర్' చల్లని గాలితో పలుకరిస్తూంది.

ఆ గాలి తగలగానే కల్యాణికి ప్రాణం లేచి వచ్చినట్లైంది. ఊపిరాడని ఈ 'భాగ్యనగరపు' గదుల్లో మగ్గిపోవడం ఓ సజీవ నరకం! గాలికి ఎగిరిపోతూన్న పమిటను అదుపులో పెట్టుకుంటూ మెల్లిగా నడవసాగింది కల్యాణి. రోడ్డుమీదనుంచి నిరంతర ప్రవాహంలా కార్లూ, లారీలూ, బస్‌లూ ఒకటేమిటి? ప్రపంచాన్ని ఓ చిన్న సైజులో ఈ భాగ్యనగరంతో అమర్చి ఉంచాడా భగవంతుడు అనిపిస్తుంది!

పేవుమెంట్ మీద కిలకిలలాడుతూ నడుస్తూన్న జంటలు! చిలకపలుకు లొలుకుతున్న పిల్లలు! అలా పరీక్షగా చూస్తూ నడుస్తూంది. జీవితంలోని ఆనందానికి నిర్వచనం ఇదేకాబోలు... ఏమిటో తన మనసీమధ్య అస్సలు స్థిమితంగా ఉండడంలేదు ఏమిటేమిటో ఆలోచనలు! ఒకదానితో ఒకటి పొందు కుదరని ఆలోచనలు. ఈ ఆలోచనలకు అంతం ఎప్పుడు? తనకు పెళ్ళైనానాడు. పెళ్ళి!... ఈ మాట తలుచుకోగానే కల్యాణి పెదవులమీద విరక్తితో కూడిన దరహాసం ఉదయించింది. తనకు పెళ్ళవుతుందా? అయినా వయసులో ఆలోచించని ఈ పెళ్ళిమాట తనని ఇప్పుడు కలవరపెడ్తుందేమిటి? కొరడాతో ఎవరో ఛళ్ళు స కొట్టినట్లైంది. తనకు వయసు దాటిపోయిందా? లేదు లేదు తనింకా చిన్నదే! తనకన్నా పెద్దవాళ్లు ఈ లోకంలో చాలా మంది ఉన్నారు. అవును ఉన్నారు. గబగబా ఎవరో తరిమివేస్తున్నట్టుగా అనుకుని సమాధానపడి స్థిమితపడింది. నిజానికి తన జీవితంలో 'కన్నె కలలు' — ఇంతవరకూ కలిగేంత తీరుబాటూ నువ్వొక ఆడపిల్లవే నీకూ భవితవ్యంమీద ఊహాగానం చేసే అధికారం ఉందనిచెప్పే ఆలోచన ఎప్పుడూ రాలేదు బి. ఏ. పాసవ్వగానే నాన్న రిటైర్ కావడం, ఆస్తులు లేకపోవడం, నాన్న పెన్షన్ చాలకపోవడం, ఆ ఇంట్లో బ్రతికేవాళ్లు పది మంది కావడంతో తను ఉద్యోగం చేయవలసి వచ్చింది. అంతే ఏ శుభముహూర్తాన ఈ ఉద్యోగం చెయ్యడం మొదలుపెట్టిందో కాని ఇప్పటికి వచ్చి విముక్తిలేదు. కాదు విముక్తి రాదు! ఇదే సరైనమాట.

తనను ఇంట్లో ఎవ్వరూ ఓ ఆడపిల్లగా గుర్తించరు; అని మొన్న మొన్న తెలుసుకుంది. ఓ నాలుగు నెలల క్రితం అనుకుంటా శిరీషకు ఓ సంబంధం వచ్చింది ఆఫీసులో 'గానుగెద్దులా' పనిచేసి అలసివచ్చిన తనతో ఆదరాబాదరా అమ్మ చెప్పింది "ఒసే కల్యాణీ మన శిరీషకు చాలా మంచి సంబంధం వచ్చిందే". ఏమిటో, అకస్మాత్తుగా ఈ మాటలు వినేసరికి తన నరాలు అనుకోకుండా బాధపడ్డాయి. 'శిరీషకు పెళ్ళా!' ఆశ్చర్య

పడింది. కాఫీ కప్పు అందిస్తూ "అవునే అది ఇంకా చిన్నపిల్లేననుకున్నావా ఏమిటే ? ఇరవై ఏళ్లు దాటుతున్నాయే"

తన వయసెంతో తెలిసింది ! అర్థంలేని బాధ! విప్పి చెప్పుకోలేని అసూయ! అందుకే తన కనుబొమ్మలు ముడిపడ్డాయి "అందుకని"

"అందుకని ఏమిటే పిచ్చిమొహం దానికి పెళ్లి చేసేద్దామని. వాళ్లంతట వాళ్లు వచ్చారు. పిల్ల నచ్చిందని, అప్పటికప్పుడే చెప్పారు. లక్షణమైన ఉద్యోగం పిల్లవాడిది. ఏమిటో ఇన్నేళ్ల నా కాపరంలో ఒక్కనాడు పచ్చతోరణం కట్టి శుభకార్యం చేసి ఎరుగను. కనీసం ఇప్పుడైనా ..." ఏమిటో చెప్పుకు పోసాగింది అమ్మ. తన మనసు పరిపరి విధాల పరుగెత్తసాగింది. బేలపడిపోతూన్న మనసుని చిక్కబెట్టుకుంటూ "ఊఁ బాగానే ఉంది. నేను ఏంచెయ్యను ? చేసేయండి పెళ్లి" కష్టంమీద అంది.

"బాగానే ఉందే, సామెత చెప్పినట్లుంది. నువ్వు పూనుకోబోతే పెళ్లి ఎట్లా అవుతుందే" "అంటే" అడిగింది అర్థం కానట్టుగా. "అదికాదే ఈ గడ్డుకాలంలో ఏదైనా ఊరికే వస్తుందేమో కానీ "పెళ్ళి కొడుకులు" ఏమీ ఇవ్వకుండా వస్తారా ? నాన్నగారా పెద్దవారయ్యారు. ఎవ్వరూ సాయం చెయ్యరు. నువ్వే చూడాలి" అంది. తనకు తెలియకుండానే వచ్చేసింది కోపం. శిరీషే కూతురన్నమాట. దానికే సుఖపడే హక్కు ఉంది. తను కూతురు కాదు. తన గురించి అమ్మ ఎప్పుడైనా ఇలా ఆలోచించిందా ? ఆలోచిస్తే తను ఇలా ముదిరి పోయిన కన్యగా నలుగురులో నేళాకోళం పాలు కావల్సి వచ్చేదా? అందంలేని ఆడదాన్ని చూస్తే ఈ లోకానికెంత నీచం !—అందుకే ఆకోపంలో ఆ మాటలే అడిగేసింది. యోగినిలా కోరికలు లేనట్లుండే తనలో ఇన్ని ఆలోచనలు ఉంటాయని కనిపెట్టలేని కన్నతల్లే తికమకపడింది. అందుకే "ఏమిటే ఆ మాటలు. నువ్వు ఎందుకలా అనుకుంటున్నావ్" అంది. ఇంకేం




చెప్పలేక అక్కడి నుండి వెళ్ళిపోయింది. ఆ తర్వాత శిరీషకువచ్చిన సంబంధం ఏమయిందో తనకు తెలియదు. అందుకే శిరీషకు తనంటే కోపం. తన మధ్య డబ్బు ఎవరికీ తెలియకుండా పోగుచెయ్యడం మొదలు పెట్టింది. ఎందుకూ? పెళ్ళి చేసుకోడానికి. పెళ్ళి చేసుకుని ?—తనకు తనే ప్రశ్నించుకుంది కళ్యాణి. అందరూ ఎందుకు పెళ్ళి చేసుకుంటున్నారో అందుకే. ఏం? తను ఎందుకు పెళ్ళి చేసుకోకూడదూ ? పెళ్ళి ఒక్కటే జీవితానికి పరమార్థమా? ఏమో తనకు తెలియదు. విరుద్ధ భావాలు మనసులో తుఫాన్ రేపుతున్నాయి.

—ఎందుకో చటుక్కున కళ్యాణికి తన చెల్లెలు శిరీష జ్ఞాపకం వచ్చింది. ఏమిటో తను మరీ పిచ్చిదై పోతుంది ! చిన్నతనం శిరీషది. కోరికలకూ—కలలకూ పెనవేసుకు పోతూంది అమాయకంగా. డబ్బు అన్నది లేకపోవడం వల్ల శిరీష వాటినుండి విడదీయబడుతుంది. అయినా తనకు. చిన్నప్పటినుండి ఎప్పుడూ పెళ్ళిమీద ధ్యాస లేనేలేదు సైన్స్‌లో మంచి మార్కులు తెచ్చుకుని డాక్టరై, ఊళ్ళు ఏల్దామనుకుంది. నీలాంటి వాళ్ళకు మేం కొంచెం అద్దామూ అని, ఆ సైన్స్‌లోనే తక్కువ మార్కులు వచ్చాయి. డాక్టర్ కోరిక మూలబడింది. ఆర్ట్స్ చదివి, గుమాస్తాగిరి చేపట్టింది. శిరీష తనలాకాదు ముందు నుండీ దాని తరహా వేరు. పాపం ! ఏదోలా ఎప్పుడో దానికి పెళ్ళి చేసేస్తే తన మేలు అది ఎప్పుడూ మర్చిపోలేదు.. హుసేన్‌సాగర్ మీదుగా వచ్చే శీతలపవనం కళ్యాణి మనసును చల్లబరుస్తోంది

"ఎధవా పెరిగ్గా పట్టుకోలేవు నేనే పట్టుకుంటానన్నానా" అంటూ తన ముందునుంచి వస్తూన్న మాటలకు ఉలిక్కిపడింది కళ్యాణి. తన ఎదురుగా ఒకావిడ పిల్లవాణ్ణి గదమాయిస్తూ వేరుసెనగ ప్యాకెట్టు తీస్తూ తలపైకెత్తింది. లైటు వెలుగులో ఆమె ముఖం చూడగానే కళ్యాణి "ఒరే శీ" అంది ఆనందంగా. ఆ పిలుపు విని ఆవిడ కూడా ఎంతో ఆనందపడుతూ "కళ్యాణి నువ్వేటే? ఎవరో అనుకున్నా. అబ్బ ! ఎంత కాలానికి. రా... అలా నుంచునే ఉన్నావే ఆ సిమెంట్ బల్లమీద కూర్చుందాం రారా" అంటూ ఇద్దరూ ఓ ఖాళీగా వున్న సిమెంటు బెంచీ కోసం చూసి, కూర్చున్నారు. తన ఇద్దరి కొడుకుల్ని ప్రక్కన కూర్చోపెట్టుకుంది "ఊఁ

# నాకూ మొగుడున్నాడు

ఇప్పుడుచెప్పు విశేషాలు" అంటూ కళ్యాణివైపు తిరిగింది. కళ్యాణి పరీక్షగా శశికళవైపు చూడసాగింది, సన్నగావుండే శశికళ లావెక్కింది. ఇప్పుడే అందంగావుంది. చిన్నప్పుడు చీపురుపుల్లలా వుండేది. అప్పుడే అది ఇద్దరు పిల్లల తల్లి "ఏమిటేబాబు, అంత పరీక్ష పెడ్తున్నావు" గలగల నవ్వుతూంది శశికళ. ఆ నవ్వులో అతిశయం ఇమడకపోలేదు. కళ్యాణికూడా సర్దుకుని "ఆఁ ఏంలేదు. ఇక్కడే ఉంటున్నావా ?" అంది "ఉంటున్నావా తప్పు. ఉంటున్నాం ఈ హైద్రాబాద్‌లోనే." "ఆహాఁ ఈ ఊళ్ళోనే ఉంటున్నా నాకు తెలియదుసుమా" ఆ మాటలకు శశికళ నాలుక చప్పరిస్తూ "ఈ రాజధానిలో తెలుసు



"మన రచనలు సమాజవికాసానికి దోహదం చేస్తూ—సినిమా నిర్మాణానికి అనుగుణంగా ఉండాలి...కానీ"

పోడం మాటలేం. అదిసరే నువ్వు ఒకర్తివే వచ్చావా ఏమిటే? మీవారెక్కడికైనా వెళ్ళారా మావారిలాగే" మళ్ళీ నవ్వింది. కళ్యాణి కెందుకో బాగా చిన్నతనమనిపించింది "పెళ్ళా? నాకింకా పెళ్ళేకాలేదు. పెళ్ళికాందే ఆవారు ఎలావస్తారు" అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ. "వ్వాట్ !" కళ్ళంత ఆశ్చర్యపడబోయి తమాయించుకుంది.

"ఆహాఁ అయితే నువ్వు ఒక్కర్తివే ఉంటున్నావా ?"

"లేదు మావాళ్ళతోటే ఉంటున్నాము" అంది సాధారణంగా

"ఐ. సీ" అంది అర్థమయినట్లుగా, కాలుమీద కాలు వేసుకుని దర్పాన్ని సూచిస్తూ.


ఇంతలో శశికళ కొడుకు ఐస్‌క్రీమ్ అమ్మేవాడిని చూసి చంగున గెంతుతూ "అమ్మా, ఐస్‌క్రీమ్" అరిచాడు, ఆ తొక్కిసలాటలో వాడుకాస్తా శశికళ చేతిలోని ప్యాకెట్ తొక్కిపారేశాడు. "ఛ! ఛ! కొని అరగంట కాలేదురా" అంటూ విసుక్కుంటూ తన దగ్గరున్న ఆ పెద్ద హాండ్‌బాగ్ తెరచి "ఇదుగో" అంటూ డబ్బు లిచ్చింది. వాళ్ళు గెంతుకుంటూ ఐస్‌క్రీమ్ వాడి దగ్గరకు వెళ్ళిపోయారు. 'ఉష్'అంటూ ప్యాకెట్ను మళ్ళీ సరిచేసింది. "అబ్బబ్బ ! ఈ పిల్లలకి ఇంతింతగారాలు, అపురూపాలు మప్పుతూంది మా వారేనుమా, ఆయనకి వల్లమాలిన ప్రేమ అనుకో పిల్లలంటే. ఇంక చేతిలోకి డబ్బు వచ్చిందంటే ఆపలేంకదా, 'ఆదెంభర్స్', మంచినీళ్ళకన్నా అన్యాయం. ఇంకనేనన్నా, పిల్లలన్నా అబ్బో ఎంత ఇదో చెప్పలేం. ఇదుగోచూడు. ఈ వేసవి వచ్చిందంటే చాలు క్షణం ఇంట్లో ఉండనివ్వరుకదా. స్కూటర్ మీద ఝుమ్మంటూ నన్నూ పిల్లల్నీ షికారు అంటూ తీసుకువెళ్ళిపోతారు. చాలా మంచి అయనలే. నిత్యం క్రొత్త పెళ్ళికొడుకులా ఉంటారనుకో. రాత్రి అయిందంటే చాలు మల్లెపూలదండా ... అరే ఇవన్నీ నీతో చెప్పేస్తున్నానేమిటే? నీకింకా పెళ్ళే కాలేదుగా ఏం అర్థమవుతాయి?" అంది తనో జోక్ వేసినట్లు గట్టిగా నవ్వుతూ. ఆ మాటలు కల్యాణి మనసును ఎక్కడ దెబ్బ తియ్యాలో అక్కడే దెబ్బ తీసాయి. మనసు బాధగా మూలిగింది ! మనోభావాల్ని తమాయించుకుంది. నవ్వడానికి ప్రయత్నిస్తూ "సరే ఇంతకూ మీ వారేంచేస్తున్నారిక్కడ? నీ పెళ్ళి ఎప్పుడైంది ? " అడిగింది.


"నా పెళ్ళా — చూసావా మీ నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అయిందంటూ వెళ్ళిపోయావు అప్పుడే అయింది నా పెళ్ళి. అంతా సడన్‌గా అనుకోకుండా కుదిరిపోయిందనుకో, బేంక్‌లో ఉద్యోగం. మంచి జీతం; చాలా ఆస్తిపరులు వాళ్ళు. ఒక్కడే కొడుకు. మా వాళ్ళేం తక్కువ ఇవ్వలేదులే ఏభైవేలు ఇచ్చారు" అంటూ అడిగినవీ అడగనివీ గడ గడ చెప్పేసింది శశికళ.

అనాలోచితంగా నిట్టూర్చింది కళ్యాణి.

ఇంతలో ఐస్‌క్రీమ్ తినేసిన ఇద్దరు కొడుకులు చెంగు చెంగున వచ్చేసి కూర్చోబోయారు. "శ్రీరామచంద్రా! ఈ చీరలు

(42వ పేజీ చూడండి)


కృష్ణ సమర్పించు విజయకృష్ణ ఫిలింస్
మీనా
స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: విజయనిర్మల
నిర్మాతలు: పి.వి.రమణయ్య, జి.పి.మల్లయ్య
సంగీతం: రమేష్ నాయుడు
కెమెరా: పి.గోపీకృష్ణ
శ్రీ ఫిలింస్



సీరియల్ నాటకం

# గాలిపటాలు

సూరత్తు వేణుగోపాలరావు

**(గత సంచిక తరువాయి)**

భాస్కర్ : (కొంచెం చిరాకుగా) ప్రతిచిన్న విషయానికీ రాజాతో ముడిపెట్టి రాద్ధాంతం చేసి మనసు పాడుచేసుకోవటం అలవాటై పోయింది. మనకు వచ్చిన కష్టాన్ని గుండె నిబ్బరంతో ఎదుర్కోవాలన్న ధ్యాసే నీకు లేక పోవడం నా దురదృష్టం. నీ హృదయానికి తగిలిన దెబ్బ చిన్నదని అది చులాగ్గా మాని పోతుందని అనుకునేటంత రాక్షసుణ్ణికాను కాని చచ్చిపోయిన మన రాజాని తలుచుకు నైనా బ్రతికున్న ఈ నిర్భాగ్యుడి మీద కొంత జాలి చూపించ మంటున్నాను.

సుమతి జాలి! మీ కంత జాలి ఉంటే కడుపునిండా తిండిపెట్టి పంపించండి. కావా లంటే ఒకటో, రెండో వాడి చేతిలో పెట్టండి. అంతేకాని, నా రాజా వస్తువుల్ని వాడికియ్యమంటంలో ఏమైనా అర్థంవుందా? వాడికీ నా రాజాకీ సాపత్య మేమిటి ?

భాస్కర్ : గోపీ పుట్టింది పూరిగుడిసెలో, పెరిగింది దారిద్ర్యంలో. నిజమే! అంత మాత్రాన వాడిని మనం అసహ్యించుకోవడం న్యాయమేనా ?

సుమతి : న్యాయమో, అన్యాయమో నాకెందుకొచ్చిన గోల! వాడెక్కడ నుంచి వచ్చాడో అక్కడికే పోనీండి. నా రాజా వస్తువుల్ని మాత్రం తాకటానికి వీలులేదు

భాస్కర్ : ( కొంచెం చిరాకుగా ) సరే, నీ యిష్టప్రకారమే కానీ, స్నానంచేసి వచ్చాక నాలుగు మెతుకులు పడేయించు. తీసికెళ్లి మళ్లి ఆ ఆస్పత్రి దగ్గరే వదిలేసి వస్తాను. [విసురుగా. లోపలికి వెళ్లిపోతాడు. సుమతి అచేతనంగా చూస్తూ ఉంటుంది. రామయ్య గోపీని తీసుకువస్తాడు. అప్పుడే స్నానంచేసిన గోపీ వంటికి తువ్వాలు చుట్టుకుని వుంటాడు . .]

రామయ్య : అమ్మా . బాబుకి, బట్టలు —

సుమతి · (ఉలిక్కిపడి) అదేమిటి రామయ్యా! పిల్లవాడికి స్నానం చేయించే ముందే బట్టలు తీసికెళ్లాలని ఎన్నిసార్లు చెప్పాలి? తడివంటిమీద చలిగాలి తగిలితే మంచిదికాదు. ఉండు, ఇప్పుడేతెస్తా (తొందరగా లోపలికెళ్లి బట్టలు తీసుకువచ్చింది. గోపీ హాలు మధ్యకి వస్తాడు) ఇవిగో బట్టలు? [ఇవ్వబోయి గతుక్కు మంటుంది] నువ్వా ?

గోపీ : నేనేనమ్మా! ఎవరనుకుంటున్నారేంటి ?

సుమతి : (యదాలాపంగా) రామయ్యా, ఈ బట్టలు తొడుగు. [రామయ్య గోపీని తీసుకువెళతాడు. లోపలినుంచి భాస్కరు వస్తాడు.]

భాస్కర్ సుమతీ, గోపీ స్నానం ఇంకా కాలేదా ?

సుమతి (వినిపించుకోకుండా కిటికీ దగ్గరకు వెళ్లి చూస్తూ వుండిపోతుంది )

భాస్కర్ సుమతీ, అనుకోకుండా గోపీని తీసుకొచ్చి నీ మనసుకి కష్టం కలిగించినట్టున్నాను హాస్పిటల్ వరండాలో అన్నకోసం పడిగాపులు పడి ఒక్కడూ దిగాలుగా కూర్చుని ఏడుస్తూవుంటే నాకు చెప్పరాని జాలీ, బాధా కలిగాయి. ఒక పూట ఇక్కడ వుంటాడుగదా అని నాతో రమ్మన్నాను వాడిది భీంపేట అక్కడ బ్రతుకు తున్నది మనుషులో, జంతువులో కూడా పోల్చుకోలేం. అందులో పుట్టి పెరిగినవాడికి భవిష్యత్తంటూ ఒకటి ఉంటుందా ?

సుమతి ఎవరి కర్మ వాళ్లది మనం ప్రపంచాన్నంతా ఉద్ధరించగలమా, ఏమిటి ?

భాస్కర్ అందరూ అలా అనుకుంటే ప్రపంచం ఎప్పటికి మారుతుంది ? ఒకడికి సకలైశ్వర్యాలు, ఇంకొకడికి పుట్టు దరిద్రం ఇది ఏం న్యాయమో నాకు అర్థం కావటంలేదు

సుమతి భూమిమీద పుట్టినతరవాత ప్రతి మనిషికీ ఏదో ఒక బాధ లేకుండా వుంటుందా ? మన దుఃఖం ఎవరు తీరుస్తారు ?

(రామయ్య, గోపీ వస్తారు గోపీ క్రొత్త బట్టలు వేసుకుని తల దువ్వుకుని ముద్దుగా కనబడతాడు )

భాస్కర్ (ఆశ్చర్యంగా) అరే ! గోపీయేనా !

గోపీ . అవును, అయ్యగోరూ

భాస్కర్ . ఈ బట్ట లెవరిచ్చారు నీకు ?

గోపీ (తృప్తిగా) అమ్మ ! (రామయ్యని చూపిస్తూ) ఈయన ఏమంటుండో విన్నారా ? నేను అచ్చం రాజాలాగే ఉన్నానంట ఎవరండీ, రాజా?

సుమతి (కోపంతో) ఏమిటా మాటలు ? రాజా సంగతి నీ కెందుకు ? ఉన్న కాసేపూ ఏదో ఒకటి వాగుతుండవలసినదేనా ?

గోపీ (భాస్కర్ దగ్గిరకి వెళ్లి) నే నేమైనా తప్పుమాటన్నానా అయ్యగారూ ? ఆ ముసలాడు అన్నదే అన్నాను

భాస్కర్ లేదు గోపీ ఇందులో ఎవరి తప్పూ లేదు (రామయ్యతో) రామయ్యా, గోపీకి భోజనం తీసుకురా టైమవుతూంది.

రామయ్య అలాగేనయ్యా (లోపలికి వెళ్లి చిన్నపిల్లలు కూర్చునే కుర్చీ తీసుకువచ్చి టేబిల్ దగ్గిర వేస్తాడు )

సుమతి (కోపంగా) రామయ్యా నీకేమైనా మతిపోయిందా ? ఆ కుర్చీ ఎవరికి ?

భాస్కర్ · గోపీకి —

సుమతి అంటే మీ ఉద్దేశ్యం, వీడు మనతోపాటు కూర్చుని భోంచేయాలనా ? ఇదేమి విపరీత మండీ ? రాజాకి ఊహ తెలిసినప్పటినుంచీ మనం ఎప్పుడు భోంచేసినా ఈ కుర్చీయే వాడికి వేసేవాళ్లం. ఈ ఇంట్లో ఏ వస్తువు చూసినా రాజాయే జ్ఞాపకం వస్తున్నాడు. వాడు లేకుండా నే నెలా బ్రతుకుతున్నానో నాకే తెలియటంలేదు (ఏడుస్తుంది)

భాస్కర్ . (దగ్గరకు వెళ్లి ఓదారుస్తూ) కొంచెం నిగ్రహించుకో సుమతీ. నీ బాధ నాకు తెలుసు. వాడున్న ఈ కాసేపూ ఎలాగో ఓర్చుకో. తిండి తిన్నాక వాడిని మళ్లీ తీసికెళ్లిపోతాను రా, నీ చేతితో వాడికి ఇంత అన్నం పెట్టి ఆకలి తీర్చు... గోపీ కూర్చో

[రామయ్య బల్లమీదకి భోజనం తీసుకుని వస్తాడు ముగ్గురూ కూర్చుంటారు. గోపీ ఆత్రంగా తినటానికి ఉపక్రమిస్తాడు )

రామయ్య కొంచెం ఆగుబాబూ ఎందుకలా తొందరపడతావు ?

సుమతి . (అనాలోచితంగా) పాపం. ఎంత ఆకలిగావున్నాడో ..

గోపీ [ముద్ద నోటిలో వుండగానే మాట్లాడటానికి ప్రయత్నిస్తూ] ఇదంతా నాకే ! (రామయ్యతో) ఏయ్, ముసిలోడా ఆ పూరీలు నా కందటంలే... కొంచెం దగ్గరగా పెడితే నీదేం పోయింది ? [చెయ్యి చాచి తీసుకోబోగా మంచినీళ్ల గ్లాసు క్రింద పడి బద్దలైపోతుంది ] అరెరే. . (కొంచెం దిగాలు పడి పోతాడు )

సుమతి చూశారా ? చూశారా ? నా రాజా గ్లాసు కాస్తా పగల కొట్టేశాడు ఎక్కడో ఒక ప్రక్కన వాడికి నాలుగు ముద్దలు పడేస్తే సరిపోయే దానికి, కుక్కను అందలం ఎక్కించినట్లు వాడిని ఆ కుర్చీమీద కూర్చోపెట్టారు. అది చాలక వాడికి రాజా గ్లాసుతో నీళ్లు యిచ్చారు.

భాస్కర్ : గ్లాసు పగిలినంత మాత్రానికే ఎన్ని మాటలన్నావు ? ఇందులో గోపీ తప్పుమాత్రం ఏముంది ? అందుకోబోయాడు చేయితగిలి క్రింద పడిపోయింది పొరపాటనేది ఎవరికైనా వస్తుంది

సుమతి పొరపాటుకాదు. మీరిదంతా కావాలనే చేయించారు నేను వద్దంటున్నా వాడికీ స్నానాలూ, పానాలూ ఎందుకు ? ముష్టివెధవని తెచ్చి మురికి వదిలిస్తే వాడి బుద్ధి ఎక్కడికి పోతుంది ?

భాస్కర్ ముష్టివెధవ, ముష్టివెధవ అని వాడున్న కాసేపూ మాటిమాటికీ, వాడి పేదరికం గుర్తుచేస్తే మనకి ఒరిగేదేమిటి ? వాడు పుట్టింది పూరిగుడిసెలో అయినంతమాత్రాన వాడికీ మనలాగే జీవించే హక్కు లేదంటావా ?

గోపీ (దీనంగా) నాది తప్పైపోయింది ఇంక చాలమ్మా (దిగిపోబోతాడు. గాజుముక్క కాలికి గుచ్చుకుంటుంది ) అమ్మా —

సుమతి · (బిత్తరపడిపోయి చాలా ఆదుర్దాగా) అదేమిటిరా చూసుకోకుండా దిగితే కిందున్నవి గాజు ముక్కలా మరేమన్నానా ? ఎన్నిసార్లు చెప్పాలి బాబూ — గాజు వస్తువులతో జాగ్రత్తగా వుండాలని ? ఆనాడు జ్ఞాపకంలేదూ — వేలు తెగగొట్టుకున్నావు ?

గోపీ నేనా ? (ఆశ్చర్యంగా) వేలు కోసుకున్నానా ?

(ఇంతలో టెలిఫోను మ్రోగుతుంది. భాస్కర్ వెళ్లి తీసుకుంటాడు.)

భాస్కర్ : హల్లో ... డాక్టర్ భాస్కర్ మాట్లాడుతున్నది. అరెరే . పాపం . అలాగే . ఇప్పుడే వస్తాను. (రామయ్యతో) గోపీని లోపలికి తీసికెళ్లి కొంచెం కాలికి కట్టు కట్టించు. (రామయ్య, గోపీ లోపలికి వెళ్లిపోతారు.) సుమతీ . ఇలారా .. నరసింహులు పోయాడు ఈ సంగతి గోపీకి ఎలా చెప్పడం ?

సుమతి . ఎంత దారుణం ? ఆ పసివాడి లేత మనస్సుకి ఎంత దెబ్బ తగిలింది ? (ఉద్వేగంతో) వద్దు, భాస్కర్, వద్దు ! ... వాడికేమీ చెప్పద్దు. చెప్పిమాత్రం ఏం ప్రయోజనం ?

భాస్కర్ . నువ్వు కొంచెం గోపీని చూచుకుంటావుకదూ నేను వెళ్లి వాడి తండ్రికి కబురు చేస్తాను. అవసరమైతే నేనే అతన్ని ఆస్పత్రికి తీసుకువస్తాను

సుమతి : గోపీ తండ్రి మీకు తెలుసా ?

భాస్కర్ · లింగయ్య భీంపేటలో వుంటాడు. కొంచెం రౌడీతరహా . అంతే

సుమతి ఏమో నాకు భయంగావుంది గోపీ తండ్రి సరైన మనిషిలా తోచడంలేదు లేకపోతే చావుబ్రతుకులమధ్య వున్న కొడుకుని హాస్పటల్‌లో పడేసి ఈ పసివాడికి అప్పజెపుతాడా ? ఎక్కడో తప్పతాగి పడివుంటాడు. ఈ సమయంలో మీరక్కడికి వెళ్లి ఈ దుర్వార్త చెప్పితే ఏ అఘాయిత్యం చేస్తాడో

భాస్కర్ : ఏ మీ పరవాలేదులే (వెళ్లిపోబోతాడు.)

సుమతి . ఎంత ఆలస్యమవుతుందో ఏమో ? కొంచెం తినేసి వెళ్లండి . నామాట వినరూ ?..

భాస్కర్ . (ఆగి) నా ఆకలి చచ్చిపోయింది. సుమతీ ! మెడికల్ కాలేజీలో చదువుకునేటప్పుడు ఎన్ని శవాల్ని మాశానో లెక్కలేదు. ఒక్కొక్క కళేబరం చుట్టూ మూగిన విద్యార్థుల రొదలమధ్య ప్రొఫెసర్ నరనరాలు తరచి తరచి చెప్పుతుంటే, మొద్దుబారిపోయిన ఆ శరీరంకూడా ఒకప్పుడు జీవితయాత్ర చేసిందనీ, మనలాగే కష్టసుఖాలూ ఆకలి దప్పులూ అనుభవించిందనీ, నాకు తట్టనేలేదు కాని హాస్పటల్లో మొదటిసారిగా నా చేతిలో ఒక మనిషి పోయినప్పుడు ప్రక్కనే వున్న భార్య కెవ్వుమని కేకవేసి అతని గుండెలమీద పడి హృదయవిదారకంగా ఏడుస్తూవుంటే అక్కడ నిలబడలేకపోయాను మృత్యువంటే ఏమిటో తెలియకుండా తల్లితోపాటు ఏడుస్తున్న పిల్లల్ని చూస్తుంటే నా గుండె తరుక్కుపోయింది. ఒక్క మనిషితో ఎన్ని జీవితాలు లంకెలు వేసుకుంటాయో ప్రప్రథమంగా ఆనాడు గ్రహించాను. క్రమేపీ మామూలు మనిషి నయ్యాను. అప్పటినుంచీ చావులూ బాధలూ నా జీవితంలో ఒక భాగమైపోయాయి మనస్సు రాయిలా గట్టిపడిపోయింది . కాని ఇన్నాళ్లకి ఈవేళ మళ్లీ అది చివుక్కుమంది దానికి కారణం, అక్కడ చచ్చి

పోయిన అన్నా, ఇక్కడ బ్రతికివున్న తమ్ముడో తెలియటంలేదు.

సుమతి : (అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తూ) గోపీని మీతో తీసుకువెళ్తే యిల్లు కనుక్కోడం తేలికగా ఉంటుందేమో కాని ఈ పరిస్థితుల్లో వాడికీసంగతి తెలియనివ్వటం కూడా బాగా లేదు (జాలిగా) కొంచెంసేపన్నా వాడా నరక కూపంలోంచి బయటపడ్డాడు

భాస్కర్ : మరి నేను వస్తాను.

(బయటికి వెళ్లిపోతాడు ఒక్కక్షణం అతడు వెళ్లినవైపే చూసి సుమతి ఉబికివస్తున్న దుఃఖాన్ని ఆపుకుని డైనింగ్ టేబిల్ దగ్గిరకి వెళ్లి కూలబడి పోతూంది. కొంచెం కుంటుకుంటూ గోపీ వస్తాడు

గోపీ : అమ్మా—

సుమతి (ఉలిక్కిపడి అనాలోచితంగా) అమ్మా — (గోపీని దగ్గిరకి తీసుకుని ఒక్కక్షణం భ్రమిస్తుంది) ఆ మధురమైన పిలుపు విని ఎన్ని రోజులైనదిరా ? అను ... మళ్లీ అను ... (తెప్పరిల్లి) గోపీ . నువ్వు బడికి వెళ్తున్నావా ?

గోపీ : బడా ? మాలాంటి బీదోళ్లకి బడి ఎలాగమ్మగోరూ ? మా అయ్య గుడుంబా కాస్తాడు. రాత్రిపూట ఈ పేటా ఆ పేటా చేరేస్తే నాలుగు పైసలు దొరుకుతాయి ఆటితో పతంగుల పందే లాడతాం మొన్న పండగకదమ్మా ! నాకు ఒక్క పతంగుకూడా లేకపోతే అయ్యని పదిపైసలడిగా. మాంచి నిషాలో ఉన్నడు. ఓరి లఫూట్, నీకు పతంగులు కావాలిరా అని, కొట్టి తోశేసిండు

సుమతి : (జాలిగా) మరి మీ అమ్మ ?

గోపీ మా అమ్మ లేదమ్మా ! సచ్చిపోయింది. (కొంచెం వెక్కి వెక్కి ఏడుస్తూ) సచ్చిపోయింది !!

సుమతి : (దిగులుగా, దుఃఖం భరించలేక) అయ్యో పాపం ! నువ్వు తల్లిలేనివాడివా బాబూ !

గోపీ : మా అమ్మ కిందటేడు దీపాళి పండగ నాడు సచ్చిపోయిందమ్మగోరూ —

సుమతి : దీపావళినాడా? సరిగ్గా అదే రోజు. (ఉధృతమైన ఆవేదనతో) అదే రోజు, నా యిల్లు కూడా అంధకారమైపోయింది

గోపీ . అదేంటమ్మగోరూ ! అలా బాధపడి పోతున్నారు ? మా అమ్మ దేముడి దగ్గిరకెల్లి పోయింది దేముడి దగ్గిర కెల్లినోళ్లకోసం ఏడవ గూడదంటగా ? నిజమేనా అమ్మగోరూ ?

సుమతి . ఔనుబాబూ, చచ్చిపోయిన వాళ్లంతా దేవుడి దగ్గిరకే వెళ్తారు అదిసరే, మరిప్పుడు నీకు అన్నం ఎవరు పెడ్తున్నారు ?

గోపీ . (కొంచెం విసుగ్గా) మా చిన్నమ్మకి అన్నం పెట్టాలంటేనే చిరాకు మా అయ్య దాన్ని పెట్టుకున్నాడంట నన్ను, నరిశిమ్మల్నీ ఎప్పుడూ కొడ్తావుంటుంది.

సుమతి : చాల్లే, నాయనా, వినడానికే కష్టంగా వుంది. కొంచెం పడుకుంటావా ?

గోపీ : (లేచి లోపలికి వెడుతూ, ఆగి) మరి నేను దవాఖానాకి వెళ్లద్దా ? అన్న ఎలాగుండో !

# గాలిపటాలు


ఆడు ఎన్ని ఖరాబు పన్లు చేసినా ఇంకోళ్ళు నా మీద చెయ్యి చేసుకుంటే వూరుకోడు అవసరమైతే నా పాణాలు నీకిస్తారా అనేవాడు.

సుమతి . (కలవరంగా) నీ అన్న సంగతి డాక్టరుగారు చూసుకుంటారులే అయినా డాక్టర్లు మందులు పోస్తారుగాని ప్రాణాలు — (ఆగిపోతుంది గోపీ లోపలికి వెళ్తాడు)

రామయ్య : (లోపలినుంచి వచ్చి బల్లకేసి చూచి నిర్ఘాంతపోయి) ఇవాళ ఏమయిందో ! అయ్యగారు ఆస్పత్రికీ ఇంటికీ మధ్య పరుగులు పెడుతూ ముద్ద ఎత్తలేదు మీరు భోజనం దగ్గిర కూర్చుని కూడా ఒక మెతుకు ముట్టలేదు భగవంతుడా ! ఇలా అయితే నా కెందుకీ వంటపని ?

సుమతి . సరేలే, నా మనస్సు మనసులో లేదు (శూన్యంగా చూస్తూ) దీపావళి ! దీపావళి నాడే నన్నమాట...

రామయ్య (అర్థం చేసుకోలేక) దీపావళి ఏమిటమ్మా ఈ పిల్లగాడు ఏవేళ ఇంట్లో కాలు పెట్టాడో అంతా గందరగోళంగా తయారైంది




మనకెందుకమ్మా, ఈ భీంపేటోళ్ల గొడవలు ? ఆర్పగలమా ? తీర్చగలమా ?

సుమతి : రామయ్యా నీక్కూడా మతి పోతున్నట్లుంది ! దీపావళినాడే గోపీ తల్లి పోయిందట. తల్లిలేని బిడ్డగా వాణ్ణి, బిడ్డలేని తల్లిగా నన్ను చేసిన రోజు ! దేశాని కంతటికి పర్వదినం—మా ఇద్దరికీ మాత్రం ఎంత దుర్దినం ?

రామయ్య (గద్గదికంగా) ఊరుకోండమ్మా ఊరుకోండి.. గోపీ వస్తున్నాడు

సుమతి (కళ్లు తుడుచుకుని బల్లదగ్గిర నుండి లేచి సోఫాలో కూర్చుంటుంది. ముఖంలో తెచ్చిపెట్టుకున్న ధైర్యం. గోపీ కుంటుకుంటూ వస్తాడు.) గోపీ, రా. ఇక్కడ కూర్చుందాం. కాసేపు పండుకోకపోయావా ?

గోపీ : నిద్ర రావటంలేదమ్మా (క్రింద కూర్చోబోతాడు.)

సుమతి : (ఆప్యాయంగా) అదేమిటిరా, క్రింద కూర్చుంటున్నావు ? రా వా ప్రక్కనే కూర్చోబాబూ (దగ్గిరకి తీసుకుంటుంది) పాపం, చాల అలిసిపోయావుకదూ !

గోపీ : అవును అమ్మగోరూ ! వళ్లంతా హూనమైపోయింది (ఆలోచిస్తూ) అన్నగాడెట్లున్నడో పాపం ? మధ్యాహ్నం వాడికి సూదిమీద సూది పొడిచిండ్రు. దవాఖానాలో వుండకుండా ఇక్కడికి వచ్చానని తెలిస్తే మా అయ్య చంపేస్తాడు—అబ్బా!—

సుమతి : అయ్యో, కాలు నొప్పిపెడుతుందా ? నువ్విలా కాస్త పడుకో డాక్టరుగారు వచ్చింతర్వాత కనుక్కుందాం. [నెమ్మదిగా వీపుమీద తడుతూ వుంటే గోపీ అలాగే కూర్చుని కునికిపాట్లు పడుతూ వుంటాడు ]

గోపీ : [అకస్మాత్తుగా] అమ్మా

సుమతి . [ఉలిక్కిపడి] అమ్మా ! ఎన్నాళ్లయింది బాబూ నన్ను అమ్మా అని పిలిచి ! ఇన్నాళ్ళూ ఎక్కడ దాక్కున్నావు రాజా ? [మళ్లా తేరుకుని] పడుకో, నీ ప్రక్కనే వున్నాగా లాలి పాడమంటావా ?

గోపీ (సగం నిద్రలో) ఊఁ...

సుమతి : (నెమ్మదిగా జోల పాడుతూ వుంటుంది.)

రామయ్య : (లోపలనుంచి వచ్చి ఒక్క క్షణం చూస్తాడు ) అమ్మగారూ —

సుమతి : (పాట ఆపి) ఏమిటి రామయ్యా ?

రామయ్య . గోపీ నిద్రపోయినట్లున్నాడు. లోపలికి తీసుకెళ్లి పడుకోబెట్టనా ?

సుమతి : (అనాలోచితంగా) నిద్రవచ్చినప్పుడు బెడ్‌రూమ్‌లోకి వెళ్లి పడుకోవాలంటే వింటాడా ? ప్రతిరోజూ సోఫాలో నిద్రపోవడం, మనం తీసికెళ్లి పడుకోబెట్టడం అలవాటైపోయింది .. సరే తీసుకెళ్లు. నేను వస్తాను.

(రామయ్య పిల్లవాడిని ఎత్తుకుని లోపలికి వెళ్లిపోతాడు అతని వెనకే సుమతి ... కొంచెం వ్యవధి — తలుపు దబదబా కొట్టిన శబ్దం.)

రామయ్య : (లోపలనుంచి వస్తూ) ఎవరండీ?

(తలుపు తీసీ తియ్యడంతోనే లింగయ్య తోసుకుంటూ వస్తాడు. జేవురించిన కళ్లు, బుంగ మీసాలు, మాసిపోయిన లుంగీ, చొక్కా, తప్ప త్రాగిన వాలకం.)

లింగయ్య : డాక్టరుసాబ్ !

రామయ్య : డాక్టరుగారు లేరు ఆసుపత్రికి వెళ్లారు.

లింగయ్య దవాఖానాకి పోతే ఇంటికి పోయిండ్రన్నారు. ఇంటికి వస్తే దవాఖానాకి పోయిండంటన్నావు ? తమాషాగా వుందే ?

రామయ్య : (కొంచెం భయపడుతూనే, బింకంగా) పెద్దోళ్లింటికి వచ్చి ఏమిటయ్యా నీ గోల ! డాక్టరుగారు లేరని చెప్తున్నాగా !

లింగయ్య : పోనీలే, మా గోపీగాడు ఇక్కడికి వచ్చాడంటగా ? పోకిరినాయాల, అన్నని చూడమని పంపిస్తే పరారైపోయాడు.

రామయ్య : ఇంతకీ నీవు గోపీ...

లింగయ్య : అవునయ్యా గోపీ నా కొడుకు.

ఇక్కడ వున్నాడా లేడా ? ఏం? మాట్లాడకున్నావు? బద్మాష్!

రామయ్య (భయపడుతూ) సరిగా మాటలు రానీ

లింగయ్య పిల్లోడిని తీసుకొచ్చి దాచేశావా ? అలా చూస్తావేం ? లింగయ్యంటే ఎవరనుకుంటు న్నావు ? (జేబులోంచి కత్తి తీసి చూపిస్తూ) ఊ, చెప్పు, తొందరగా చెప్పు లేకపోతేనా ? (లోపలినుంచి సుమతి వస్తుంది ఆమెను చూసి లింగయ్య వెనక్కి తగ్గి కంగారుగా కత్తి జేబులో పెట్టేస్తాడు)

సుమతి ఎవరు నువ్వు ?

లింగయ్య : మా గోపీకోసం వస్తే ఈ ముసిలోడు లేనిపోని మాట లంటుండు. ఊరికే తమాషాకి భయపెడుతున్నా అంతే — మీరేమీ భయపడ కండి. నేను ఖూనీకోరుని కాను.

సుమతి : నువ్వా? గోపీ తండ్రివా? అంటే. లింగయ్య—

లింగయ్య : అవును తల్లీ, మా బుల్లోడు అంతా చెప్పేశాడన్నమాట !

సుమతి : (గాబరాగా) నువ్వు ఆసుపత్రికి వెళ్ళలేదూ ?

లింగయ్య : పొద్దిమికి అయిదింటికే ఎల్లా నమ్మా నరిసింహుల్ని డాక్టరుసాబ్ మంచిగ చూస్తుండని, ఆయన గోపీని తీసికెళ్లిండని నరుసమ్మ చెప్పింది. సరాసరి ఇక్కడికే బయలుదేరి వస్తుంటే దారిలో దోస్తు కలిసిండు ఒక నిమిషం రారా అంటే హోటలు కెల్లా, ఆమాటా ఈమాటా ఆలస్యమయింది

సుమతి . (చీదరంగా) కొడుకు చావుబ్రతుకుల్లో వుంటే నీవు త్రాగి తందనాలు త్రొక్కుతున్నావన్నమాట

రామయ్య (ఆదుర్దాగా) వాడు మంచిమనిషి కాదు. మనకెందుకమ్మా

లింగయ్య నరిసింవులు బాగుండాడుగదమ్మా నరుసమ్మ ఇంకేం పరవాలేదంది ... లేకుంటే వదిలి పెట్టి పోతానా ?

సుమతి లింగయ్యా, (బాధగా) నీకు చెప్పటానికి నోరు రావటంలేదు నరిసింవులు అరగంట క్రిందే పోయాడట

లింగయ : [కూలబడిపోయి] ఎంతమాట చెప్పావు తల్లీ ! నా నరసింవులు చచ్చిపోయిండా అయ్యో దేముడా [తెప్పరిల్లి] అంతే, నాకు శాస్తి కావలసిందే అంతే

సుమతి . [జాలిగా] డాక్టరుగారు శాయశక్తులా ప్రయత్నం చేశారు కాని లాభంలేకపోయింది. నిన్ను వెతుక్కుంటూ వెళ్లారు.

లింగయ్య అంతా నా తలరాత . గోపీ ?

సుమతి గోపీ ఇవాళ ఇక్కడే వుంటాడులే. డాక్టరుగారు నీకోసం, భీంపేట వెళ్లారు నువ్వు ఆసుపత్రికి వెళ్లి పిల్లవాడిని తీసుకో. ఈలోపల ఆయనకూడా అక్కడికే వస్తారనుకుంటాను. పాపం! ఎంత కష్టం వచ్చింది ! నీతో మా రామయ్యని పంపించమంటావా ?

లింగయ్య [అపరిమితమైన బాధతో] వద్దమ్మా, ఎవ్వరూ వద్దు [వెళ్లిపోతాడు. తెర.]

## రెండో అంకం

[మర్నాడు మధ్యాహ్నం. డాక్టర్ భాస్కర్ ఇల్లు. మొదటి అంకంలో లాగానే వుంటుంది అలమారా మాత్రం తీసివుంటుంది అందులో నుండి తీసిన బొమ్మలు కొన్ని సోఫాలో చెల్లాచెదురుగా పడి వుంటాయి సుమతి, ఆమె వెనకే గోపీ ప్రవేశిస్తారు సుమతి నిన్నటి సుమతి కాదు. క్రొత్త చీర కట్టుకొని కళ కళ లాడుతూవుంది ముఖంలో ఆనంద రేఖలూ, నవోత్సాహమూ కనబడుతున్నాయి ]

సుమతి గోపీ, నీ కిక్కడ బాగా వుందా ?

గోపీ : ఓ ! మంచిగుందమ్మా !— ఈ బొమ్మ లన్నీ నాకేనా ? మరో పోరగాడు గుంజుకుపోడుగదా

సుమతి : నీకేలే, ఎవరూ లాక్కుపోరు. అయితే, మీ అయ్య నిన్నిక్కడ ఉండనిస్తాడా ? అసలే — [ఏదో అనబోయి నాలిక కొరుక్కొంటుంది] కాని, ఇక్కడ వుంటే నీ ఇష్టం వచ్చినట్లు అల్లరిచిల్లరిగా తిరగడానికి వీలులేదుసుమా. రోజూ బడికి



వెళ్లి చక్కగా చదువుకోవాలి

గోపీ . [కొంచెం నిస్పృహతో] భలేగుందే! ఎప్పుడూ చదువంటే సావాసగాళ్లతో పతంగు లెగరేసే దెప్పుడు ?

సుమతి [ఉలిక్కిపడి] పతంగులా ?

గోపీ . అవునమ్మా. అవే గాలిపటాలు ఎన్నెన్ని రంగు రంగుల పటాలున్నాయి? పచ్చీన్‌దార్, టోపీలంగోట, డొప్పన్, గిల్లోరా...

సుమతి . [కోపంగా] ఆగు ! ఆ పతంగుల సంగతి మాత్రం ఇక్కడ ఎత్తొద్దు... [విపరీతమైన ఆవేదనతో] వద్దుబాబూ. వద్దు... అవి పటాలు కావు పడగలు పాము పడగలు.

[బయటనుంచి పిల్లల కేరింతలూ, పరుగులెత్తుతున్న అడుగుల శబ్దం వినవస్తుంది ]

గోపీ : [కిటికీ దగ్గరకి పరుగెత్తి] అరే! అరే ! భలే మంచిగా కొడుతుండయ్

సుమతి : [దగ్గరకి వెళ్లి గోపీని లాక్కొని వస్తుంది.] పతంగుల సంగతి ఎత్తవద్దని ఇప్పుడేగా చెప్పాను ! [జేవురించిన ముఖంతో] వాటిజోలికి పోతావా ? ..

గోపీ : [దీనంగా] ఒక్క పటం కొనిపెట్టమ్మా

సుమతి ఛీ! నోరుముయ్! [ఆవేశంలో చెంపమీద ఒకటి చెళ్లున వేస్తుంది. గోపీ కొంచెం కొంచెం ఏడుస్తూంటే దగ్గరకు తీసుకుని] వద్దు నాయనా... అవి మంచివి కావు. . నా మాట వింటావుకదూ ! నీకు వేరే మంచి మంచి బొమ్మలు కొనిస్తాను . సరేనా ? [కొంచెం ఆగి] అరే, నాలు గౌతావుంది. లోపలికి వెళ్లి కాస్త హార్లిక్సు తాగిరా. .

[గోపీ వెళ్లిపోతాడు . సుమతి ఒక్క క్షణం ఆలోచిస్తూ వుండిపోతుంది. ఏదో చటుక్కున జ్ఞాపకం రాగా, గబగబా టెలిఫోను దగ్గిరకు వెళ్లి ఫోను తీస్తుంది.]

సుమతి : హల్లో . వెంకన్నశెట్టిగారి సిటీ ఎంపోరియమేనా ? నేను డాక్టర్ భాస్కర్‌గారి యింట్లోనుంచిమాట్లాడుతున్నాను ..నమస్కారం.. అర్జెంటుగా రెడిమేడ్ దుస్తులు కావాలి .. తొమ్మిదేళ్ల పిల్లవాడికి ... చొక్కాలూ, లాగూలూ, సరి క్రొత్త నమూనాలు పంపించాలి సుమండీ .. ఇప్పుడే . థ్యాంక్సు ...

[సుమతి ఫోను పెట్టేస్తుంది. బయట మెట్లెక్కుతున్న శబ్దం తలుపు తోసుకుని కూని రాగంతో వాణి ప్రవేశిస్తుంది ]

వాణి : హల్లో, సుమతీ, ఇవాళ ప్రొద్దుట నుంచీ మీటింగులతోనే సరిపోయింది సాయంత్రం మళ్లీ కల్చరల్ ప్రోగ్రాము వుంది నువ్వేమన్నా వస్తావేమో కనుక్కుందామని వచ్చాను భాస్కర్‌కూడ వీలైతే వస్తానన్నాడు [కొంచెం పరకాయించి చూచి] అరే! నీ వివాశేదో క్రొత్తగా కనిపిస్తున్నావే !

సుమతి . [చిరునవ్వుతో] నువ్వూ, నీ సభలూ! ఎప్పుడూ వుండేవేగా ! ఇంతకీ ఇవాళ ఎవర్ని ఉద్ధరిస్తున్నారేమిటి ?

వాణి . అంత చులాగ్గా తీసివేయబోకు, మరి అందరూ అలాగే అంటే నడుంకట్టుకుని పనిచేసే దెవరు ? ఇవాళకి ఇవాళ చూడు ! మా సంఘ వార్షికోత్సవం. సాంఘిక సంక్షేమశాఖా మంత్రిగారు అధ్యక్షులు. బొంబాయినుండి శ్రీమతి వసంతా బండార్కర్ వచ్చింది నువ్వెప్పుడూ వినలేదు కాబోలు ఏ సాంఘిక సమస్యమీదైనా సరే అనర్గళంగా రెండు గంటలసేపు చెప్పింది చెప్పకుండా మాట్లాడగల ప్రజ్ఞావంతురాలు ఇలాంటి సమావేశాలు అర్గనైజు చెయ్యాలంటే మాటలా ? ఇన్విటేషన్ల దగ్గిరనుంచి విరాళాలదాకా నేనే తంటాలుపడాలి మధ్యాహ్నం రిట్జ్ హోటల్లో లంచ్. ఇంతా చేస్తే పత్రికా ఫొటోగ్రాఫర్లు గైరాజరైపోయారు. వాళ్లకి సరిగా కబురందలేదట. మళ్లీ వాళ్లకోసం హడావడిగా పరుగులు అబ్బబ్బ ! ఏమి చెప్పమంటావులే నా అవస్థలు !

సుమతి : వాళ్లు రాకపోయినంత మాత్రాన ఏం పోయింది ?

వాణి . బాగా నేవుంది ! అవసరమైనవాళ్లే రాకపోతే, మేము పడే శ్రమా, చేసే పనీ, ప్రపంచానికి ఎట్లా తెలుస్తుంది ? సరైన పబ్లిసిటీ లేకపోవటం వల్లనే మన సాంఘిక కార్యక్రమాలు దెబ్బతింటున్నాయని నా ఉద్దేశ్యం.

[ఇంకా వుంది]



# చిన్నారి చిలిపి చేష్టలు

బళ్లు తెరవగానే మా పాపాయిని కూడా అక్షరాభ్యాసం చేసి, మంచి మాటలాడి బళ్లో వేశాము. కొత్త బట్టలు, కొత్త మేజోళ్లు, జోళ్లు, పెట్టె, క్యారియర్ ఈ వ్యవహార మంతా చూసి సరదాపడి అది బడికి ''ఆయా'' వెంట బాగానే వెళ్తోంది... ''సరే యికనేం'' అనుకున్నాముకాని నో రెండు వారాలైనాక దాని పుస్తకాలు పారాలూ అవీ చూడాలని ుచ్చటపడి, ''పాపా! నీ పుస్తకాలు తేవే!'' అన్నాను

గునగునా వెళ్లి పెట్టె మోసుకుని వచ్చి చూసుకోమంది. తెరచి చూద్దునుగదా ఒక పుస్తకంలో మొదటి రెండు పేజీలు ఎవరో పట్టుకుని 'ఫ(రున' చించేసినట్లుంది...

''ఇదేంటే పాపా! ఈ పుస్తకంలో పారాలు ఎవరు చింపేశారు!'' అన్నాను.


''నే నే న మ్మా'' అంది గొప్పగా చూస్తూ

''తప్పుకాదూ...?!'' అన్నాను

''మరి ఆ రెండు పారాలు ఐపోయాయి కదా...అందుకే చింపేశాను'' అంది.

''ఐపోతే చింపుకుంటారా? ఎవరైనా? ఎక్కడ చూసేవే?'' అన్నాను కోపాన్ని దిగమింగుకుని...

''నువ్వు క్యాలండర్‌లో నెల అవగానే కాగితాలు, చింపిపారేశావుగా, అందుకనే నేను పారాలవగానే ఆ కాయితాలు చించిపారేశా'' నంది మా పాప!



ఏం చెప్పమంటారు?

— శ్రీమతి మధురకవి వత్యవతి

## యువతరం



ఇంట్లోవాళ్లు పంపిస్తే సినిమాలే తెగచూడాలన్న సరదావున్న పి. విజయ ఎస్. ఎస్. సి చదువుతోంది. డాక్టరీ చదివాకపెళ్లిచేసుకోవాలనుంది. ఫ్యాషన్‌లంటే సరదా వుంది గాని, యింట్లో తిడతారట! విజయనిర్మల, కృష్ణ, హేమమాలినీ మొదలగువారంటే సరదా. విజయలలిత వ్యాంప్ వేషాలంటే 'బోర్'ట! బెర్నాడ్‌షాని కూడా చదువుతుందిట.



ఇండియన్ మెడిసిన్ మొదటి ఏడాది చదువుకుంటూన్న ఈ హైద్రాబాద్ యువతి సి. హరిణికి స్నేహితులంటే ఐస్ క్రీమంత యిష్టం లత, ఎస్. జానకీల పాటలంటే ''పడి చస్తుంది''— విజయనిర్మల, శతృఘ్నసిన్హాలంటే ''లైకింగ్''. సూర్యోదయం చూడాలని తెల్లారుగట్ల లేచే ఈమె వైద్యురాలైతే పేదలకు ఉచితంగా వైద్యం చేస్తుందిట! కొటేషన్‌లను సేకరించే హాబీ గల యీామెకి 'బాలాజీ' అంటే భక్తి.


## ''పరుగెత్తి పాలుతాగు!''

ఎన్నాళ్లని
నిలబడతావ్ నీళ్లుతాగుతూ ?
ఇంకెన్నాళ్లని
నిలబడతావ్ వెలగని దీపస్తంభంలా !
నీ నోటి ముందు కూడు
వాడెవడో తన్నేస్తుంటే !
నీకు రావల్సిన ఉద్యోగం
వాడెవడో సిఫార్సుతో కొట్టేస్తుంటే !
నీవు పండించిన పంటని
వాడెవడో దోచేస్తుంటే !
నీవు వండించిన వంట చుట్టూ
వాడెవడో చలికాగుతుంటే !
ఎన్నాళ్లని
నిలబడతావ్ నీళ్లు తాగుతూ ?
ఇంకెన్నాళ్లని
నిలబడతావ్ వెలగని దీపస్తంభంలా !
సముద్రతరంగంలా
రణరంగంలో తురంగం లా
ఉరకలు వేస్తూ
పరుగులు తీస్తూ
ఫెళఫెళ ఫెళ ఫెళ
ధనధనధనధన
విరుచుకుపడు వేస్తం
కనుతెరచి కదులు వేస్తం !

రచన : రామనూరి

క డ ప కు

# 10 మైళ్ళదూరంలోగల పుష్పగిరి క్షేత్రం



శివకేశవుల అభేద ప్రతిపత్తికి ప్రత్యక్ష సాక్ష్యంగా వున్న పుణ్యక్షేత్రం పుష్పగిరి. కడప పట్టణానికి వాయవ్యంగా పదిమైళ్ల దూరంగా వున్న పురాతన క్షేత్రమిది. ఉరకలు వేస్తూ పరుగులిడే పినాకినీ నదీ తోయాలతో మనోజ్ఞమైన ప్రకృతి దృశ్యాలతో పునీత మైన క్షేత్రమిది.

పుష్పగిరి గుట్టపై గదాధరస్వామి అని పిలువబడు చెన్నకేశవాలయము అత్యంత ప్రసిద్ధమైనది. ఈ ఆలయ ఆవరణలో సంతాన మల్లేశ్వర, సాక్షి మల్లేశ్వర, యోగాంజనేయుల ఆలయము లున్నవి. ఈ ఆలయములేకాక పాపవినాశేశ్వర, దుండి వినాయక, పుష్పనాథేశ్వర, కమలసంభవేశ్వరస్వామి ఆలయములు, ద్వాదశ శివాలయములు, ప్రయాగ మాధవస్వామి ఆలయము, దుర్గాలయము వున్నవి. మాధవస్వామి మందిరం వద్దనే రుద్రపాద మున్నది.

## మహిమగల కోనేరు

పుష్పగిరి కొక గాధ ఉన్నది. ఆ ప్రాంతమున ఒకప్పుడు కాంపల్లె అనే గ్రామం వుండేది. దగ్గరనే ఒక కొలను. ఒక ముసలి రైతు నీరు త్రాగుటకై కొలనులో దిగగా కాలుజారి పడ్డాడు. మునకలువేసి లేచేసరికి ఆ ముసలి రైతు పడుచువాడుగా మారిపోయాడు. ఆనందంలో గంతులువేస్తూ ఆ ముసలి రైతు తన బక్క ఎద్దులను కొలనులో ముంచాడు. అవి కోడెలుగా మారాయి. కొంతసేపటికి అన్నం తీసుకుని వచ్చిన తన ముసలి భార్యనుకూడా నీటిలో ముంచాడు. ఆమెకూడా యువతిగా మారింది. ఆ ప్రాంతం వారందరూ మునకలువేసి యువకులయ్యేవారు. ఇందుకు కారణం ఒకప్పుడు అమృతభాండాన్ని ఇంద్రలోకంనుండి తీసుకువెళుతూ గరుత్మంతుడు ఈ కొలను మీదుగా పోయాడని, ఆ భాండంనుండి కొన్ని బిందువులు ఈ కొలనులో పడ్డాయని అందువల్లనే కాంపల్లె కొలను ప్రసిద్ధమైందని చెబుతారు. ఈ సరస్సును మూసివేయాలని వాయువు ఒక కొండను తెచ్చి కొలనులో వేశాడని ఆ కొండ ఒక పుష్పంగా పైకి తేలిందని అదే పుష్పగిరిగా మారిందని చెబుతారు.


ప్రతాపరుద్ర దేవుడు, విజయనగర రాజులు మున్నగువారు ఈ దేవాలయములకు పెక్కు దానములను చేసినట్లు ఆలయమందలి శాసనములు తెల్పుచున్నవి. పుష్పగిరి గ్రామంలో గల ఆలయమందలి స్తంభములు అతిలోక శిల్ప కళాఖండములు. శ్రీ కామాక్షీ దేవి ఉత్తరాభిముఖియై యున్నది. శ్రీ దేవి ముందు భాగమున భూమిపై శ్రీ చక్రము ప్రతిష్ఠింపబడియున్నది. ఈ చక్రమును ప్రతిష్ఠించినవారు విద్యారణ్య యతీంద్రులు.

అద్వైత మత ప్రచారమునకై ఆంధ్ర దేశమున నెలకొల్పబడిన అద్వైత పీఠములలో పుష్పగిరి అగ్రగణ్యము. ఆదిశంకరులచే పూజ లందుకున్నది.

కడపనుండి పుష్పగిరికి రహదారి యున్నది. త్రికూటేశ్వరాలయమున ఇటీవలనే ప్రాచీన శిల్ప ప్రదర్శనశాల యొకటి నెలకొల్పబడినది.

మహిమాన్విత మైన అద్వైత పీఠముగా శిల్పకళా నిలయముగా ప్రసిద్ధమైన క్షేత్రం పుష్పగిరి.

రచన : జా॥ మ॥ హనుమచ్ఛాస్త్రి
ఫోటోలు : పాతేపల్లి వెంగన్నశెట్టి



"డియర్ రాజా!

నీ ఉత్తరం అందింది. సమాధానం వెంటనే రాయలేకపోయాను. అందుకు నన్ను క్షమించు. ఇచ్చట మేమంతా క్షేమం.

ఈమధ్య నేను ఓ చిన్నపనిమీద మద్రాసు వెళ్లాను. తిరుగు ప్రయాణంలో నాయుడుపేటలో దిగాను, రంగనాథం మాస్టారుగార్ని చూచివెళ్దామని పాపం! మాస్టారిగారి సంసారం చాలా చితికినట్లుంది. రిటైరై నాలుగు సంవత్సరాలైందట. చెట్టంత కొడుకు, చేతి కందిన కొడుకు ఏడాది క్రితం పోయాట్ట. గోరుచుట్టుమీద రోకటిపోటు అన్నట్టు మేస్టారిగారి అల్లుడు కూడా ఇటీవలే చనిపోయాడట. పాపం! పార్వతమ్మ అత్తగారింట్లోనే ఉంటున్నదట. మేస్టారుగారికి నిన్ను చూడాలని వుందట. వీలుచూసుకొని వొక్కసారి తప్పకుండా వెళ్లి చూసిరా.


ఇట్లు,
వాసు."

ఉత్తరం మడిచి జేబులో పెట్టుకొన్నాను. రాక్షసి బొగ్గు రవ్వల్ని నలువైపులా చిమ్ముకుంటూ చీకట్లను చీల్చుకుంటూ వెళ్తున్నది రైలు. కంపార్టుమెంటులో దీపాలు కాంతి హీనంగా వెలుగుతున్నవి. రెండు సిగరెట్టు దమ్ములు ఘాటుగా లాగి ప్రయాణీకుల వంక కలియచూశాను. కొంతమంది ప్రయాణీకులు కూర్చొని కునికిపాట్లు పడుతున్నారు. మరికొందరు పక్కవాళ్ల భుజాలకు తలలానించి నిశ్చింతగా జోగుతున్నారు. ఓ దిక్కులేని ఆడకూతురు ఏడాది బిడ్డను వొళ్లో కూచోబెట్టుకొని బిత్తర చూపులు చూస్తున్నది. బహుశా టికెట్టు లేదుకాబోలు.

సన్నగా కూతవేస్తూ ఔటరు సిగ్నల్ దగ్గర రైలాగింది "నాయుడుపేట" అన్నారెవరో. కిటికిలోంచి తొంగిచూశాను. ఊళ్లో ఎలక్ట్రిక్ దీపాలు కన్పిస్తున్నాయి. మహానందంతో నా మనస్సు ఉరకలు వేస్తున్నది. ఏవేవో అనుభూతులు నన్ను వెన్నుతట్టి జ్ఞప్తికి తెస్తున్నవి. అవును. విద్యార్థిగా నాయుడుపేటలో గడిపిన రోజుల్ని నేను మరువలేను. పల్లెటూళ్ళో పుట్టి చదువు సంధ్యలు లేకుండా చెడిపోయిన నేను నాయుడుపేటలోనే ప్రయోజకుడనయ్యాను. అందుకు కారణం రంగనాథం మాస్టారు చెప్పిన చదువు. మేస్టారుగారి భార్య కమలమ్మ చేతిచలువ.

కిటికీలోంచి మళ్ళీ తొంగి చూశాను. ఔటర్ సిగ్నలు ఎర్రదీపం ధగధగ లాడుతోంది. ఏదో ఆలోచిస్తూ కళ్ళుమూసుకొన్నాను అప్రయత్నంగా నా మనస్సు వర్తమానం లోంచి గతంలోకి వెళ్ళిపోయింది. గత జీవితం తాలూకు దృశ్యాలు కొన్ని సినిమా తెరమీద బొమ్మల్లాగు కళ్ళలో మెదిలినై.

నాయుడుపేట బస్టాండు. "గూడూరు, నెల్లూర్" అంటూ బస్సుకండక్టర్ల కేకలతో, బస్సుల్లో ఎక్కిదిగే ప్రయాణీకులతో, పూలూ, పండ్లూ అమ్మే కుర్రాళ్ళ కేకలతో మహాసందడిగా వుంది. నేను పల్లెటూళ్ళో పుట్టాను. ఐదోక్లాసు వరకూ మావూరి రోడ్డు కిరువైపులా గంగరావిచెట్లు గాలికి తలలూపు తున్నాయ్ మేము వెళ్ళేసరికి మాస్టారుగారు ఇంట్లోనే ఉన్నారు. మా నాన్నగార్ని చూడగానే ఆదరాబాదరా లేచి వచ్చి ఎంతో ఆప్యాయంగా ఇంట్లోకి తీసుకొని వెళ్ళారు. అమ్మగారు [మేస్టారుగారి భార్య కమలమ్మ] మా నాన్నగారికి కాళ్ళకు నీళ్లిచ్చి "బాగున్నారా అన్నయ్యగారూ?" అంటూ మా కుటుంబ యోగక్షేమాలు విచారించింది. మేస్టారుగారికీ, నాన్నగారికీ ఇంత స్నేహమని నాకు తెలీదు అందుచేత గుడ్లప్పగించి చూస్తూ నిలబడ్డాను. మాస్టారుగార్ని చూస్తుంటే నాలో ఏదో భయం పుట్టుకొచ్చింది. నల్లటి శరీరం, గుబురు మీసాలు, తీక్షణమైన చూపులతో భయంకరంగా ఉన్నా




ఎలిమెంటరీస్కూల్లో చదివాను. ఆ స్కూల్లో విద్యార్థుల సంఖ్య కంటే మేస్టర్ల సంఖ్య ఎక్కువ కావడం వల్ల చదువు బాగా రాలేదు ఎన్నడూ టౌన్లో కాలుపెట్టి ఎరుగను. రంగనాథం మాస్టారుగారికీ మానాన్నకూ మంచి స్నేహితం కావడంవల్ల, మేస్టారుగారి దగ్గర నన్ను చదివించాలని మా నాన్న సంకల్పం. అందుచేత నన్ను వెంటపెట్టుకొని నాయుడుపేట తీసుకొచ్చాడు మా నాన్న. సంచీ చేత్తో పట్టుకొని బజారులో అంగళ్ళనీ, కాఫీహోటళ్ళనీ నోరుతెరుచుకొని చూస్తూ నడవడం ప్రారంభించాను రంగనాథం మాస్టారు గారింటికి, బస్టాండుకు అట్టే దూరంలేదు. బ్రాహ్మణవీధిలోనే మేస్టారి గారిల్లు. విశాలమైన వీధి. దాదాపు అన్నీ పూరిళ్ళే. ఇంటింటికీ పెద్ద పెద్ద అరుగులు. డాయన. చదువు మాట దేవుడెరుగు, ఈయన చేతిలో చావుమాత్రం ఖాయం అని మనసులో అనుకొన్నాను భోజనాలయ్యాక, నా చదువు గురించి మాట్లాడు కొంటున్నారు. "మీదే భారం" అంటున్నాడు మా నాన్న. "ఒరేయ్! నువ్వు పరాయివాడివా? వాడు నీ బిడ్డ కాదు. నాబిడ్డే! మరేం దిగులు పడకు" అంటున్నారు మాస్టారు. వాళ్ళ మాటల్ని బట్టి నన్ను మాస్టారుగారు వారింట్లోనే ఉంచుకొని చదివించడానికి వొప్పుకొన్నారని గ్రహించాను. మర్నాడు ఉదయం మా నాన్నగారు మా ఊరు వెళ్లిపోయారు. వెళ్లేటప్పుడు పదిరూపాయలు నా చేతిలో పెట్టి "వెధవా! శ్రద్ధగా చదువుకో లేకుంటే మేస్టారు తోలు వొలుస్తాడు" అంటూ నన్ను హెచ్చరించాడు మా నాన్న. వెళ్తున్న మా

నాన్నని చూసి నా కళ్ళల్లో నీళ్ళు గిఱ్ఱున తిరిగినై.

రెండు రోజుల తరువాత మేస్టారుగారు నన్ను నాయుడుపేట హైస్కూల్లో చేర్పించారు ఆ స్కూల్లో మాస్టారు కూడా టీచరుగా పని చేస్తున్నారు స్కూల్లో చేరాక ఒకటి,రెండు రోజులు వొంటరితనం ఫీలయ్యాను. కానీ తర్వాత ఏమంతకష్టం అనిపించలేదు రోజూ ఆరింటికే నన్ను నిద్రలేపేవారు మేస్టారుగారు కాలకృత్యాలు తీర్చుకొన్నాక అమ్మగారు చద్దన్నం కలిపి వాళ్ళ పిల్లలకూ నాకూ ముద్ద లేసేది. కడుపు నిండినా ఇంకో ముద్ద. ఇంకోముద్ద అంటూ బలవంతంచేసేది. అమ్మగారి ముఖం చూస్తే చద్దన్నాల వేళప్పుడే చూడాలి. చిరునవ్వు ముఖంతో అన్నంకలుపుతూ, పిల్లలకు పెట్టేటప్పుడు సాక్షాత్తూ అన్నపూర్ణలాగే వుండేది ఆ తల్లి. చద్దన్నం తిన్నాక నన్ను అరుగు మీద కూర్చో బెట్టుకొని పాఠాలు చెప్పేవారు మాస్టారుగారు మేస్టరుగారు పాఠం చెప్పే పద్ధతి చాలా చిత్రంగా వుండేది ఒక్కో పాఠాన్ని ఐదారుసార్లు ప్రతి పదార్థంతో సహా చెప్పేవారు తర్వాత నోటు బుక్కులో అర్థాలు వ్రాసకొని మర్నాటికి ఆ పాఠం అప్పజెప్పమనేవారు పాఠం మర్నాటికి అప్పజెప్ప లేకపోతే చచ్చామన్నమాటె మొదట్లో కొంచెం కష్టమనిపించేది. కానీ క్రమంగా అలవాటైంది. శ్రద్ధగా చదువుకొని క్లాసు తప్ప కుండా పరీక్షలన్నీ పాసవుతూ వొచ్చాను మేస్టారిగారి అభిమానాన్ని సంపాదించుకొన్నాను. నాయుడుపేటలో స్కూల్ ఫైనల్ దాకా చదివి, తర్వాత కాలేజీలో చదివి మేస్టారిగారి ఆశీర్వచన ప్రభావంవల్ల ఏదో ఈ నాటికి ప్రయోజకుణ్ణయ్యాను.

రెక్కవొంగింది. పెద్దగా కూతవేస్తూ రెండునిముషాల్లో నాయుడుపేట స్టేషను చేరుకొన్నది రైలు ఉదయం నాలుగున్నర కావస్తోంది. స్టేషను పంపుదగ్గర ముఖం కడుక్కొని కాఫీతాగి సంచీ చేతో పట్టుకొని ఊళ్ళోకి బయలుదేరాను. రోడ్డుమీద నడుస్తుంటే కాళ్ళ కిందపడి నలుగుతున్న ప్రతి మట్టి రేణువూ నన్ను పలకరించినట్లనిపించింది. జేబులోంచి ఉత్తరం తీసి అడ్రసు మరోసారి చూసుకొని మాస్టారిగారి ఇల్లు చేరుకున్నాను. అదోచిన్న పూరిపాక. చుట్టూ మురికి నీటి గుంటల్లో పందులూ, దోమలూ వీర విహారం చేస్తున్నవి. నాసికాపుటాల్ని బ్రద్దలు చేసే దుర్వాసన. శివశివా! మేస్టరుగారు ఈ దిక్కుమాలిన ఇంట్లో ఎలా కాపురం చేస్తున్నారో ?

తలుపు తట్టాను. 'ఎవరూ?' అంటూ తలుపు తీసి గుమ్మందగ్గర నిల్చున్న నన్ను ఎగాదిగా చూశారు మాస్టరుగారు. విల్లు బద్దలా ఒంగి ఉన్నారాయన తలంతా ముగ్గుబుట్టయింది. ముఖంలో మునుపటి గాంభీర్యమేలేదు భుజాలమీద వొక్కాచిరుగు అనుభవిస్తున్న దారిద్ర్యాన్ని నోరు విప్పి చెప్తున్నది నాకళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగినై.

'నమస్కారం మాస్టారూ! నేనురాజాను'' అంటూ ఆయన పాదాలకు వందనం చేశాను.

''నువ్వా : నాయనా ఎన్నాళ్ల కెన్నాళ్లకు అంటూ నన్ను లోపలకి తీసుకవెళ్లారు మేస్టారు ఇల్లంతా కలియచూశాను చాలా చిన్న పూరిపాక మధ్య వెదుళ్ల తడిక ఒకటి అడ్డంపెట్టి రెండు గదులుగా విభజించినట్లుంది. గోడలకు బూజు వేలాడుతోంది. అటకమీద మేస్టారుగారు ప్రాణ ప్రదంగా చూచుకొన్న పుస్తకాలు చెల్లాచెదురుగా పడి వున్నాయి ఇంట్లో దరిద్రదేవత చిందులు తొక్కుతున్నది. ఎటువంటి కుటుంబాని కెటువంటి దుర్గతి మనస్సుకు బాధ కల్గింది మాస్టారు ఏదో ఆలోచిస్తున్నారు ''విషయాలన్నీ వాసు ఉత్తరంలో రాశాడు మాస్టారు చాలా బాధ పడ్డాను ఇన్ని కష్టాల్లో మిమ్మల్ని చూడడం కేవలం నా దురదృష్టం'' అన్నాను వొణుకుతున్న కంఠంతో.

మేస్టారుగారు చిరునవ్వునవ్వి అంతా దైవ లీల ఉన్నట్లుగా చేతులు పైకెగురవేశారు

''మీ పిచ్చి మాస్టారూ. నిజంగా భగవంతుడనే వాడొకడుంటే మిమ్మల్నిలా కష్టపెట్టడు'' అన్నాను జేబు రుమాలతో కళ్లు తుడుచుకుంటూ.

''తప్పు నాయనా తప్పు. నా ప్రారబ్దం అనుభవిస్తున్నాను. అంతే!''

గంపెడు దుఃఖంలో కూడా ఇంత మనో నిబ్బరం ఎలా అలవర్చుకున్నారో మేస్టరుగారు. శారీరకంగా కృంగి పోయారేమోగాని, మానసికంగా చెక్కు చెదరలేదు. భగవంతునిలో విశ్వాసం సడలలేదు. మాస్టరుగారు స్థితప్రజ్ఞులు ఋషుల కోవకు చెందినవారు. అందుకేమాత్రం సందేహంలేదు

ఏదో చప్పున స్ఫురణకు వచ్చినట్లుగా మేస్టారూ 'అమ్మగారు కన్పించరేం!' అన్నాను ఆదుర్దాగా.

నా ప్రశ్నకు మాస్టారుగారు కొంచెం కలవర పడి '' ఊరెళ్లింది బాబూ '' అన్నారు పరధ్యానంగా.

నాకు నిరాశ కల్గింది. ఊర్నించి వచ్చేటప్పుడు నేను మాస్టారుగారికీ, అమ్మగారికీ కొత్తబట్టలు తెచ్చాను పార్వతీపరమేశ్వరుల్లాంటి దంపతులిద్దరూ అవి కట్టుకుంటే చూసి పాదాభివందనం చేద్దామనే సంకల్పంతో గంపెడాశతో వొచ్చాను. ఇంతకీ ప్రాప్తంలేదు ఆ విషయమే మాస్టారుగారితో చెప్పి సంచిలోంచి బట్టల పాకెట్లు బయటకు తీసి, ఆ పొట్లాల్లు, పది, పదిరు పాయల నోట్లు గురువుగారి చేతిలోపెట్టి నమస్కరించాను.

''ఏమిటినాయనా ఏమిటిదంతా'' అంటూ వాత్సల్యంతో నా తల నిమిరారు మాస్టరుగారు. ''నా సంతోషం మాస్టారూ మీరు అభ్యంతరం చెప్పకూడదు'' అంటూ ఆయన కళ్లల్లోకి చూశాను. మాస్టారుగారి కళ్ళు ఆనందాశ్రువులు స్రవిస్తున్నై. ఆహా! అదృష్టమంటే నాదే. ఏదో ఉడతా భక్తిగా ఈనాటికి గురువుగారిని సత్కరించే అవకాశం నాకు లభించింది. కానీ ఒకటే కొరత సమయానికి అమ్మగారు ఇంటిలో లేరు.

''మాస్టారుగారూ : అర్జంటు పనిమీద మద్రాసు వెళ్తున్నాను. మళ్లీ ఎన్నాళ్లకో అమ్మగారిని చూడలేక పోయాను. దురదృష్టవంతుణ్ణి, శలవు తీసుకొంటాను'' అన్నాను చేతులు జోడించి.

ఆవలి గదిలోంచి సన్నగా గాజుల చప్పుడు. ''బాబూ!'' అంటూ దీనంగా పిలుపు.


''నా చెవులను నేనే నమ్మలేక పోయాను. ఏమిటీ: అమ్మగారింట్లోనే ఉన్నారా? ఇంట్లోనే వుంటే లేరని మాస్టారుగారు నాతో అబద్ధమాడారా? అమ్మగార్ని నేను చూడటానికి అవకాశం లేదా? కారణం. నేనే మన్నా తప్పు చేశానా? కారణమేమిటి ?''

'వెళ్ళి చూడు నాయనా చూడు''అన్నారు మాస్టారు దాదాపు శిలా విగ్రహంలాగా నిలబడ్డ నన్నుచూసి.

''అమ్మగారూ'' అంటూ లోపలికి వెళ్లి తొంగిచూశాను శివా. శివా: ఈ కథ ఇక వ్రాయలేను. కలం తిరుగుబాటు చేస్తున్నది. నన్ను క్షమించండి, కమలమ్మగారికి కట్టుకోడానికి చీరలేదు కాబోలు మాస్టరుగారి పాత పంచె ఒకటి వొంటికి చుట్టుకొని ఉన్నది. గొంతుకూర్చుని ముఖాన్ని రెండు చేతుల్తో కప్పుకొని ఏడుస్తున్నది. అమ్మా! కమలమ్మ తల్లీ!

# '73 లో మన నటులు

—శ్రీనివాస్ సమీక్ష—



గత ఏడు (అంటే 1973 లో) విడుదలైన చిత్రాలలో మన హీరోలు నటించిన తీరును గూర్చి ఒక చిన్న సమీక్ష వ్రాస్తున్నాను.

అ క్కి నే ని

'నటసామ్రాట్' నాగేశ్వరరావు నటించిన చిత్రాలు ఆరు. ''బంగారుబాబు, కన్నకొడుకు, భక్తతుకారాం, పల్లెటూరిబావ, అందాల రాముడు, మరపురాని మనిషి.'' బంగారు బాబులో అందంగా కనిపించి, చక్కగా శృంగార రసాన్ని అందించారు. ప్రాణానికి తెగించి హెలికాప్టర్ ఫయిట్ చేశారు. కన్న కొడుకు చిత్రంలో ఆయన చెయ్యదగిన పాత్ర కాదు. అయన్ను సరిగ్గా ఫోటోగ్రాఫ్ చెయ్య లేదు. భక్తతుకారాంగా గొప్పగా నటించారు. పల్లెటూరిబావలో పిలక బావగా, హిప్పీ బావగా హుషారుగా నటించారు. అందాల రాముడులో కథ లేకపోయినా తన అందమైన నటనతో చిత్రాన్ని నడిపించారు. మరపురాని మనిషిలో మహోన్నతంగా నటించారు. బంగారుబాబు, భక్తతుకారాం హిట్ అయినాయి. పల్లెటూరి బావ నిర్మాతకు కొంత లాభాన్ని తెచ్చిపెడుతుంది. అందాలరాముడు నిర్మాత పెట్టుబడికి యిబ్బంది కలిగించకపోవచ్చు. 'కన్న కొడుకు, మరపురాని మనిషి' దారుణంగా దెబ్బతిన్నాయి. '73 లో అక్కినేని వెరైటీ వేషాలను చేపట్టడం ఒక ప్రత్యేకత. ప్రేక్షకులు ఆశించే నాగేశ్వరరావు '73 లో కనిపించలేదు అన్న నిజాన్ని ఎవరూ కాదనలేరు.

న ం ద మూ రి

'నటరత్న' రామారావు నటించిన చిత్రాలు అయిదు. ''డబ్బుకు లోకం దాసోహం, దేశోద్ధారకులు, ధనమా—దైవమా, దేవుడు చేసిన మనుషులు, వాడే—వీడు.'' ఈ అయిదు చిత్రాల్లో ఎన్టీఆర్ చక్కగా నటించారు. ధనమా—దైవమా లో బ్రహ్మాండంగా చేశారు. దేశోద్ధారకులు లో నవయువకుడివలె కనిపించారు. దేవుడు చేసిన మనుషులు విజయానికి రామారావు చాలావరకు కారకులు అనడం సమంజసం. రామారావుతో చిత్రాన్ని నిర్మించిన వారందరికీ డబ్బులు పుష్కలంగా వచ్చాయి. ప్రేక్షకులు ఆశించే పురాణ పురుషుడి వేషం ఒక్కటయినా వేసివుంటే బాగుండేది.



శో భ న్ బా బు

వీరు 9 చిత్రాలలో నటించారు. ''పెద్ద కొడుకు, జీవనతరంగాలు, శారద, జీవితం, పుట్టినిల్లు — మెట్టినిల్లు, మైనరుబాబు, ఇదాలోకం, డాక్టరుబాబు, గంగ—మంగ.'' పెద్దకొడుకు పెద్దదెబ్బ కొట్టింది. జీవన తరంగాలు పెద్ద హిట్ అయింది. శారద మంచి పేరు నిచ్చింది. జీవితం షుమారుగా ఆడింది. పుట్టినిల్లు—మెట్టినిల్లు విద్యార్థులను ఆకర్షించింది. మైనరుబాబు మైనర్లకు నచ్చింది. ఇదాలోకం ముసలివేషం జనానికి పట్టింది. డాక్టరుబాబు చాలామందిని ఆకట్టుకుంది. గంగ — మంగ లో వెయ్యరాని వేషం వేశారు అనిపించింది. 1973 లో ఎక్కువ విజయవంతమైన చిత్రాలలో నటించినది శోభన్‌బాబుగారే.



కృ ష్ణ

వీరు నటించిన చిత్రాలు పదమూడు. మంచివాళ్లకు మంచివాడు, మల్లమ్మ కథ, శ్రీవారు—మావారు, పుట్టినిల్లు—మెట్టినిల్లు, స్నేహబంధం, నేరము—శిక్ష, దేవుడు చేసిన మనుషులు, మమత, మాయగాడి మల్లిగాడు, పసి హృదయాలు, వింత క. గంగ—మంగ,

వాణిశ్రీ కృష్ణంరాజు

శ్రీశైలం వెళ్ళారు. అక్కడ మల్లికార్జున స్వామిని దర్శించి, ఆయన ఆశీర్వచనాన్ని పొందారు. ప్రేమించుకొన్న వ్యక్తులు ఒక చోట కలిస్తే, వాళ్ల భావాలు ఎలావుంటాయో మీకు తెలియనిదికాదు. ప్రేమికుల మనో భావాన్ని కవి దాశరధి ఎంత చక్కగా వ్రాశాడో తెలుసా ?

అతడు : ఎందుకో ! నీవు నాతోవున్న వేళ
యింత హాయి

ఆమె : ఎందుకో నిన్ను విడిచి
నిమిషమైనా నిలవలేనోయి.

ఈ పాటను రామకృష్ణ, సుశీల పాడారు. విజయభాస్కర్ సంగీతాన్ని సమకూర్చారు. ఈ పాట, సన్నివేశం గోపీకృష్ణ మూవీస్‌వారి ''కృష్ణవేణి'' చిత్రంలో కనిపిస్తుంది. ఈ చిత్రానికి విక్టరీ. మధుసూదనరావు దర్శకుడు.

ఆంధ్రుల అగ్రగణ్య వాణిశ్రీతో కృష్ణంరాజు కధానాయకుడిగా నటిస్తున్న మొదటి చిత్రం ''కృష్ణవేణి''ని, చెలసాని గోపీ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి బొల్లిముంత మాటలను, కన్నప్ప ఛాయను, మార్తాండ్ కూర్పును, సూరన్న కళను, సూర్యనారాయణరాజు సహ దర్శకత్వాన్ని నిర్వహిస్తున్నారు.

''కృష్ణవేణి'' చిత్రం అవుట్‌డోర్ షూటింగు శ్రీశైలం, అమరావతి, నాగార్జున సాగర్, గుంటూరు మున్నగుచోట్ల నిర్విఘ్నంగా జరిగినట్టు, ప్రజలు బాగా సహకరించినట్టు నిర్మాత గోపీ చెప్పారు. ఈ చిత్రంలో గుమ్మడి, అంజలీదేవి, రాజబాబు, రమాప్రభ ముఖ్య తారాగణం. లక్ష్మి విడుదల.

గోవాలో అక్కినేని, లక్ష్మి

'నటసామ్రాట్' నాగేశ్వరరావు లక్ష్మిని వెంటతీసుకుని, గోవా వెళ్లారు. సరదాకోసం

# సినిమా

కాదు. అన్నపూర్ణా పిక్చర్స్‌వారి ''బంగారు కలలు'' షూటింగుకోసం. అక్కడ ఇద్దరూ కలిసి మూడు యుగళగీతాలను ఆలాపించారు. మరొక పాట హీరో నాగేశ్వరరావుపై చిత్రీకరించారు. ఈ చిత్రానికి ఆదుర్తి సుబ్బారావు దర్శకుడు. ప్రసిద్ధ నవలా రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి వ్రాసిన యీ కధను, ప్రముఖ నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు రంగుల చిత్రంగా నిర్మిస్తున్నారు.

అన్నపూర్ణా పిక్చర్స్ వారి ''బంగారు కలలు'' చిత్రంలోని అయిదు పాటలను నేను విన్నాను. అయిదింటిలో రామకృష్ణ, సుశీల పాడిన మూడు డ్యూయెట్లను మళ్లీ మళ్లీ విన్నాను. రామకృష్ణ ఎంత బాగా పాడాడో, పాటలను విన్నప్పుడు శ్రోతలే అతగాడికి ప్రశంసల వుత్తరాలు వ్రాయక మానరు. ''విచిత్రబంధం'' తరువాత రామకృష్ణ వాయిస్‌కి యోగ్యతాపత్రం లభించే చిత్రం ''బంగారు కలలు.'' ఇక సంగీతం అంటారా, రాజేశ్వరరావు తన పాండిత్యాన్ని పూర్తిగా ప్రయోగించారు అనే చెప్పాలి. ఈ చిత్రంలో రంగారావు, కాంతారావు, సత్యనారాయణ, రాజబాబు, అల్లురామలింగయ్య, గిరిబాబు, వహీదారెహమాన్, సూర్యకాంతం, మమత ప్రధానపాత్రధారులు. నవయుగ విడుదల.



''ఆడపిల్లల తండ్రి''లో
ఒక రైలుబండి దృశ్యం

మీనా''.

మంచివాళ్లకు మంచివాడు మంచిని చూపెట్టలేదు. మల్లమ్మ కధలో అమాయకుడిగా అతికినట్టు నటించాడు. శ్రీవారు—మావారులో ఫర్వాలేదనిపించాడు, చాలా అందంగా కనిపించాడు. పుట్టినిల్లు—మెట్టినిల్లులో క్లిష్టమైన పాత్రను ప్రతిభావంతంగా పోషించాడు. స్నేహబంధంలో చెప్పుకోదగిన వేషం కాదు. నేరము—శిక్షలో అద్వితీయంగా చేశాడు. దేవుడు చేసిన మనుషులులో రాణించాడు. మమతలో ఎందుకు వేశాడో ? మాయదారి మల్లిగాడులో మహోన్నతంగా నటించాడు. పసి హృదయాలులో చిన్న వేషం. వింత కధ అంతగా నచ్చలేదు. గంగ—మంగ లో ఫర్వాలేదు. మీనాలో మోతాదు మించకుండా చక్కగా చేశాడు.

నేను వ్రాసిన అభిప్రాయాలు నా ఒక్కడివని అనుకోవద్దు. ప్రజలను అడిగి తెలుసుకొన్న తరువాత తలపెట్టిన వ్యాసం యిది. జర్నలిస్టు అభిప్రాయం అరవైశాతమైనా ప్రజల అభిప్రాయంతో సరితూగాలని, అన్నారు ఒకప్పుడు నాగేశ్వరరావు. అందుకే వాళ్ల అభిప్రాయానుసారంగా యీ రచన సాగించాను.

''కోడెనాగు''లో లక్ష్మి



పెద్ద బాబాయిలో ఒక సన్నివేశం



## సినిమా

లలితా మూవీస్

అన్నపూర్ణా పిక్చర్స్‌కి వెళ్లినప్పుడు, అక్కడ మధుసూదనరావుగారి అల్లుడు చిరంజీవి. జగదీష్‌చంద్రప్రసాద్‌ను కలిశాను. ఆయన స్థాపించిన లలితా మూవీస్‌కి సంబంధించిన వివరాలను సేకరించాను.

"మార్చిలో షూటింగు ఆరంభమవుతుందట. గొల్లపూడి మాటలను వ్రాస్తున్నారట. దర్శకత్వాన్ని పి. చంద్రశేఖరరెడ్డికి యిచ్చారట. ప్రధాన పాత్రలను ఎస్వీరంగారావు, కాంతారావు, చంద్రమోహన్, రాజబాబు, అల్లురామలింగయ్య, ధూళిపాళ, జయంతి, సూర్యకాంతం (గెస్టు), రమాప్రభ పోషిస్తారట."

### గొల్లపూడికి డిమాండ్ !

ఇప్పుడు రచయిత గొల్లపూడికి విపరీతమైన డిమాండు. నిర్మాతలు చాలమంది ఆయనచేత వ్రాయించుకోవడానికి వుబలాటపడుతున్నారు. కలం బలం వున్న మనిషి గాబట్టి అంత మోజును ఆకట్టుకొన్నారు. కొన్ని చిత్రాలకు అజ్ఞాతంగా సహాయపడుతున్నారు. కొన్నింటికి కొంత భాగం వ్రాసియిస్తున్నారు. కొన్నిటికి కధ, మాటలు యివ్వక తప్పిందికాదు. మొత్తానికి అందరినీ సంతృప్తిపరచడానికి ప్రయత్నిస్తున్నారు. గాడ్ విష్ హిమ్ ఆల్ ది బెస్ట్ !

### కామెడీకింగ్ తల్లిగా సెక్స్‌క్వీన్

హాస్య నటనలో ప్రత్యేకతను సృష్టించిన నటుడు రేలంగి. ఆయన్ను కామెడీ కింగ్ అనేవాళ్ళు ప్రజలు. రెండు x 10 సంవత్సరాలు హాస్య సామ్రాజ్యానికి మకుటంలేని మహారాజుగా విలసిల్లాడు రేలంగి.

అలాగే ఆ రోజుల్లో సెక్స్ క్వీన్ ఎవరయ్యా అంటే సూర్యకళ పేరు చెప్పేవారు. కాలచక్రభ్రమణంలో కొన్ని మార్పులు వచ్చాయి.

నవభారత్ ఆర్ట్ ఫిలింస్‌వారి "ముగ్గురు అమ్మాయిలు" చిత్రంలో ఒక వింత కధనం జరిగింది. అదేమిటంటే, రేలంగికి తల్లిగా సూర్యకళ నటించింది. అరవై నిండిన వృద్ధురాలిగా ఆమె ఎంతో సహజంగా నటించింది.

ఆమె సూర్యకళ కాదు అని ఎందరో వాదించారు. కానీ దగ్గరగా వెళ్ళి చూసేసరికి ఆ ముసలిది సూర్యకళయే. ఏమయినా, ప్రత్యగాత్మలాంటి పెద్ద దర్శకులు ఆర్టిస్టులను ఎలాగయినా మలచగలరు. వాళ్లకు

కావలసిన రిజల్టును రాబట్టగలరు.

"ముగ్గురు అమ్మాయిలు" చిత్రాన్ని పి. ఎస్. ప్రకాశరావు నిర్మిస్తున్నారు. అమ్మాయిలుగా భారతి, చంద్రకళ, ప్రమీల నటిస్తున్నారు. ముఖ్య పాత్రలను నాగభూషణం, రాజబాబు, చంద్రమోహన్, జయసుధ, పుష్పకుమారి పోషిస్తున్నారు. లక్ష్మీ ఫిలింస్ విడుదల.

### "ఆడపిల్లల తండ్రి"

నాగభూషణం పుట్టినరోజును ఘనంగా, వైభవంగా జరిపారు ఆయనకు పుట్టిన పిల్లలు.

"ఆదివారం అమావాస్య
అందరికీ మంచిది
ఇది మా నాన్న పుట్టిన రోజు
మరీ మరీ మంచిది" అంటూ

కన్నతండ్రిని తమ అనురాగ, అనుబంధాలతో ఉక్కిరి, బిక్కిరి చేశారు. ఆయన ఆనంద పారవశ్యం చెంది, తన పిల్లలను గాఢంగా దగ్గరకు తీసుకొని, వాళ్లను ముద్దాడి ఆశీర్వదించాడు. "కట్" అన్నారు దర్శకుడు వాసు. ఈ సన్నివేశం సత్యా ఎంటర్‌ప్రైసెస్‌వారి "ఆడపిల్లలతండ్రి"లో కనిపిస్తుంది.

"ఆడపిల్లల తండ్రిగానాగభూషణం అసాధారణంగా నటిస్తున్నారు. ఆయన యింత వరకు యింత బరువైన పాత్రను చెయ్యలేదు. చిత్రం ఆద్యంతం ఆయన పాత్ర చుట్టూ నడుస్తుంది నలుగురు ఆడపిల్లలను గన్న తండ్రిగానాగభూషణం వెరైటీ వేషాన్ని విశేష శ్రద్ధాసక్తులతో నటిస్తున్నారు" అన్నారు కథను వ్రాసిన దర్శకుడు వాసు.

"మధ్య తరగతి కుటుంబీకుడు. ఆఫీసు గుమాస్తా. న్యాయానికి, మంచికి ప్రతి రూపం. కళ్లెదుట తనకు అన్యాయం జరిగినా, అది అంతేలే అనేరకం. అట్టి గుణాతిశయాలను గొన్న అసమర్థుడు, అమాయకుడు తిరగబడితే సమాజం ఎలా వుంటుంది? అన్నదే నా కథ" అన్నారు వాసు.

కథను, దర్శకత్వంను కుమారుడికి అప్పచెప్పిన ప్రత్యగాత్మ సినిమా అనుకరణ మాత్రం తను చేసిపెట్టారు. భమిడిపాటి మాటలను, చలపతిరావు సంగీతాన్ని సమకూర్చే యీ చిత్రానికి తోట కళకు, వి. ఎస్. ఆర్. కృష్ణారావు ఛాయకు, శ్రీహరి కూర్పుకు, సుబ్బారావు సహాయ దర్శకత్వానికి అధికారులు. ఈ చిత్రంలో కృష్ణంరాజు, భారతి, రాజబాబు, జయసుధ, చంద్రమోహన్, పద్మప్రియ, అల్లు రామలింగయ్య, పుష్పకుమారి, రావి కొండలరావు, రమాప్రభ, సత్యనారాయణ, బేబీశశి ముఖ్య పాత్రధారులు. 'ఆడపిల్లల తండ్రి' చిత్రానికి అనిల్‌ప్రభాస్, జయలక్ష్మి పంపిణీదారులు.

సత్యా ఎంటర్‌ప్రైసెస్‌వారి "ఆడపిల్లల తండ్రి"లో ఒక పిల్లగా నటిస్తున్న జయసుధను అయిదు చిత్రాలకు ఒప్పించినట్టు, దర్శకుడు వాసు చెప్పారు. త్వరలో కథానాయిక అయ్యే లక్షణాలు ఆమెలో వున్నట్టు జోస్యం చెప్పారు.



"హారతి"లో శారద

### దర్శకునికి నటుని ప్రశంస

కుర్రవాడైనా గట్టివాడు, పనితనం తెలిసినవాడు, ఆడుతూ, పాడుతూ చిత్రాన్ని చక్కగా రూపొందించుకొనేవాడు అంటూ క్యారెక్టర్ నటుడు నాగభూషణం, యిరవైమూడు ఏండ్ల వయస్కుడు అయిన వాసును గూర్చి ప్రశంసించారు. సత్తాలేని మనిషిని పొగిడే అలవాటు నాగభూషణానికి లేదు. ఏమైనా ప్రత్యగాత్మ కుమారుడు గదా!

### రవిఆర్ట్ థియేటర్స్

నటుడు నాగభూషణం తన కుమారుడు రాఘవరావును, ఆత్మీయుడు బసవయ్యను భాగస్తులుగా పెట్టి స్థాపించిన సంస్థ యిది. ఈ సంస్థ నిర్మించిన మొదటి చిత్రం "ఒకే కుటుంబం." ఆ చిత్రానికి దర్శకత్వం నెరపిన ఏ. భీమ్‌సింగ్ చేతనే రెండవ చిత్రాన్ని ప్రారంభించి, అయిదురీళ్ల చిత్రాన్ని తీశారు.

"ప్రొడక్షన్ నెం. 2" కి ఆచార్య ఆత్రేయ రచనను, కోదండపాణి సంగీతాన్ని, బాబు ఛాయను, భాస్కరరాజు కళను, పాల్‌దొరైసింగం కూర్పును, శ్రీనివాసరావు ప్రొడక్షన్ను, రమణరావు సహాయ దర్శకత్వాన్ని నిర్వహిస్తున్నారు. నాగభూషణం, జయంతి, సత్యనారాయణ, జ్యోతిలక్ష్మి, రాజబాబు, కె. విజయ, చంద్రమోహన్, జయసుధ, అల్లురామలింగయ్య, గుమ్మడి, ప్రభాకరరెడ్డి, రమణారెడ్డి, నాగయ్య ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. ఈ చిత్రానికిగాను మూడు పాటలను కోదండపాణి ధ్వనిముద్రణ చేయించారు. రెండు పాటల చిత్రీకరణ జరిగింది. ఒకపాట జ్యోతిలక్ష్మి, విలన్ సత్యనారాయణను కవ్వించేది. మరొకటి రాజబాబు—విజయ, చంద్రమోహన్—జయసుధలు ఆడుతూ, పాడుతూ వుల్లాసంగా గడిపిన పాట. ఓరిమితో, నేర్పుతో, మంచితనంతో స్త్రీ సంసారాన్ని తీర్చిదిద్ద గలదు అనెడి నిరక్షర సత్యాన్ని చాటి చెప్పే కథ యిది అని తెలుస్తూంది. ఈ చిత్రం నవయుగ ద్వారా విడుదలవుతుంది. జయంతి, నాగభూషణం భార్యాభర్తలుగా నటిస్తున్నారీ చిత్రంలో.

దుష్టపాత్రలకు గుడ్‌బై కొట్టేశాను, అన్నారు క్యారెక్టర్ నటుడు నాగభూషణం.

ఆయన తీసుకున్న నిర్ణయం చాలా మంచిది. సెంటిమెంటల్ రోల్స్ చెయ్యడంలో కలిగే తృప్తి, ఆనందం మరొకదానిలో రాదు. అందుకే ఆయన యిప్పుడు చిత్రాలను పరిమితం చేసుకొన్నారు. మంచి వేషాలను మాత్రమే ఒప్పుకొంటున్నారు. విలన్ వేషాలకు, కామెడీ వేషాలకు వేరేవాళ్లు వుండ, వాటిజోలికి నాగభూషణం పోకూడదు. ఆయన "నిత్యసుమంగళి, ఆడపిల్లల తండ్రి, ముగ్గురు అమ్మాయిలు, రవి ఆర్ట్ థియేటర్స్" చిత్రాలలో ధరించే పాత్రలు ఆయన మనసుకు బాగా నచ్చినవి, ప్రేక్షకులచేత సెహభాష్ అనిపించేవి.

### సుభాషిణి ఆర్ట్ పిక్చర్స్ !

ప్రముఖ నవలా రచయిత్రి మాదిరెడ్డి సులోచన వ్రాసిన "అంతం చూసిన అసూయ" నవలను, దర్శక — నిర్మాత కె. హేమాంబరధరరావు కొన్నారు. సినిమా అనుకరణ పూర్తిచేశారు. భమిడిపాటిచేత మాటలను వ్రాయించారు. జనవరి మధ్యలో షూటింగు ఆరంభించారు.

"జమున, లక్ష్మి, భారతి" ముఖ్యపాత్రలను పోషిస్తున్న ఈ చిత్రంలో కృష్ణంరాజు, రాజబాబు, చంద్రమోహన్ ప్రధాన పాత్రధారులు.

### తొలిరేయి విరహం

భారతికి శోభనపుర్రాత్రి. భర్త రాకకోసం వేయికండ్లతో ఎదురుచూచింది. ఎంతసేపటికీ ఆయన రాడాయె. విరహాగ్ని జ్వాలను భరించలేని భారతి, తన ప్రాణనాథునికోసం నిరీక్షిస్తూ పాటపాడింది. ఆ పాటను దాశరథి కలం వ్రాసింది.

"శృతిచేసి నా వీణా, స్వామీ
స్వరములు పలికింపవేమీ, నాలో
మధువులు చిలికించ రావేమీ" అంటూ

సాగిన ఈ పాటను సుశీల మధురాతి మధురంగా పాడింది. కోదండపాణి సంగీతాన్ని సమకూర్చడం జరిగింది. ఈ పాట, దృశ్యం మనోరంజనీ పిక్చర్స్‌వారి "భారతి" చిత్రంలో కనిపిస్తుంది.

వీటూరి కథ, దర్శకత్వం చేపట్టిన 'భారతి' చిత్రంలో 'కళాభారతి' బిరుదాన్ని అందుకొన్న జమున, భారతిగా నటిస్తున్నది. ఆమె భర్తగా కృష్ణంరాజు నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఎస్వీ రంగారావు, చంద్ర





"మంచివాడు"లో నాగేశ్వరరావు, వాణిశ్రీ

## సినిమా

మోహన్, పద్మనాభం, సత్యనారాయణ, అల్లురామలింగయ్య, లత, రమాప్రభ ముఖ్యపాత్రధారులు. ఇప్పటికి మూడు పాటలు ధ్వనిముద్రణ జరిగినట్టు, ఒకపాట చిత్రీకరణ అయినట్టు నిర్మాత కె. వెంకటమునిరెడ్డి చెప్పారు. జె. ఎస్. కృష్ణంరాజు ఈ చిత్రానికి నిర్వాహకుడు. విజయా విడుదల.

### "నా యిల్లు—నావాళ్లు"

"మనుషులు-మట్టిబొమ్మలు" చిత్రాన్ని చూచి, దర్శకుడు భాస్కర్ పనితనాన్ని మెచ్చి, ఆయనకు దర్శకత్వాన్ని యిచ్చారు, చందూ ఫిలింస్ అధినేత వై. యాదయ్య. వీరు తలపెట్టిన చిత్రం పేరు "నా యిల్లు—నావాళ్లు". కథనుకూడా దర్శకుడే యిచ్చారు. మాటలను అప్పలాచార్య సమకూర్చారు. ఈ చిత్రానికి బి. శంకర్ సంగీత సారధి. ఆయన సారధ్యంలో డిశంబరు 29న, బాలు ఒక పాటను పాడారు. డాక్టర్. నారాయణరెడ్డి వ్రాసిన పాట అది.

"చల్లని కోవెల నా యిల్లు — ఆ
కోవెల దివ్వెలు నావాళ్లు
మామయ్య అత్తయ్యా
మమతలు పంచే దేవుళ్లు

అన్న పాటను, హాస్య నటుడు పద్మనాభంపై చిత్రీకరిస్తాము, అన్నారు నిర్మాత.

"మా చిత్రానికి స్టుడియోను వాడదలచలేదు. మొత్తం షూటింగు హైదరాబాదులో (అవుట్‌డోర్) జరుగుతుంది. అక్కడి భవంతులలో కొంత షూటింగు జరుగుతుంది" అని చెప్పారు యాదయ్య. ఈ చిత్రంలో ఎస్వీ రంగారావు, సావిత్రి, పద్మనాభం, అల్లు రామలింగయ్య, రాధాకుమారి, వెంకటేశ్వరరావు, మురళీమోహన్, ప్రసాద్, కృష్ణమూర్తి, రామమోహన్, వరలక్ష్మి, కోటేశ్రీ, విజయలక్ష్మి ప్రధాన పాత్రధారులు. ఛాయను దేవరాజ్ చేపట్టారు.

### "పండంటి సంసారం"

నందినీ ఫిలింస్ నిర్మిస్తున్న మూడవ చిత్రానికి యీ పేరును స్థిరపరచినట్టు నిర్మాతలు చెప్పారు. కథను పి. లలిత వ్రాసింది. చిత్రానుకరణ, దర్శకత్వంను కథకురాలి భర్త పి. చంద్రశేఖరరెడ్డి

అల్లూరి సీతారామరాజు సినిమాస్కోప్ కలర్ ప్రారంభోత్సవంలో నాగిరెడ్డి కెమేరా స్విచ్ ఆన్ చేయగా హీరో కృష్ణపై చక్రపాణి క్లాప్ కొట్టారు.




ఫిలిం బ్యాలట్ పత్రాలు మా కార్యాలయానికి చేరవలసిన ఆఖరు తేదీ 6—2—'74.
ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురించిన బ్యాలట్ పత్రాన్నే వాడాలి.
విడిగా తెల్లకాగితాలమీద వ్రాసి పంపినవి చెల్లవు.

# మబ్బుట క్రమ్మిన రోజునగుడా ప్రకాశమైన చిరునవ్వు.



## క్రొత్త "ఆగ్ఫా ఐసోలి 1" మీకు సరి సరిపడని కాంతిలో గూడ అందమైన ఫొటోల నిస్తుంది—2 లెన్స్ స్టాప్స్ ఎన్నికతో




ధర
రూ లు 143/-
ఎక్సైజు డ్యూటీతో సహా. ఇతర పన్నులు అదనం.

ఆగ్ఫా ఐసోలి 1 ఆరు కారణాలు దీన్ని పరిణతి పొందని ఫొటోగ్రాఫిక్ క్రొత్త అవకాశాలు కల్గించేదిగా చేస్తున్నాయి

1 మూడు షట్టర్ స్పీడ్ సెట్టింగ్స్ కల్గిన లివరును ఉపయోగించటం సులభం
2 అక్రోమెట్ F8 లెన్స్ కాంతివంతమైన చురుకైన చిత్రాల కోసం
3 ప్రతికూలమైన పరిస్థితులలో తీసిన ఫొటోలకు గూడ సరియైన ఎక్స్పోజర్ ఇచ్చులకు 2 లెన్స్ స్టాపులు
4 ఎఱ్ఱటి వార్నింగ్ సిగ్నల్ డబుల్ ఎక్స్పోజర్ లాక్ తెరచియున్నదని సూచిస్తుంది
5 2 లెన్స్ స్టాప్స్‌తో అపెర్చర్ సెట్టింగ్ లివర్
6 120 సైజు రోల్ ఫిలిమ్ మీద 16 (4 × 4 సెం మీ ) ఫొటోలు (6 × 6 సెం మీ సైజు కంటె 4 ఎక్కువ) ఇస్తుంది ఫిలిమ్ చుట్టే నాబ్ ప్రత్యేకమైన లాకింగ్ సాధనంతో రెండు సార్లు ఎక్స్పోజ్ కాకుండ కాపాడుతుంది


ఆగ్ఫా ఐసోలి 1 ప్రొజెక్షన్ కోసం మెరిసిపోయే ఆగ్ఫా కలర్ ట్రాన్స్పరెన్సీలను కూడా తీసుకుంటుంది సుస్పష్టమైన ప్రింట్లకు మరియు ఎన్‌లార్జిమెంట్లకు ఎప్పుడూ ఆగ్ఫా-గెవార్ట్ ఫొటో పేపర్లనే కావాలని అడగండి
తయారు చేయువారు న్యూ ఇండియా ఇండస్ట్రీస్ లిమిటెడ్ బరోడా

**ISOLY-I**

AGI
సోల్ డిస్ట్రిబ్యూటర్లు
ఆగ్ఫా-గెవార్ట్ ఇండియా లిమిటెడ్
బొంబాయి • న్యూ ఢిల్లీ • కలకత్తా • మద్రాసు
® ఫొటోగ్రాఫిక్ వస్తువుల ఉత్పత్తిదారులైన ఆగ్ఫా-గెవార్ట్ అంట్‌వెర్ప్ లివెర్కుసన్ రిజిస్టర్డ్ ట్రేడ్‌మార్కు

నిజంగా మీదే. ఐసోలి.

Simoes/AG/15/Tel



''పండంటి సంసారం''లో భానుమతి



''భారతి'' ప్రారంభోత్సవం. దర్శకుడు వీటూరి, నాయిక జమున

చేపట్టారు మాటలను అప్పలాచార్య, పాటలను ఆచార్య ఆత్రేయ, సంగీతాన్ని మహదేవన్, ఛాయను సుకదేవ్, కూర్పును ప్రకాశం నిర్వహిస్తున్నారు.

''పండంటి సంసారం''**లో** అయిదు జంటలున్నాయి. మొదటి జంటగా భానుమతి — గుమ్మడి, రెండవ జంటగా మణిమాల — సత్యనారాయణ; మూడవదిగా రమాప్రభ — రాజబాబు; నాలగవదిగా భారతి — శ్రీధర్; అయిదవ జంటగా ఛాయాదేవి — రావు గోపాలరావు నటిస్తున్నారు. అల్లు రామలింగయ్యది ఒక ముఖ్య పాత్ర. ఈ చిత్రాన్ని జె. ఏ. రామసుబ్బయ్య, నారాయణ సుబ్బరాయడు నిర్మిస్తున్నారు.

''భానుమతి భూమిక''

ధనవంతురాలు, సంప్రదాయసిద్ధంగా సంసారాన్ని తీర్చిదిద్దే యిల్లాలు. భారతీయ సంస్కృతికి, సభ్యతకు విలువ నిచ్చే వనిత. ఇన్ని వుత్తమ గుణాలను గొన్న భూమికను భానుమతి ''పండంటి సంసారం'' **లో** ధరిస్తున్నది, అన్నారు చిత్రాన్ని సమర్పించే కె. సుబ్బిరెడ్డి. ఈ చిత్రం ఆంధ్రాలో కుమారస్వామి, సీడెడ్‌లో విజయలక్ష్మి, నైజాంలో అలైడ్ ద్వారా విడుదల అవుతుంది.

రాజబాబు కల

మమతా కంబైన్స్ వారి ''పల్లె పడుచు'' చిత్రం షూటింగు వడివడిగా జరుగుతూ వుంది. ఇటీవల రాజబాబుకు సంబంధించిన సన్నివేశాలు చిత్రీకరించ బడ్డాయి. ఈ చిత్రానికి ఎడిటర్ సత్యం దర్శకుడు.

'రాజబాబు వేషం' గూర్చి దర్శకుడిని అడిగాను. ఆయన చెప్పిన సమాచారాన్ని యిక్కడ వ్రాస్తున్నాను. ''అందమైన అమ్మాయిల పొందుకోసం అర్రులు చాచే రకం. రోజుకొక అమ్మాయిని తన ప్రేయసిగా వూహించుకోవడం అతనికి అలవాటు. అతనొక రోజు కలగన్నాడు. ఆ కలలో ఘల్లు ఘల్లు మంటూ గజ్జెలసందడిచేస్తూ సెక్స్ బాంబ్‌షెల్ జ్యోతిలక్ష్మి కనిపించి, రాజబాబును తికమక పెట్టింది. ఆమె అవయవ సోయగాన్ని చూస్తూ కళ్లు తెరిచాడు. అక్కడ ఎవరూలేరు. అలా కలగంటూ జీవితాన్ని గడిపే బుజ్జిగా రాజబాబు నటిస్తున్నారు.'' అని దర్శకుడు సత్యం చెప్పారు.

''పల్లెపడుచు''గా ఊర్వశి నటిస్తున్న యీ చిత్రానికి బొల్లిముంత మాటలను, రాజేశ్వరరావు సంగీతాన్ని, కళాధర్ కళను, జయకుమార్ సహాయ దర్శకత్వాన్ని, కపిల గోపాలరావు ప్రొడక్షన్ను నిర్వహిస్తున్నారు. ప్రధాన పాత్రలను కృష్ణంరాజు, విజయలలిత, రాజబాబు, మనోరమ, సూర్యకాంతం, అల్లు రామలింగయ్య, సాక్షి రంగారావు, ఛాయాదేవి పోషిస్తున్నారు. పత్రికా రచయిత వాశిరాజు ప్రకాశం తీస్తున్న రెండవ చిత్రం యిది.

''రాజబాబు కథ''

శబరిమలై అయ్యప్పస్వామిని దర్శించి వచ్చిన రాజబాబును ''జీవితరంగము'' ఆఫీసులో కలిశాను. ఆ చిత్ర నిర్మాత గుళ్లపల్లి

నాగేశ్వరరావుతో ఒక ఉదాత్తమైన కథను చెప్పారు, రాజబాబు. ఆ కథను నేనూ విన్నాను. కథకు "లక్ష్మి—సరస్వతి—బ్రహ్మ" అని పేరు యిమిడినట్లు చెప్పారు. 'ఒక మూగపిల్ల, ఒక గుడ్డిపిల్లకు సంబంధించిన కథను రాజబాబు వ్రాశారు. ఆయన ఊహా శక్తికి జోహారు చేశాను. మన చిత్రాలకు బంగారుపతకం లభించాలంటే అలాంటి కథను నిర్మించడానికి మన నిర్మాతలు ముందుకురావాలి. రాజబాబు వేసేది నవ్వించే వేషాలు. కానీ ఆయన వ్రాసినది హృదయ విదారకమైన కథ.

### "ఎవరికివారే యమునాతీరే"

ఈ ప్రపంచంలో ఎవరు ఎందుకు జన్మిస్తారో, ఎందుకు ఏకమవుతారో ఎందుకు విడిపోతారో, చివరికి అందరూ ఎక్కడికి పయనం అవుతారోనన్న నగ్నసత్యాన్ని చిక్కటి కథగా వ్రాశారు, రాజబాబు. ఆ కథకు దాసరి చేత మాటలను రాయించి, సినిమా అనువాదం చేయించి, దర్శకత్వాన్నికూడా అప్పగించారు, రాజబాబు. ప్రధాన పాత్రలను ఎస్వీరంగారావు, రాజబాబు, రమాప్రభ పోషించగలరని తెలుస్తూంది. జీవిత వేదాంత సారానికి ప్రతిరూపమే, రాజబాబు వ్రాసిన "ఎవరికివారే యమునాతీరే" కథ.

### అరకులోయలో చందన

శ్రీధర్ కంబైన్స్‌వారి "చందన" చిత్రం షూటింగు నెలరోజులు అరకులోయలో జరిగింది. అన్నాళ్ళు అక్కడ వుండవలసిన అగత్యమేమిటని నిర్మాత గిరిబాబును అడిగాను.

"ప్రకృతి రామణీయకతకు నిలయమైన అరకు లోయలో ఒక సంవత్సరం వున్నా ఇంకా వుండాలనిపిస్తుంది. భూతల స్వర్గమువలె వుంటుంది ఆ ప్రదేశము. అక్కడ చందన చిత్రానికి సంబంధించిన అయిదు పాటలను చిత్రీకరించాము" అన్నారు.

కథానాయిక పాల్గొన్న నాలుగు పాటలు అగకులోయలో చిత్రీకరించబడ్డాయి. ఆమెతోబాటు కొత్త నటుడు రంగనాథ్ కూడా పాల్గొన్నాడు. ఆ పాటలేమిటో పాఠకులకు తెలియ చేస్తున్నాను.

"చిలకపచ్చని కోనలో (బాలు పాడినది)
పొన్నపూల ఉయ్యాల (జానకి)
సిరిమల్లె సెట్టుకింద రామోలమ్మో (జానకి)
నిజం దేవుడెరుగు, నీరు పల్లమెరుగు" (జానకి)

ఈ పాటలన్నీ డాక్టర్ నారాయణరెడ్డి వ్రాశారు. ఒక్కొక్క పాటకు రమేష్ నాయుడు తీసుకొన్న శ్రద్ధ అనిర్వచనీయము.

గంధము ఎక్కడవున్నా, సువాసనను వెదజల్లుతుంది. అలాంటి స్వచ్ఛందమైన, నిర్మలమైన సుగుణాలరాశి కథ గాబట్టి, 'చందన' అని పేరు పెట్టాను, అన్నారు గిరిబాబు.

"చందన" రషెస్ చూసిన తరువాత, దర్శకుడు గిరిబాబును ఏమని అభినందించాలో అర్థంగావడంలేదు. పాటల చిత్రీకరణ, బరువైన సన్నివేశాల చిత్రీకరణ చెయ్యడంలో ఘనుడు అనిపించాడు. కథానాయకుడు రంగనాథ్ కొత్తవాడయినా, జంకులేకుండా, సహజంగా నటించాడు. ఈ చిత్రంలో సత్యనారాయణ, రాజబాబు, విజయభాను, రావుగోపాలరావు ముఖ్యపాత్రధారులు. తారకరామ విడుదల.

### "పూజాపుష్పాలు"

జయవాణీ ఆర్ట్సు తలపెట్టిన చిత్రం యిది. పవిత్రమైన కథాంశంగొన్నది గాబట్టే "పూజాపుష్పాలు" అని పేరు పెట్టడం జరిగింది. కథను వీరరాజు వ్రాశారు. మాటలను వీటూరి వ్రాస్తున్నారు. సంగీతాన్ని సత్యానికి, ఛాయను ప్రకాష్‌కి, కళను కళాకార్‌కి, కూర్పును కోటగిరి గోపాలరావుకు అప్పగించడం జరిగింది. ముఖ్యపాత్రలను జయంతి, సత్యనారాయణ పోషిస్తారు. చిత్రానుకరణ+దర్శకత్వంను చక్రవర్తి నిర్వహిస్తారు. ఈ చిత్ర నిర్మాణ బాధ్యతను బి. వీరరాజు చేపట్టారు.

### "చక్రవర్తి పరిస్థితి"!

నటుడు కాంతారావు నిర్మించిన "గుండెలు తీసిన మొనగాడు" చిత్రానికి చక్రవర్తి దర్శకుడు. ఆ చిత్రం చూచినవారు ఎవరయినా సరే, చక్రవర్తిని మెచ్చవలసినదే. ఆ చిత్రం ఎప్పుడు విడుదలయినా సరే, పరిశ్రమలో చక్రవర్తి పరిస్థితి మెరుగు పడుతుంది.

—శ్రీనివాస్



"నిజరూపాలు"లో విజయనిర్మల

# ప్రశ్నావళి

## కె. రామలక్ష్మి

ఎమ్. డి. నాగాయలంక

స్త్రీకి ఉన్నతస్థానం ఏది ?

పురుషుడామెకు కేటాయించిన స్థానమే — ఆమెకు తగినదని — నమ్మమంటున్నారు !

వి. జి కె రాజమండి.

సీరియల్ ఎలా రాస్తారు ?

చాలా సులభం. తీయగా తీయగా రాగం. రాయగా రాయగా సీరియల్!

పి. ఆర్. కె. శ్రీకాళహస్తి.

ఆడది అంటే చిన్న చూపు చూసే మగవారిని ద్వేషిస్తానంతే అన్నారు. అయితే అట్టి చూపు చూసే ఆడవారిని కూడా ద్వేషిస్తారా?

ఆడవారిని మటుకు ఎందుకు ద్వేషించను ? అల్పత్వం ఎవరిలో ఉన్నా— నాకు అసహ్యమే.

పి. ఎస్ వి. పి. ఆర్. భిలాయినగరు.

నేటి స్త్రీలు ముఖ సౌందర్యం పెంచుకోడానికి టన్నులకొలది సౌందర్య సాధనాలు, చాలా సమయం వృధా చేస్తున్నారు గాని బుద్ధి పెంచుకోడానికి అంత కష్టపడరు . . . .

బాగుందండీ మీ వరస ! వెనకటికి పీటల్మీద కూర్చున్న వో పెళ్ళికొడుకు ప్రాణం విసిగి పురోహితుడిని అడిగాట్ట 'ముహూర్తం ఇంతాలస్యం అని ఎందుకు చెప్పలేదయ్యా యింకో మూడూళ్ళు ముష్టెత్తి వద్దును' అని. అలావుంది మీ టైము సెన్సు . . . స్త్రీ సింగారించుకోకపోతే అందంలేదు పురుషుడు సింగారించుకున్నంత చౌకబారుతనం లేదు. అందుకే— సెంట్లు రాసుకుని, దట్టంగా పౌడరుపూతలు పూసుకుని.. తిరిగే మగవాళ్ళని చూసి సాటి మగవారూ ఆడవారూ కూడా ముసిముసి - నవ్వులు నవ్వకపోరు . . . .

కె. ఎస్. పి. హిందుపూరు

నేనో అమ్మాయిని ప్రేమిస్తున్నాను... ఆ విషయం నా మిత్రుడు తెలుసుకుని ఆ అమ్మాయిని ప్రేమించాడు . . . .

ఇంకేం ? ప్లాటు పకడ్‌బందీగా ఉంటుంది— చక్కని సినిమా కథ రాసేయండి.

ఎమ్. కె. డి. విశాఖపట్నం

నేను పన్నెండు సంవత్సరాలుగా ఉద్యోగంలో ఉన్నాను కాని చేరిన దగ్గరినుంచీ నాకీ పని ఇవ్వటంలేదు. ఎవరి మెప్పు పొందలేకపోతున్నాను . .

దాన్లో ఆశ్చర్యం ఏముందీ ? అయిష్టంతో పని చేస్తే— ఏ పనైనా కష్టంగానూ ఉంటుంది. అసంతృప్తి మిగిలిపోతుంది. అందుకే— ఉట్టి జీతం రాళ్ల కోసం పనిచేస్తున్నాం అనుకోకుండా— చేస్తున్న పనిలో కుతూహలం ఏర్పరచుకోవాలి

టి. వి ఎల్. కాశీబుగ్గ

మగవాళ్లు ఎప్పుడు మారుతారు ?

మాటలో మన మాట— ఎలా మారాలని మీ ఉద్దేశ్యం ? !

పి. ఆర్. దానమయ్యగారిపల్లె

పెద్దవారు ఎంత తప్పు చేసినా అది ఒప్పే అవుతుంది. . . కాని చిన్నవారు . . .

పెద్దవాళ్లు కనుక, సమర్థించుకుంటారు— తాము చేసిన తప్పులు. చిన్నవాళ్లు కనుక అనుభవం తక్కువ చేత— బయటపడిపోతారు. అంతే తేడా.

పి. ఎల్. ఎమ్. శ్రీముఖలింగం

మనిషికి మనసు ముఖ్యమా ? మనీ ముఖ్యమా?

రెండూను— అప్పుడే రెండింటికీ సద్వినియోగం.

వి. వి ఆర్. హైద్రాబాదు

ఆనందం పొందాలంటే ?

ఆనందం మన పెరట్లోనే పూస్తుంది బ్రదర్. పక్క వారి తోటలోంచి కోసుకోనక్కరలేదు!

డి. వి. హైద్రాబాదు

ఎవరికీ కష్టం కలగకుండా సమాజాన్ని మార్చలేరూ ?

కష్టం లేకుండా మార్పు కుదరదు

ఎ. ఎన్ ఆర్. కాశీబుగ్గ

ఆత్మీయత అంటే ఏమిటి ?

వ్యక్తిత్వాలని కించపరచుకోకుండా, హెచ్చుతగ్గుల ప్రమేయం లేకుండా— అర్థం చేసుకోవడం ఆత్మీయత.

పి. సి. ఆర్. అడదామలపల్లి

నా ప్రశ్నలకు సమాధానం యివ్వకూడదనా ? లేక ఇవ్వటానికి చేత కాకనా ?

చేతకాకనే తమ్ముడూ— లేకపోతే ఎందుకివ్వను చెప్పు !




# డాక్టరు సలహాలు!

## డా॥ కె. వెంకటేశ్వరరావు

లక్ష్మి—బరంపురం.

నాకు తరచు కంటిరెప్ప మీద 2, 3 కురుపులు లేస్తున్నాయి. కన్ను వాచి నెప్పిపుడుతుంది.

★ వీటిని 'స్టై' అంటారు కంటి రెప్పలలోని గ్రంధుల నాళములు అడ్డు పడటం, వెంట్రుకల కుదుళ్ళకు చీము పట్టడం వల్ల ఇలా జరుగుతుంది.

పరిశుభ్రత చాలా అవసరం. టెర్రామైసిన్— కంటికి ఆయింట్‌మెంట్ క్రమంగా 10 రోజులు వాడండి. 'మల్టి విటాప్లెక్స్' మాత్రలు రోజుకి ఒకటి చొప్పున ప్రతి రోజూ వాడితే ఇలా తరచూ రావటానికి అవకాశం తక్కువ. నీటిలో మార్పు అవసరం.

విజయలక్ష్మి-విజయవాడ.

నాకు బొట్టు పెట్టుకొనే చోట పుండు పడింది ఆయింట్‌మెంట్ రాస్తే తగ్గింది తిరిగి వస్తున్నది. . .

★ కుంకుమ, తిలకం తయారీలో కల్తీలు మొదలగు వాటివల్ల, స్వతహాగా కొందరికి అలర్జీ వల్ల ఇలా వస్తుంది పూర్తిగా మానే వరకు ఇవి వాడటం మానితే మంచిది లేకపోతే ఆయింట్‌మెంట్లు వాడినంతకాలం, పోయి మరలా వస్తుంది

ఎ. వేణు—భిలాయ్

మా అబ్బాయికి 7 సం.ల వయస్సు తరచూ విరేచనాలు అవుతూ వుంటాయి కడుపునెప్పితో ప్రారంభమయి, దుర్వాసనతో మలవిసర్జన జరుగుతున్నది. రెండు రోజులలో మలము పలచబడి విరేచనాలవుతాయి. మందు ఇస్తే కొన్ని రోజులు మామూలుగావుండి తిరిగి యధాప్రకారం మొదలవుతాయి.

★ మలపరీక్ష చేయించడం చాలా అవసరం ఆహారంలో ఎక్కువ క్రొవ్వు పదార్థములు వున్నప్పుడు కూడా యిలా రవటం జరుగుతుంది మలంలో "అమీబియాసిస్" "గయార్డియాసిస్" "అస్కారియాసిస్"— లన్న క్రిములు వున్నప్పుడు వాటికి తగిన చికిత్సలు చేయించాలి

వి. నాగేశ్వరరావు-బ్రహ్మనతర్ల (శ్రీకాకుళం)

నా కుడి వైపు బీజము నెలరోజులకు, పదిహేను రోజులకొకసారి వాస్తున్నది

★ దీనిని "ఫైలేరియల్ ఆర్కైటిస్" అంటారు దీనితోబాటుగా కొందరికి చలిజ్వరము వస్తుంది. దీనికి 'హెట్రజాన్' మాత్రలు పూటకి రెండు చొప్పున రోజుకి మూడు పూటలుగా 10 రోజులు వాడాలి. దీనితో బాటుగా విటమిన్ 'సి' వాడితే మంచిది.

జె. రామారావు-నాగపూర్.

మా బంధువుల అమ్మాయికి పిర్ర మీద కురుపు లేచింది. వైద్యం చేయించినా కాలు సన్నబడి వంకర తిరుగుతున్నది. ఇప్పుడు పాపకి 3 సం. లు

★ ఈ కురుపు— తొడలోని ఎముకలోకి ప్రాకి దానికి చీము పట్టినందువల్ల ఇలా జరిగింది. దీనిని 'ఆస్టియోమైలైటిస్' అంటారు.

చిన్న శస్త్ర చికిత్స అవసరం కావచ్చు. 'ఆర్థో పీడిక్' సర్జన్కి చూపించి వెంటనే వైద్యం చేయించండి.

అర్. రాజ్యలక్ష్మి విశాఖపట్నం.

నా వయస్సు 26 సం. లు. 6, 7 సం. ల నుండి 'వైట్ డిస్చార్జి' అవుతోంది. నడుం నెప్పి నీరసం ఎక్కువగా వుంటాయి కడుపు నెప్పికూడాఎక్కువే! ..

★ దీనిని 'ల్యూకోరియా' అంటారు. యిలా రావటానికి ఎన్నో కారణాలు వున్నాయి. 'మొనీలియాసిస్' వీటిలో ముఖ్యమైనది. లేడీ డాక్టర్ వద్ద పరిశీలన చేయించుకోండి. వారు పరీక్షించి తగిన సలహా ఇవ్వగలరు

ఎస్. కైలాష్‌వతి—గుజరాతిపేట (శ్రీకాకుళం)

మా తల్లిగారికి, ఋతుక్రమం తర్వాత నెత్తురు ఎక్కువగా పోతున్నది. ఇది వరకు రెండు సార్లు ఆపరేషన్ చేశారు. మళ్ళీ చెయ్యాలంటున్నారు...

★ నిపుణులైన లేడీ డాక్టర్‌కి చూపించండి మీరు చెప్పిన వాటిని బట్టి వయస్సునిబట్టి గర్భకోశాన్ని 'కేన్సర్' లక్షణాలకి పరిశీలించాలి. అంటే ఇలా వున్నవారందకీ 'కేన్సర్' వున్నదని కాదు ముందు జాగ్రత్తగా పరీక్ష చేయించడం అవసరం.

కె. లక్ష్మీదేవి—కందుకూరు.

రెండు నెలల క్రితం మాకు పాప పుట్టింది పుట్టుకతోనే వీపు మధ్యన వెన్నెముక మీద గడ్డ వున్నది. 'మెనింగోసీల్' అన్నారు దీనికి ఏం చేయాలి?

★ వారు చెప్పినది సరి అయినదే. ఈ గడ్డ వెన్నుపాము పైన పొరలోపలి ద్రవం వెన్నెముకలోని ఖాళీ ద్వారా బయటికి రావటమే దీనికి కారణం దీనిలో బాటుగా కాళ్ళకి వెళ్ళే నరాలు కూడా లాగబడటం వల్ల కాళ్ళు కదపక పోవటం జరుగుతుంది దీనికి శస్త్రచికిత్స, మద్రాసులోనో, రాయవేలూరులోనో చేయించండి

కె. సరస్వతీదేవి—పాటిమీద (నిడదవోలు)

'నెఫ్రైటిస్' అంటే ఏమిటి? ఎందువల్ల వస్తుంది దానికి ఏం చేయాలి?

★ 'నెఫ్రైటిస్' అంటే మూత్ర పిండములు వాయుటం. దీనికి కారణం సరిగా ఇంతవరకూ తేల లేదు. అయినా చర్మంలో ఎక్కువగా పుండ్లు వున్నవారికి, 'టాన్సిల్స్' తరచూ వాస్తున్నవారికి ఈరోగం రావచ్చునని అంచనా

ఈ రోగం వున్నవారికి వుప్పు లేని ఆహారం, విశ్రాంతి, ఇవ్వాలి 'పెన్సిలిన్' ఇంజక్షన్లు క్రమబద్ధంగా వైద్యుల సలహాననుసరించి వాడాలి రోగం పూర్తిగా నయమయ్యేవరకు పూర్తి విశ్రాంతి అవసరం

# ధర్మపథం




బులుసు వేంకటరమణయ్య

ప్రతిదేశంలోనూ ఒక్కొక్క విధమైన దుస్తులు ధరించడం పరిపాటి. మన దేశంలో వస్త్రధారణం ప్రధానంగా భావించబడుతున్నది. వస్త్రాన్ని ధరించకపోతే నగ్నుడనీ, దిగంబరుడనీ అంటారు. పెద్దలు నియమించిన ప్రకారం వస్త్రాలను ధరించకపోతే కూడా నగ్నంగా వున్నట్లే భావించేవారు.

బట్టను కట్టుకొనేటప్పుడు కచ్చలు పోసి, కట్టుకోవలెనేగాని లుంగి కట్టుకొన్నట్లు కట్టుకోకూడదు. ఉత్తరీయాన్నికూడా ధరించాలి. పైబట్ట లేకుండా ఉండకూడదు. ఈ రీతిగానే—దరించే వస్త్రాలు మురికిగా ఉండకూడదు. పరిశుద్ధంగా ఉండాలి. ఇట్లే తడిబట్టతో ఉండరాదు. స్నానం చేసినవెంటనే తడిబట్టను విడిచి పొడిబట్ట కట్టుకోవాలి. పయి పద్ధతులకు విరుద్ధంగా వస్త్రధారణం చేస్తే నగ్నంగా ఉన్నవానిలోనే జమ. ఈ విషయాలను చెప్పే ఈ శ్లోకాన్ని చూడండి.

"వికచ్ఛోఽనుత్తరీయశ్చ
నగ్నశ్చావస్త్ర ఏవ చ,
నగ్నో మలినవస్త్రః స్యాత్
నగ్నశ్చార్ద్రపటః స్మృతః."

కచ్చపోసుకోకుండా పరిధానాన్ని ధరించినవాడూ, పైమీది అంగవస్త్రం లేనివాడూ నగ్నునితోనూ, వస్త్రం లేనివానితోనూ సమానులు. ఆ రీతిగానే మురికిబట్టను ధరించినా—తడిబట్టను కట్టుకొని ఉన్నా నగ్నంగా ఉన్నట్లే భావించవలసి ఉన్నది—అని దీని అభిప్రాయం.

ఆరోగ్యం కాపాడుకొనడానికి కూడా పెద్దలు చెప్పిన పద్ధతులు ఎంతో అనుకూలాలు. కచ్చ పోసుకొని వస్త్రం కట్టుకుంటే అవయవగోపనం సులభం. శీత, వాతాలకు అంగవస్త్రం కప్పుకోవడం ఎంతో అవసరం. మురికి బట్టలు, తడిగుడ్డలు అనారోగ్యానికి మూలం.

అంతే కాదు. కాలిన బట్టలు, చినిగిన గుడ్డలు, మురికిగుడ్డలు, ఎలుకలు కొట్టివేసినవి, పశువులు నమిలివేసినవి ధరించకూడదు. అట్టి వస్త్రాలను ఉపయోగించకుండా విడిచిపెట్టాలి. దీనికి ఆరోగ్యరక్షణమే లక్ష్యం.

"దగ్ధం జీర్ణం చ మలినం
మూషకోపహతం అథా,
ఖాదితం గోమహిష్యాద్యైః
తత్ త్యాజ్యం సర్వదా సదా"

అనే శ్లోకం మీది అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నది.

'చెప్పివెళ్లలేదు. ఎక్కడికెళ్లాడో తెలీడం లేదు...' సుబ్బరామయ్య అన్నాడు, ఆందోళన వీలయినంతవరకు వ్యక్తంకానీయకుండా.

'సినిమాకెళ్లాడేమో... నే వస్తానండి' రంగారావు సైకిలెక్కి ముందుకెళ్ళిపోయాడు.

సుబ్బరామయ్య నిట్టూర్చాడు. మెల్లగా నడుచుకుంటూ మెయిన్ రోడ్డు మీదకు చేరుకున్నాడు. అక్కడున్న లైటుస్తంభం దగ్గర నిలబడ్డాడు.

'ఎప్పుడో ప్రొద్దుట తొమ్మిదిన్నరకు భోంచేసి ఆఫీసుకి బయలుదేరి వెళ్ళినవాడు, ఇంకా రాలేదు.'

'ఆఫీసులో వుండిపోయాడా ? గవర్నమెంటు ఉద్యోగంకదా. ఏదైనా అర్జంటు పనివుండికూర్చొని చేయమనివుంటారు. బాబ్జి చెప్పకుండా సినిమాకెళ్ళడు. తప్పకుండా ఆఫీసులోనే వుండివుంటాడు !'

'తను ఇప్పుడు ఆఫీసుకెళ్ళిచూస్తే ? కానీ రెండుమైళ్ల దూరముంది. రిక్షాలో వెళ్ళాలి. దానికి డబ్బులుకోసం మళ్ళా యింటికివెళ్ళాలి. ఒంటిమీద బనీనుతో వచ్చేసాడు తను.'

'కాసేపు ఇక్కడే నిలబడి చూస్తేసరి. ఓ గంటపోయాక అప్పటికీ రాకపోతే, అలాగే ఆఫీసుకెళ్ళొచ్చు'.

లారీ ఒకటి చప్పుడు వేసుకుంటూ రోడ్డు మీదనుండి అతివేగంగా వెళ్ళింది. లారీ దూరమవుతున్నకొద్దీ, దాని శబ్దంకూడా తగ్గిపోతూ ఓ నిముషానికి పూర్తిగా తగ్గిపోయింది.

లైటు ఇచ్చేకాస్త వెలుతురూ తప్పించి మిగతా ప్రదేశమంతా చీకటిగావుంది. గాలిలో తిరిగే పురుగుల శబ్దాలు ఎప్పుడూ వినిపిస్తూనే వున్నాయి.

మనుషుల జాడ అసలు లేదు—ఆ ప్రదేశం కాస్త వూరు బయట కావడం చేత.

సుబ్బరామయ్య కొడుకు వచ్చే దిక్కు చూస్తూ నిలబడి పోయాడు.

'ఈ క్షణంలో తన కొడుకు ఎక్కడ వున్నాడో తెలిస్తే బావుణ్ను. ఎక్కడున్నా క్షేమంగా వుంటే చాలు. తెల్లవారిన తర్వాతైనా తిరిగివస్తాడు.'

'అసలే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా వున్నాయి. రాత్రిపూట లారీలు విపరీతమైన వేగంతో వెళుతుంటాయి. డ్రైవర్లు నిద్రపోతూ లారీలు నడుపుతారు. కొంతమంది బాగా తాగి నడుపుతుంటారు.'

'తన బాబ్జికి అటువంటి రోడ్డు ప్రమాదం ఏమీ జరగలేదు కదా ?'

'వాడికి ఉద్యోగం వచ్చి ఏడాది అయింది. ఆఫీసు కాస్త దూరమని తనే సైకిలు కొనక్కోమన్నాడు డైనమో కూడా వేయించాడు. సైకిలు కొన్న తర్వాత కాస్త ఆలస్యంగానే వస్తున్నాడు యింటికి. ఆఫీసు అయిదు గంటలకల్లా అయిపోతుంది. తర్వాత ఏ సెంటర్లోనో స్నేహితుల్తో కబుర్లలో పడితే కాలం తెలియదు, వాడికి.'

'తనూ చిన్నతనంలో అంతే. స్నేహితుల్తో కబుర్లాడుతూ పదీ పదకొండు వరకు కాలక్షేపం చేసేవాడు.'

'బాబ్జికూడా అలాగే కబుర్లలో పడిపోయాడా ? అయినా అర్ధరాత్రి వరకూనా ? పైగా తిండి తినకుండా ?'

'మరి ఏమయినట్టు ?'

'వుంటే ఆఫీసులో వుండాలి. లేకపోతే సినిమాకెళ్ళివుండాలి. ఇవిరెండూ కాకపోతే ... సైకిలు మీద వస్తున్న బాబ్జికి ఏ ప్రమాదమూ జరగలేదుగదా ! ... భగవాన్ ... అంత పరిస్థితి తెచ్చిపెట్టకు !'

'బాబ్జి లేకపోతే తను బతకలేడు. వాడు తన బంగారు కల ! తన వంశంలో డిగ్రీ చదివిన మొదటివాడు. జానకి తరఫు వాళ్లలో కూడా డిగ్రీ వాళ్లెవరూలేరు. వాళ్లందరివీ నానాకాలపు చదువే, తనకుమల్లే. కానీ తన కొడుకు బియ్యే ! మొదట్నుంచి బాగా చదువుకున్నాడు. మొదట్నుంచి బుద్ధిమంతుడు. చెడు స్నేహాలు ఎరుగడు. అదికావాలీ, ఇది కావాలీ, బట్టలు కావాలీ అని ఎప్పుడూ అడగలేదు. చిన్నప్పట్నుంచీ కుటుంబ ఆర్థిక పరిస్థితి ప్రకారం నడిచాడు, వాడి కాలేజీ చదువుకోసం తను అప్పులు చేశాడు. ఎన్నో ఇబ్బందులకు గురి అయ్యాడు. అయినా తన కష్టం ఫలించింది. బాబ్జి బాగా చదువుకున్నాడు. ఉద్యోగం సంపాదించుకున్నాడు.'

'వాడికి ఓ సిగరెట్ అలవాటు లేదు. వక్కపొడి అలవాటు లేదు. బూతులు మాట్లాడగా తనెప్పుడూ వినలేదు. తన కొడుకు తనకు గొప్ప కావచ్చు. మిగతా వాళ్ళూ గొప్పగానే చెప్పారు. తను వాడి గురించి గొప్పగా అనుకోవడంలో తప్పులేదు.'

'తనలా ఎనిమిది చదివి బట్టలకొట్టులో గుమస్తా కాకుండా గవర్నమెంటు వుద్యోగం సంపాదించాడు. పదేళ్లుపోతే ఆఫీసరవుతాట్ట! తప్పకుండా అవుతాడు. తనకా నమ్మకం వుంది.'

'మొన్న రాజయ్య కనపడి తనతో ఎంతో గోలపెట్టాడు ! 'ఇదుగో సుబ్బరామయ్యా ! మీ అబ్బాయి చాలా బుద్ధిమంతుడయ్యా. నువు చాలా అదృష్టవంతుడివనుకో. నాకూ వున్నాడు ఓ కొడుకు. ఏంలాభం ... రెండొందలయాభై జీతం వస్తుంది. యాభై మాత్రం నా మొహాన పడేసి పోతాడు. మరి రెండొందలు ఏం చేస్తాడో చెప్తుంటే గుండెలుతరుక్కుపోతాయ్ ! ఇంతలేసి గుంట వెధవలు తాగుడుకు అలవాటుపడుతున్నారయ్యా ఈ కాలంలో.'

'ఒక్క రాజయ్యేకాదు, చాలామంది తనతో తమ కుమారులను గురించి ఇలాగే వాపోయ్యారు.'

'బాబ్జి ఉద్యోగంలో చేరిన తర్వాత కాస్త సినిమాలు ఎక్కువగా చూడడం మొదలెట్టాడు. అది సహజం. తాను మాత్రం మొదట్లో ఎన్ని సినిమాలు చూడలేదు. అప్పుడు డ్రామాలెక్కువ. ప్రక్కవూళ్లో డ్రామా వేస్తున్నా వెళ్లేవాడు తను. ఆ వయసు అటువంటిది. ఇప్పుడంటే ఏ సినిమాకీ వెళ్లబుద్ధేయదు. డ్రామాకి కూడా వెళ్లబుద్ధేయదు. వయసు మీద పడుతున్నకొద్దీ అన్నిటిమీదా అనురక్తి తగ్గుతోంది.'

ఓ సైకిలు రిక్షా చప్పుడు చేసుకుంటూ వెళ్లింది. అందులో యువ దంపతులు వున్నారు. అమ్మాయి పూలుకాస్త ఎక్కువగా పెట్టుకుంది. అబ్బాయి తన చెయ్యిని



'రాష్ట్రపతి పాలన పోయింది సరే! మరి ప్రత్యేక ఆంధ్ర సంగతేమయింది మావా?'
'ఇదుగో సుప్ నోర్మూసుకో!'

# అపేక్ష

కొలను వేంకట దుర్గాప్రసాద్



**సు**బ్బరామయ్య ఆరుబయట మంచం మీద పడుకున్నాడన్నమాటే గానీ, నిద్ర పోలేక పోతున్నాడు.

ఆకాశంలో అక్కడక్కడా చుక్కలు మెరుస్తున్నాయి.

పడుకున్న మనిషి లేచి కూర్చున్నాడు. బయట గేటువంక చూసాడు, ఏదన్నా సైకిలు ఆగిన చప్పుడు వినపడుతుందేమోనని. ఊహూ, చప్పుడు కాలేదు.

మంచం మీదనుండి మెల్లగాలేచి వరండా లోకి వెళ్లాడు. కూజాలోంచి చల్లటి నీళ్లు గ్లాసులోకి వొంపుకొని త్రాగాడు. మళ్లావచ్చి మంచంమీద కూర్చున్నాడు.

'ఏవేఁ' పిల్చాడు భార్యని. ఆమె పలకలేదు.

'జానకీ' పిల్చాడు మళ్లా. ఆమెకదలలేదు.

తన మంచం మీద నుండి లేచి భార్య మంచం దగ్గరికెళ్లి మెల్లగా తట్టి 'జానకీ!' అని పిల్చాడు.

ఈ సారి ఆమె కదిలింది. ఆయన్ని చూసి ఆవలిస్తూ లేచింది. 'బాబ్జి వచ్చాడా ?'అంది మగతగానే.

'లేదు !' నిట్టూర్పుతో అన్నాడు.

'అప్పట్నుంచీ మెలుకువగానే వున్నారా ?' అడిగింది.

'నిద్ర పట్టలేదు' అన్నాడు.

'టైము ఎంత అయిందో' అంది, మంచం మీదనుండి లేస్తూ.

'ఇంతకుముందు చూసినపుడు పదకొండు న్నరయింది ఇప్పుడు పన్నెండు కావచ్చు' అన్నాడు.

జానకి పలకలేదు.

'నేనలా ఓమారు రోడ్డు మీద కెళ్లొస్తాను' అన్నాడు బయలు దేరుతూ.

'ఎందుకు ఈ చీకట్లో? వాడే వొస్తాడ్లెండి!'... 'ఏ సినిమాకో వెళ్లుంటాడు' అం .

'చెప్పే వెళ్లేవాడుకదా ! ...సినిమాకి వెళ్లి వుండడు.' సుబ్బరామయ్య గేటు తెరిచాడు. జానకి వెంట వచ్చింది గేటువరకు.

సుబ్బరామయ్య చీకట్లోకి నడిచాడు.

అదొక లైట్లులేని చిన్నవీధి. ఆ వీధిని ఓ ఫర్లాంగు నడిస్తే మెయిన్‌రోడ్డు వస్తుంది.

సుబ్బరామయ్యకు చీకట్లో దారి కనిపించ లేదు కాసేపు చీకట్లో నిలబడ్డాడు. కొంచెం దారి కనిపించినట్లు అనిపించింది.

ముందుకు నడిచాడు దగ్గు వచ్చింది. గట్టిగా దగ్గాడు ఓ నిముషం, నడుస్తూనే

చీకట్లో కుక్క 'భౌ య్'మని ఒక్కసారిగా అరిచింది. సుబ్బరామయ్య చలించలేదు. ఆ కుక్క వీరాస్వామి నాయుడుదని తెల్సు. 'ఛయ్' అని కసురుకున్నాడు. కుక్క అరుపు మానింది.

సుబ్బరామయ్య నడుస్తున్నవాడల్లా ఆగి పోయాడు. మెయిన్‌రోడ్డు మీదనుండి ఓ సైకిల్‌లైటు వీధిలోకి చీకటిని చీల్చు కుంటూ వస్తూ కనిపించింది. లైటు రాను రాను దగ్గరయింది.

'అమ్మయ్య... వస్తున్నట్టున్నాడు.' అనుకున్నాడు.

సైకిలు దగ్గరికివచ్చి ఆగింది.

'బాబ్జి !' మెల్లగా పిల్చాడు.

'నేను, రంగారావుని !... బాబ్జి ఇంక రాలేదా ?' అడిగాడు రంగారావు.

'ఇంకా రాలేదు. వాడికోసమే చూస్తున్నాను '

'ఎక్కడికెళ్లాడు ?'

అమ్మాయి నీవు వెనుకగా పోనిచ్చి ఆమె భుజాన్ని పట్టుకున్నాడు.

'బాబ్జీకి ఇరవై రెండేళ్లు దాటుతున్నాయి. మంచి సంబంధం చూడాలి. బంగారు బొమ్మని తీసుకొచ్చి చేయాలి. సరో రెండేళ్లలో తను తాత కావాలి. కాని వాడు చేసుకోనంటున్నాడు యిప్పుడే. ముందు చెల్లి పెళ్లి కానివ్వు అంటాడు. వాడి పెళ్లి అయితే తనకి అదో సంతోషం.'





కొన్ని రిక్షాలు, సైకిళ్లు, అప్పుడే రోడ్డు మీద నుంచి వెళ్లాయి. నలుగురు మనుషులు నడుచుకుంటూ వెళ్లారు, సుబ్బరామయ్యని చూసుకుంటూ.

'సినిమాలు వదిలినట్టున్నారు. కాసేపు నిలబడితే మంచిది. సినిమాకి వెళ్లినట్టయితే ఈపాటికి వచ్చేస్తుంటాడు.'

సుబ్బరామయ్య అరగంట నిలబడ్డాడు. బాబ్జీ జాడ కనిపించలేదు.

'తను వాడికోసం ఇలా ఎదురు చూడడం వాడికి యిష్టంలేదు. ఎందుకు ఎదురు చూడడం ? నిద్ర పాడుచేసుకోవడం, మనసు పాడుచేసుకోడం కాదూ! అంటాడు. మొన్నొక సారి వర్షం వచ్చినప్పుడు, రాత్రి పదకొండు దాటినా బాబ్జీ యింటికి రాకపోతే, తను ఇక్కడే గొడుగు పట్టుకొని చాలాసేపు ఎదురు చూసాడు.

'ఎందుకు నాన్నా వర్షంలో నాకోసం ఎదురు చూడడం. ఆరోగ్యం పాడవదూ ? కాస్త ఆఫీసులో ఆలస్యమయింది ఇవాళ. చిన్న చిన్నదానికి కంగారుపడి ఒంటికి తెచ్చుకోకు' అని మందలించాడు.

కానీ తన ఆందోళన వాడికేంతెల్సు ? ఎప్పుడో ప్రొద్దుట భోంచేసివెళ్ళి రాత్రి పదకొండు గంటలవరకూ వాడు ఇంటికి రాకపోతే తనమనసు మనసులో వుంటుందా ? ఎటువంటి కీడు జరగదు, భగవంతుని దయ వలన. కాని తనమనసు ఆగదు. అది వాడికి తెలియదు.

పది నిముషాలు గడిచాయి. సుబ్బరామయ్యకి ఆందోళన ఎక్కువయింది.

'ఇంకారాలేదువాడు...తన బాబ్జీకి ఈ సారి ఏమయినా ప్రమాదం జరిగిందేమో ! ఇంత పెద్దవూరులో ఆక్సిడెంటు ఎప్పుడూ ఎక్కడో ఒకచోట జరుగుతూనే వుంటుంది. ఈ రోజు తన బాబ్జీకి జరిగివుంటుంది. తన మనసు కీడును శంకిస్తోంది. ఇక లాభంలేదు. ఇంటికి వెళ్ళి డబ్బులుతీసుకొని రిక్షావేసుకుని వాళ్ళ ఆఫీసుకు వెళ్ళిరావాలి...

సుబ్బరామయ్య అక్కడ్నించి చీకట్లో గబ గబా నడిచాడు ఇంటికి.

ఆయన మనసంతా ఆందోళనగావుంది. ఒళ్ళంతా చెమటపట్టేసింది. బనీను తడిసి పోయింది. వీధిలోని కుక్క 'భౌయ్' మని మళ్ళా అరిచేసరికి ఈసారి ఆయన హడలిపోలేదు. గేటుదగ్గర జానకి నిలబడివుంది.

'నిద్రపోలేదా ?' ఆందోళన కప్పిపుచ్చుకుంటూ అడిగాడు.

'మీరు వెళ్ళింతర్వాత నాకూ నిద్రపట్టలేదు.' అంది.

సుబ్బరామయ్య ఇంట్లోకి వెళ్ళాడు. గదిలో లైటువేసి, చొక్కా వేసుకున్నాడు. అలమరలో వున్న డబ్బాలోంచి ఓ అయిదు రూపాయల కాగితాన్ని జేబులో వేసుకున్నాడు. లైటు తీసేసి గబగబా వరండాలోకి వచ్చాడు.

గేటుదగ్గర సైకిలు చప్పుడయింది.

బాబ్జీ సైకిలుతోపాటు లోపలికొచ్చాడు. జానకి గేటువేసి కొడుకువెంట వచ్చింది.

సుబ్బరామయ్య గాలిపీల్చుకున్నాడు. బాబ్జీ రాకనుచూసి. ఇంట్లోకివెళ్ళి లైటువేసాడు. చొక్కావిప్పేశాడు. ఐదురూపాయల్ని మళ్ళా డబ్బాలో పడేశాడు.

'ఇంకా నిద్రపోలేదా మీరు ?' ఆశ్చర్యంగా అడిగాడు బాబ్జీ.

'నువ్వెక్కడికెళ్ళావ్ ? నువ్వు వస్తావని ఎదురుచూస్తు కూచున్నాం' అంది జానకి.

'మా స్నేహితుడొకడు ట్రాన్స్ ఫరయి వెళ్ళిపోతుంటే స్టేషనుకి వెళ్ళాను. పదిగంటలకు రావల్సినబండి, ఒంటిగంటకు వచ్చింది' అన్నాడు.

సుబ్బరామయ్య వరండాలో పడుకున్న ముగ్గురి కూతుళ్ళను సరిగా పడుకోబెట్టాడు.

తర్వాత తన మంచంమీద మేనువాల్చాడు. సుబ్బరామయ్య మనసు అప్పుడు ఎంతో ప్రశాంతంగా వుంది.

* * *

రాత్రి పదిన్నర అయింది.

వర్షం సన్నగా కురుస్తోంది.

బాబ్జీ, ముగ్గురు ఆడపిల్లలూ భోంచేసి పడుకున్నారు. జానకి యింకా భోంచెయ్యలేదు, సుబ్బరామయ్యకోసం ఎదురుచూస్తూ.

సుబ్బరామయ్య రోజూ రాత్రి తొమ్మిదికల్లా ఇంటికి వచ్చేస్తాడు హోల్ సేల్ బట్టల కొట్లో ఉద్యోగం. ఎనిమిదిగంటలకు కొట్టు కట్టేస్తారు. తర్వాత సైకిలెక్కి మెల్లగా మూడు మైళ్ళు తొక్కుకుంటూ ఇంటికి చేరతాడు.

పదిన్నర అయినా ఇంకా రాలేదేమిటా అని ఎదురు చూస్తోంది జానకి. ఓ సారి తడుచుకుంటూ గేటుదాకా వెళ్ళి వీధిలోకి చూసింది. సుబ్బరామయ్య వస్తున్నట్టు కనిపించలేదు

(47 వ పేజీ చూడండి)




(గత సంచిక తరువాయి)

## 4

**వ**సంత వచ్చేరోజు. మాధవ్ ట్రిమ్‌గా తయారయ్యాడు. రావ్ అతనికూడా వున్నాడు. ఇద్దరూ వాల్తేరు స్టేషన్ చేరుకున్నారు.

"ఫస్ట్ యింప్రెషన్ మంచిది క్రియేట్ చెయ్యాలి. బివేర్..."

"ఊఁ."

ట్రెయినువచ్చి ప్లాట్‌ఫారంమీద ఆగింది.

మాధవ్ ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ వైపు వడివడిగా నడిచాడు.

డోర్‌దగ్గర నిలుచుంది వసంత.

ఆమెను చూస్తూనే విష్‌చేసి – మందహాసం చిందించాడు

ఆమె కూడా చిరునవ్వు నవ్వుతూ రైలు దిగింది.

పోర్టరు ఆమె సామానులు తీసుకున్నాడు.

"ప్రయాణం సుఖంగా జరిగిందా వసంతా ?"

"ఓ! రిజర్వేషను సులభంగానేదొరికింది."

మాధవ్ కారుడోరు తెరచి పట్టుకున్నాడు.

"ప్లీజ్ గెటిన్."

"థా క్యూ."

"హలో మాధవ్..."

"హలో రావ్!... వస్తావా?"

"నో... థాంక్స్. స్టేషన్‌లో కొంచం పనుంది... హలో వసంతా! నేను జ్ఞాపకం ఉన్నానా ?"

"బలేవారే! మిమ్మల్నెలా మరచిపోగలను?"

"థాంక్యూ. తరవాత కలుస్తాను.పదండి."

కారు కదిలింది.

"మీ అమ్మగారూ నాన్నగారూ కులాసా?" అడిగేశాక సందేహం వచ్చింది మాధవ్‌కి–తను అటువంటి ప్రశ్నవేసి ఉండకూడదేమో అని.

"ఓ!–"

"నీ విజిట్‌కి చాలా థాంక్స్ వసంతా. నాకు చాలా సంతోషంగా ఉంది నువ్వు యిలాగ రావడం."

"నాకూ నిన్నుచూడాలనిపించింది మాధవ్. అదీకాక యూనివర్శిటీలో కొంచం పనికూడా ఉంది."

"కంగ్రాట్యులేషన్స్ వసంతా ! నీకుఫస్ట్ క్లాసు వచ్చిందిగా ? పార్టీ యివ్వాలి."

"ష్యూర్."

మెత్తగా జారుతూంది కారు.

"ఏం పార్టీ యిస్తావో?"

"నీకు కావలసింది..."

"ఎమ్మే ఐపోయిందికదా, యింకా నీకు యూనివర్శిటీతో పనేమిటి ?"

సమాధానం చెప్పలేదు వసంత.

కారు ఆగింది.

ఇద్దరూ ఇంట్లోకి నడిచారు.

"బావా ! ఇది నీ యిల్లేనా ?"

కాంప్లిమెంట్‌గా తీసుకుంటూ చిరు నవ్వు నవ్వాడు మాధవ్.

"ముందొక కప్పు కాఫీ తీసుకుని–స్నానం చేసిరా. అలసట తగ్గుతుంది. ఎంతయినా రైలు ప్రయాణం."

ఇద్దరూ నెస్కాఫీ సేవించారు.

వసంత బాత్ రూమ్‌లో అడుగుపెట్టింది.

మాధవ్ రికార్డు ప్లేయర్ ఆన్ చేశాడు.

ఇంగ్లీష్ సింఫనీ.

రాగతరంగాలు సున్నితంగా వ్యాపించసాగాయి.

ఇంపోర్టెడ్ షాంపూ; మూడురకాలసోపులు., బేదింగ్ లోషన్స్. హాట్ అండ్ కోల్డ్ వాటర్ పైపులు...వెచ్చని టర్కీ టవల్స్...స్పాంజి... వసంత స్నానం ముగించి వచ్చేసరికి అరగంట దాటింది. టబ్‌లోంచి లేవాలనే అనిపించలేదామెకి. ప్రయాణం అనంతరం అంత చక్కటి తలంటు ఆమెకి చాలాహాయినిచ్చింది.

"థాంక్యూ మాధవ్ థాంక్యూ. నాకోసం చాలా శ్రమ తీసుకున్నావు–"

"నీకోసం అయితే ఏదీ శ్రమ అనిపించదు వసంతా. సంతోషంగా ఉంటుంది."

టాయ్‌లెట్ టేబుల్‌ముందు కూర్చుని చివరి మెరుగులు దిద్దుకుంటూందామె. ఈవెనింగ్ యిన్ పారిస్ చక్కని పరిమళం వ్యాపింప జేస్తూంది.

"ఈమధ్య యిక్కడొక చక్కని హోటల్ ప్రారంభించారు."

"అప్సరా కదూ?" వసంత చెవి రింగులు కొంచం కదిలాయి.

"ఊఁ భోజనం అక్కడ చేద్దాం. ఏం?"

"కుక్ లేడూ ? రోజూ హోటల్లో నే భోజనం చేస్తున్నావా?"అడిగింది వసంత.

"తరచుగాఅంతే. ఎందుకంటే–ఒంటరిగా భోజనం చెయ్యడం నాకంత యిష్టంఉండదు. ఇంట్లో కంపెనీ ఉండదు. హోటల్లో అయితే తెలిసిన వాళ్లు లేకపోయినా పలుగురిలోనూ కూర్చుని భోంచేశామన్న తృప్తి ఉంటుంది."

"ఇవాళ–నేనున్నానుగా ?"

"సాయంత్రం కుక్‌కి చెప్తాములే. నువ్వు రెడీయేనా ? భోజనం చేసివద్దాం–నీకు ఆకలి అవుతూంటే."

"పద"

సాయంత్రం గార్డెన్‌లో కుర్చీలు వేయించుకుని కూర్చున్నారు మాధవ్, వసంత రావ్ వచ్చాడు. ముగ్గురూ టీ తీసుకున్నారు.

"మాధవ్ చాలా కష్టాల్లో చిక్కుకున్నాడు వసంతా!—"

మాధవ్ ప్రశ్నార్థకంగా రావ్ ముఖం వంక చూడబోయి మానేశాడు.

వసంత అడిగింది. "మాధవ్‌కి కష్టాలా? ఏమిటి? ఈ మధ్యనే ప్రమోషన్ వచ్చింది. నాలుగంకెలు దాటిన జీతం. చక్కని క్వార్టర్స్. కంపెనీ చాలా ప్రాస్పెక్టివ్‌గా ఉంది."

"ఆ కష్టాలు కావులెండి-"

"మరి?" కళ్ళు పెద్దవిచేసి చూసింది వసంత.

"మాధవ్ వయస్సు ముప్ఫయ్యేళ్ళు. దురదృష్టవశాత్తూ ఒంటరిగా మిగిలిపోయాడు. అతనికి జంటను అంటిద్దామని పెద్దలంతా ప్రయత్నాలు చేస్తున్నారు. మాధవ్‌ని వత్తిడి చేస్తున్నారు."

"యు మీన్ మారేజ్?"

"సరిగ్గా అంతే."

"పెళ్ళి చేసుకోవచ్చుగా?"

"అక్కడే వచ్చిందంత చిక్కూను. మాధవ్ ఎప్పుడో, ఎవరినో, ప్రేమించాడుట. అప్పుడు పరిస్థితులు విషమించి ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకోలేక పోయాడట..."

"రావ్!—" కోపంగా చూశాడు మాధవ్.

"నేను నీ మిత్రుణ్ణి మాధవ్. నీ మంచి చెడ్డలు నాకు కావాలి. వసంతలాటి తెలివైన వారిసలహా తీసుకుని నీజీవితాన్ని సరిదిద్ద వలసిన బాధ్యత స్నేహితుడిగా నా మీద ఉంది. నీ జీవితం మంచిదారిన పడితే అంతకంటే నాకు సంతోషం యింకేముంటుంది?"

"ఇప్పుడు నేను చెడ్డదారి పట్టలేదు—"

"అంత మాత్రాన యికముందు పట్టవని భరోసా ఏమీ లేదుగా? చూడండి వసంతా! ఇదే వాడి ధోరణి. ఎవరినో ప్రేమించానని చెప్పాడు. వివరాలడిగితే చెప్పలేదు. ఆమెనితప్ప మరెవరినీ చేసుకోడ్డట. అడ్రసియ్యి—వెళ్ళి ఆమె కాళ్ళమీద పడి అయినా ఒప్పిస్తానన్నాను. ఊహూఁ. ఆమెగురించి చెప్పడు. ప్లీజ్, వసంతా!

"యీ విషయంలో నాకు మీ సంపూర్ణ సహకారం లభిస్తుందని ఆశించడంలో తప్పేమీ లేదుకదా? మాధవ్ నాకు మిత్రుడు. మీకు బంధువు."

వసంత అంగీకారసూచకంగా అన్నట్లు చిరునవ్వు నవ్వింది.

"దయచేసి— మీరు ఆ అమ్మాయి అడ్రస్ తెలుసుకోండి. మిగిలిన విషయాలు తరువాత ఆలోచించవచ్చు. ఏం?"

"ఊఁ." అంది వసంత.

"క్షమిస్తే— నేను వెళ్తాను. అర్జంట్ పని ఒకటుంది"

"వెళ్ళండి."

రావ్ వెళ్ళిపోయాడు వాళ్ళిద్దరివద్దా శలవు తీసుకుని.

మళ్ళీ వాళ్ళిద్దరూ మిగిలిపోయారు.

"లీలాలో మంచి యింగ్లీషు పిక్చరు నడుస్తోంది. వెళ్దామా వసంతా?"

"ఏమిటి పిక్చరు?"

"టైటిలు జ్ఞాపకంలేదు."

"పద—"

రొమాంటిక్ పిక్చరది. గంటన్నరలో ప్రేయసీ ప్రియులు ఒకరికొకరైపోయి సినిమా ముగిసింది. తోవలో భోజనం కానిచ్చి యిల్లు చేరుకున్నారు వసంత, మాధవ్. వెన్నెల్లో కుర్చీలు వేసుకొని కొంతసేపు కబుర్లు చెప్పుకుని—అనంతరం గుడ్‌నైట్ పాడుకుని యిద్దరూ గదుల్లోకి వెళ్ళిపోయారు.

## 6

రెండు రోజులు గడిచాయి.

వసంత సూట్‌కేస్ సర్దుకుంటూంటే బాధగా అడిగాడు మాధవ్.

"వెళ్ళిపోతావా వసంతా యింత త్వరగా?"

"త్వరగానా! నేనువచ్చి మూడు రోజులైంది తెలుసా?"

"ఏమో! నాకు మూడు నిముషాలలా అనిపిస్తోంది. బహుశా నీ సన్నిధి తాలూకు ప్రభావం అనుకుంటాను. ఎంత తీయగా గడిచింది కాలం!"

"థాంక్యూ." అందంగా నవ్వింది వసంత. "చక్కని ఆతిథ్యం యిచ్చావు. చాలా కృతజ్ఞతలు మాధవ్."

అరగంటలో కారు బయలుదేరింది.

తోవలో రావ్ ఎదురయ్యాడు.

మాధవ్ కారు ఆపాడు. రావ్ కారులోకి వచ్చాడు.

"ఏమిటి? అప్పుడే వెళ్ళిపోతున్నారా వసంతా?"

"నేను వచ్చినపని ఐపోయింది రావ్ జీ."

"మీరింత త్వరగా వెళ్ళిపోతారనుకోలేదు."

"బలేవారే! ఇంకా ఎంతకాలం ఉండమంటారు? ఇప్పటికే బావకి చాలా శ్రమ యిచ్చాను. అవతల డాడీ నాకోసం ఆత్రతగా చూస్తూంటారు."

"పోనీండి...మళ్ళీ వస్తారా?"

"దేనికి?"

"మాధవ్ విషయంలో... నాకు చేసిన ప్రామిస్ మరచి పోయారా?"

"మరచిపోలేదు" స్నిగ్ధంగా నవ్వింది వసంత.

"మాధవ్‌ని చూడండి. మీరు వెళ్ళిపోతూంటే ఎంత డల్ ఐపోయాడో!"

"ఫరవాలేదు. మీవంటి మంచి మిత్రుడు రెండు కబుర్లు చెప్పేసరికి మళ్ళీ మామూలు మనిషి ఐపోతాడు. నాకా నమ్మకం ఉంది."

"థాంక్యూ."

ముగ్గురూ వాల్తేరు స్టేషన్ చేరుకున్నారు.

ఆ స్టేషనులో ఆర్ట్ పీసెస్ అమ్మే స్టాలొకటుంది. మంచి గంధపు చెక్కతోనూ, దంతంతోనూ తయారు చేసిన చక్కని బొమ్మలు అమ్ముతూంటారక్కడ మాధవ్ ఖరీదయిన బొమ్మతీసుకుని ప్యాక్ చేయించి వసంత కందించాడు.

"దేనికి మాధవ్?"

"మనం అందంగా గడిపిన యీ రోజుల జ్ఞాపక చిహ్నంగా..."



"నీ జ్ఞాపకంగా ఈ ఉంగరాన్ని నా హృదయంలో దాచుకొంటాను రవీ!"
"మింగకు సుమీ!?"

"సరే" బ్యాగ్‌లో పెట్టింది వసంత.

రైలువచ్చి ఆగింది

కంపార్టుమెంటులో కిటికీ ప్రక్కగా సీటు దొరికింది వసంతకి.

"ఉత్తరాలు వ్రాస్తూ ఉంటావు కదూ?"

"అలాగే."

రైలు కదిలింది.

మిత్రులిద్దరూ చేరుమాళ్ళు ఊపుతూ వసంతకి వీడ్కోలు చెప్పారు.

దృష్టి కానరానంత దూరం వెళ్ళిపోయింది రైలు.

రావ్, మాధవ్ స్టేషను బయటకువచ్చారు.

"ఇప్పుడు చెప్పు. మీమధ్య ఏంజరిగింది?" అడిగాడు రావ్.

"...ఏం చెప్పమంటావు ?"

"స్వీట్‌నథింగ్స్ ఎక్స్చేంజ్ చేసుకో లేదూ ?"

"కొంచం. అంతే"

"అరుణ గురించి గుర్తు చెయ్యలేదూ వసంత ?"

"చేసింది. అప్పుడు- ముందే ఆలోచించుకున్న డైలాగ్ అప్పజెప్పేశాను."

## ప్రతిబింబాలు

"ప్లీజ్ రిపీట్—"

"చేజారిన అదృష్టంగురించి విచారిస్తూ వర్తమానాన్ని వృధాచేసుకోడం అవివేకం. జీవితం ప్రయాణం లాటిది. కాలంతో పరుగెత్తాలి తప్ప వెనకపడి పోకూడదు. ముందు వెనుకల తేడాతో—పుట్టిన ప్రతి మనిషీ పోవలసిందే. ప్రయాణం ముగిసిన వాళ్ళకోసం ఒట్టే విచారించవవసరం లేదు..."

"వెరీగుడ్. దీన్నిబట్టి వసంతకి అర్ధమై పోతుంది—నీ హృదయం నిర్మలంగానే ఉందనీ, అరుణ జ్ఞాపకాల నీడలు మిగిలి పోలేదనీ. మనకి కావలసిందదే. ఇక వసంత నిన్ను అంగీకరించవచ్చు"

"నిజంగా ?" ఆశగా ఆరాటంగా చూశాడు మాధవ్.

"నిజంగానే. వసంత సైకాలజీ నేనర్ధం చేసుకోగలిగాను. అందుచేత ఇప్పుడు నిన్ను చూసిన వసంత తప్పకుండా నీపట్ల ఆకర్షించబడుతుంది."

"ఆ విషయం ఆమె ఒక్కసారీ సూచించలేదు—"

వసంత స్త్రీ. స్త్రీ హృదయం అతి నిగూఢం సముద్రంలో రత్నాలకోసం ఎంత ప్రయత్నిస్తే లభిస్తాయి? స్త్రీహృదయమూ అంతే."

"ఐతే వసంత శుభవార్తతో ఉత్తరం వ్రాస్తుందన్నమాట !"

"అంతే. తన అంగీకారాన్ని నోటిమాటతో చెప్పడానికి సిగ్గుపడింది. అందుకే ఉత్తరం వ్రాస్తానంది. అర్ధంకాలేదూ ?"

"నువ్వింత విపులంగా చెప్తే అర్ధంకాక పోవడమేమిటి ? వసంత నన్ను అంగీకరిస్తే అంతకంటె యింకేం కావాలి జీవితానికి ?"

"అప్పుడు నన్ను మరచిపోతావేమో నను కుంటాను—" నవ్వాడు రావ్.

"దీనికంతటికీ కారణభూతుడివైన నిన్ను మరచిపోడం నాతరమా ?"

## 7

వసంత వెళ్లిన వారం రోజులకి...

ఒకానొక సాయంకాలం...

మాధవ్‌కి బరువైన కవరు వచ్చింది.

అడ్రస్ చూడగానే ఆ ఉత్తరం ఎక్కడి నుంచో పోల్చేశాడు మాధవ్.

మరుక్షణం రావ్‌కి డయల్ చేశాడు.

"హలో రావ్... నేను మాధవ్‌ని... వసంతనుంచి ఉత్తరం వచ్చింది... ఊహుం. ఇంకా చదవలేదు. ఎందుకో భయంగానూ కంగారుగానూ ఉంది. అర్జెంట్‌గా బయలుదేరి రా. నీకోసం ఎదురుచూస్తూ ఉంటాను. ఇమీడియట్‌గా బయలుదేరు."

మాధవ్‌కి బయం బయంగా ఉంది.

కవరు పట్టుకున్న చేతులు వణుకుతున్నాయి.

ఏం రాసిందో వసంత ?

కవరు బరువుగా ఉంది. ఎన్ని విశేషాలు వ్రాసిందో ?

తనతో గడిపిన మూడు రోజులలోనూ ఎప్పుడూ అసంతృప్తి ప్రకటించలేదు.

ముఖంలో ఎక్కడా విరాగు ప్రదర్శించలేదు. ప్రసన్నంగానే ఉండేది. రావ్ వచ్చాడు.

అతను ధైర్యం చెప్పాక ఉత్తరం తెరిచాడు మాధవ్.

నీలికాగితం మీద అందంగా అక్షరాల బారులు.

"మాధవ్ !

ఇక్కడికి క్షేమంగా చేరాను.

అక్కడ—మంచి కంపెనీ యిచ్చినందుకు చాలా కృతజ్ఞతలు. సరే. అసలు విషయం లోకి వస్తాను. నే నిక్కడికి వచ్చింది యూనివర్సిటీ పనిమీద కానే కాదు. పెళ్ళిగురించి వచ్చాను. నిన్ను ఒక్కసారి అబ్జర్వ్ చేసి—నిర్ణయం తీసుకోవాలని. ఈ విషయంముందు చెప్పాలనిపించలేదు. అయినా—ముందు చెప్తే ఎలా ?

ఒకసారి అక్కయ్య మరణం గుర్తు చెయ్యక తప్పడంలేదు బావా. క్షమించు. అప్పుడు నాకు చిరాకెత్తించింది నీ దుఃఖం. మనిషి అంతగా సెంటిమెంట్స్ పెంచుకోకూడదు. మగవాళ్ళు ఏడిస్తే మహా అసహ్యంగా ఉంటుంది. అంతే ఆడవాళ్ళు అందంగా ఏడవగలరని కాదు సుమా ! ఏడుపనేది చాలా అసహ్యంగా ఉంటుంది ఎవరికయినా. అప్పటికి నా భావాలివే. అందుకే రావ్ అడిగినప్పుడు—నిన్ను సారీ—ఒట్టి సెంటిమెంటల్ ఫూల్ అనేశాను. వయసు అటువంటిది. తరువాత నేను ఎదిగాననే చెప్పాలి. ప్రపంచాన్ని అర్థం చేసుకుందుకు ప్రయత్నించసాగాను. మనుషుల బలహీనతలని తెలుసుకుందుకు ప్రయత్నించసాగాను. అప్పుడు కనువిప్పు కలిగింది. నిన్ను సెంటిమెంటల్ ఫూలనడంలో నాదే తప్పు. అక్కయ్యని నువ్వెంతగానో ప్రేమించి వుంటావు. అందుకే అరుణ మరణం నీ కంత బాధ కలిగించింది. నీ కన్నీళ్ళని నే నపార్థం చేసుకుని—రావ్‌ముందు హేళన చేశాను. నా మాటలు రావ్ నీకు చెప్పే ఉంటాడు.

జరిగినదానికి క్షమాపణ చెప్పుకుందుకు—పెళ్ళి చేసుకోమని నిన్ను అర్థించేందుకూ—రెండింటినీ దృష్టిలో పెట్టుకుని నేనిక్కడికి వచ్చాను.

నేను ఊహించని పరిస్థితులు ఎదురయ్యా యిక్కడ.

ఆనందించాలో విచారించాలో అర్థం కాలేదు.

అక్కయ్య చనిపోయి మూడు నెలలు మాత్రమే ఐంది. ఆనాడు చిన్నపిల్లల కంటె దారుణంగా కన్నీరు పెట్టుకున్న నువ్వు—కొత్త మనిషివై పోయావు. ఎంత వెతికినా నీముఖం లోనూ కన్నులలోనూ ఆ నాటి దుఃఖపు ఛాయలు మిగలలేదు. చాలా హుషారుగా ఉన్నావు. అరుణని పూర్తిగా మరచిపోయి నట్టే ఉన్నావు. నే నామె ప్రసక్తి తీసుకు వచ్చినా — ఏమీ ప్రాధాన్యత యివ్వలేదు. మూడేళ్ళు నీతో జీవితం పంచుకున్న మనిషిని—మూడు నెలలలో పూర్తిగా మరచి పోయావు. పూలరంగడిలా మళ్ళీ పెళ్ళికోసం ఎదురు చూస్తూ ఉన్నావు !

ఆశ్చర్యపోయాను.

మనుషులను—మన మనుషులనింత త్వరగా మరచిపోగలగడం ఎటువంటివారికి సాధ్యం ?

ఏ మాత్రం మానవత్వం ఉన్నా, మమత ఉన్నా—మనిషి — కట్టుకున్న భార్యనే మరచి పోగలడా మూడు నెలల వ్యవధిలో ? నీలో హృదయం లేదేమో అనిపించింది. అక్కడ నేనున్న మూడు రోజులూ నీ ప్రవర్తన నా అనుమానాన్ని పూర్తిగా నిజమని నిరూపించింది. నీతో మూడేళ్ళు జీవితం పంచుకున్న అరుణని. నీ భార్యను—మూడునెలలలో మరచిపోగలిగిన నీకు మనసూ మమతా ఉంటా యని నమ్మలేకపోయాను. ఆత్మవంచన చేసుకోలేకపోయాను.

జీవితం భ్రమేకావచ్చు. అందుకే జీవితానికి సెంటిమెంట్లవసరం. సెంటిమెంట్స్ లేని జీవితం చాలా నిస్సారంగా ఉంటుంది. 'నిన్న'ను మరచిపోయి—'రేపు'గురించి ఆలోచించకుండా 'నేడు'ని మాత్రమే సత్యమని భావించే మనిషితో జీవించలేనని నాకు తెలుసు.

నీ గురించి నాకు యిప్పుడు విచారమూ లేదు, జాలీలేదు.

నీ వంటి మనుషులు ఎలా అయినా బతికెయ్యగలరు. హృదయంలేని మగవాడితో స్త్రీ సుఖపడలేదు. అందుకనే నేను నీకు శాశ్వతంగా దూరంకావాలని ప్రయత్నిస్తున్నాను. ఈ విషయంలో ఎవరి వత్తిడి నన్ను మార్చలేదు. కనుక — యీ కథ యిక్కడికి ఆపేసి—కొత్త కథ ప్రారంభించు. అది నీకు కష్టంకాదులే.

దయచేసి — యీ ఉత్తరంతో జతచేసిన మరొక ఉత్తరం—రావ్ కివ్వు.

గుడ్‌బై ఫరెవర్ ...'' 'వసంత'.

ఉత్తరం చదివి రెండు చేతులతోనూ తల పట్టుకున్నాడు మాధవ్.

అతను ఉత్తరం చదవడం అవగానే రావ్ తన ఉత్తరాన్ని తీసుకున్నాడు.

దానిలో ముచ్చటగా మూడే మూడు పంక్తులున్నాయి.

''రావ్ !... మనసూ, మమతా, మానవత్వమూ లేని మనిషి మాధవ్. అటువంటి వాడికి స్నేహంవంటి సెంటిమెంట్ కూడా ఉండదు. అమనిషికోసం-విలువైన మీ హృదయాన్ని వృథాగా ఖర్చు చెయ్యకండి. ఆర్ద్రత లేకుండానే బతకగలడు మాధవ్. క్షమించండి. మీకు చేసిన ప్రామిస్‌ని విత్‌డ్రా చేసుకుంటున్నాను తప్పనిసరిగా.'' —'వసంత'


ఉత్తరం చదివిన రావ్ ముఖంలో కత్తి వాటుకి నెత్తురు చుక్కలేదు.

మెల్లగా అన్నాడతను మాధవ్ భుజంమీద చెయ్యివేసి. ''సారీ బ్రదర్. ఫండమెంటల్‌గా మనం ఒక పొరపాటు చేశాం. స్త్రీ సైకాలజీ అద్దంలాటిది. అద్దంలో ప్రతిబింబం ఎప్పుడూ తారుమారుగానే కన్పిస్తుంది. ఐనా గాలివాటం వంటి వసంత — మగవాడికి ఎప్పుడూ ఒక క్విజ్ మాత్రమే. ఆ తరహా అమ్మాయితో నువ్వు సుఖపడలేవు. నా మాట విని—మరో అమ్మాయిని అట్టే తెలివి తేటలు లేని అందమైన అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకో.''

మాధవ్ సమాధానం చెప్పలేదు.

ఈక్షణాలలో అతన్ని అమితంగా ఆశ్చర్య పరుస్తున్నది వసంత అందం కానే కాదు. ఆమె ఆంతర్యం.

[సమాప్తం





## రమేష్ పాడిన పాట!

''అమ్మమాట, తాత—మనవడు, విధానా, సంసారం—సాగరం, గంగ—మంగ'' చిత్రాలకు సంగీత దర్శకుడిగా పనిచేసిన రమేష్‌నాయుడు మధురమైన కంఠం కలిగిన వ్యక్తి అన్న విషయం ''చందన''లో ఆయన పాడిన పాట విన్నప్పుడు గాని తెలియ లేదు.

''హో రామ చక్కని బంగారు బొమ్మ
నీ రాత రంపపుకోత ఆయెనా
నీవారు, నా వారు, నెత్తిన
నిప్పులు పోశారే, కత్తులు
గుండెల్లో గుచ్చారే

నెత్తుటిలో ముంచెత్తారే'' ఈ పాటలో ఎంత బాధ యిమిడి ఉన్నదో గుర్తించారో, ఆ బాధను ఎంత భావగర్భితంగా రమేష్‌నాయుడు తన కంఠంలో పలికించారో, ఆ పాట విన్నప్పుడు కన్నీళ్ళు కార్చక మానరు. ''చందన'' చిత్రానికి జీవనాడి యీపాట అన్నారు. నిర్మాత, దర్శకుడు గిరిబాబు.

—శ్రీనివాస్.

పొట్టన కొట్టుకుంటే కానీ తనివితీరేట్లు లేదే మీకు'' అంది.

కల్యాణి శశికళ ఒడిలోని చీరల ప్యాకెట్టు తీసుకుంటూ ''ఏమిటే షాపింగ్ చేసావా ?'' అంది.

''ఆఁ షాపింగే చేసాను చెప్పానుగా మావారి సర్దాలు. ఆయనతో షికారుకు వెళ్తుంటే నా చీరలు మాంచి వెరైటీగా ఉండాలట. అందు కని ఇదుగో ఈ చీరలు, తీసేసుకున్నారు ఏదో జీతంకాక పైన వచ్చింది. డబ్బు మాకు చేతిలో క్షణం నిలవదుగా. ఏమైనా అంటే వయసులో ఉన్నప్పుడే సర్దాలు ముసలితనంలో ఏం సర్దాలు తీరుతాయి? అంటారు'' అంది— ఆకళ్ళల్లో మెరుపు! కల్యాణి మనసులో ఏదో బాధ!

—''చూడు'' చీరలు తీసి చూపించింది. మెత్తగా గుబ్బలా ఉన్న ఆ సిల్కు చీరలు కల్యాణి కాటన్ చీర మీద, పాముల్లా జారి పోతూ ఆమె హృదయాంతరాళాన్ని కాటు వేస్తున్నాయి!

''బాగున్నాయే'' అంటూ ఇచ్చింది.

''ఊఁ సరే మన ఫ్రెండ్స్ ఎక్కడైనా కనబడ్డారే నీకు'' అడిగింది.

''ఉహూ'' అంది కల్యాణి కనబడలేదన్న ట్లుగా.

నాకు తెలిసినంతవరకూ అందరికీ పెళ్లి యి '- ఇంటర్ బందయ్' మన్న

## నాకూ మొగుడున్నాడు

(14వ పేజీ తరువాయి)

స్కూటర్ హారన్ శబ్దం. ''—అదుగో ఆ స్కూటర్ హారన్ శబ్దం మావారిదే. ఒరే శ్రీధర్ చూడు డాడీని కాబోలు, అదుగో అక్కడున్నట్లున్నారు పిలు'' అంటూ పెద్ద కొడుకును పంపించింది. ఆమె పెదవులు దర హాస చంద్రికలతో మెరిసి పోతున్నాయి! ఆమే చూస్తుంది కల్యాణి ఉనికే తనకు పట్టనట్లు. కల్యాణి మటుకు, శశికళను పరీక్ష పెడూ తుంది ''ఎంత అందమొచ్చింది? ఎండిపోయినట్లుండే శశికళ ఇంత అందంగా మారుతుందని శశికళే అనుకుని ఉండదు''— 'నే చెప్పలే, మావారె, ఎవరో ఇంటిలో ఏదో చెప్పాలని సుమ్మర్లీ ఒక్కక్షణం ఇక్కడ తిరగమన్నారు. క్షణం అంటే ఈయనగారి డిక్షనరీలో అఫెనవర్ అన్నమాట.' నవ్వింది మళ్లీ కల్యాణివంక చూస్తూ. ఇంతలో శశికళ భర్త వచ్చాడు. స్కూటర్‌మీదే కూర్చుని ఉన్నాడు స్కూటర్ ఇంజను డబడబమని శబ్దం చేస్తూనే ఉంది! శశికళ ''వస్తాను కల్యాణీ, ఇంకా ఎప్పుడోయ్ త్వరగా పెళ్లి చేసుకుని మాకు సప్పన్నం పెట్టేయ్'' అంటూ నవ్వుతూ ఓ ఉచితసలహా పారేసి మొగుడు వెనుకగా కూర్చుంది. 'రంయ్' మంది స్కూటర్ జానపద కథల్లోని ఎగిరే గుర్రంలా! శశికళ ఉచిత సలహాకి కల్యాణి హృదయం మటుకు భగ్గుమంది.

—''ఇంకా ఎప్పుడోయ్ అట, మా నాన్నా మీ నాన్నలా ఏభై వేలు, అరవై వేలుపోసి పెళ్ళి కొడుకుని కొనగలిగే వాడైతే నేనూ నీ కన్నా బాగానే కబుర్లు చెప్పుదును'' అనుకుంది.

''బాగా చీకటి పడడంతో నిరసంగా బయలుదేరింది. ఎప్పుడూ ఇంత చీకటిపడి ఇల్లు చేరలేదు, ఇంటిదగ్గిర కంగారు పడ్తారేమో'' అనుకుంటూ, లేచింది. ఎవరో బెంగాలీ అమ్మాయి అనుకుంటా భర్త చేతులోచేతులు వేసి దొండపళ్ళలా లిప్‌స్టిక్‌తో తయారు చేసుకున్న పెదాలతో కబుర్లు చెప్పేస్తూ హంసలా కల్యాణిముందు కదిలి పోయింది.

కల్యాణి మటుకు విసుక్కుంది ''సరే లేవమ్మా. అతగాడు నీ భర్త అని తెలుసులే.''

## 2

రోజులు దొర్లిపోతున్నాయి. కల్యాణిలోని ఆలోచనలు పెరిగిపోతున్నాయి. 'పెళ్ళిపిచ్చి' పట్టినదానిలా మారిపోయింది కల్యాణి. జీతం అంతా ఇవ్వకపోవడంతో ఇంట్లో అసంతృప్తి బయలుదేరింది. అందరూ తనను ఓ పరాయి దానిలా చూస్తున్నారు— ఆఫీస్‌లో కూర్చుని ఆలోచిస్తూంది కల్యాణి.

''గురు మన 'ఓల్డ్ మిస్' ఏమిటి చెప్మా విరహవేదన అనుభవిస్తున్నట్లుంది.''

''ఏ మహారాజు దొంగిలించాడో ఆ హృదయరాజాన్ని''.

గుసగుసల నవ్వులు

కల్యాణి చివాల్న చూడబోయింది! కాని మానేసింది. నిత్యం తెలిసిందేగా వీళ్ళ గోల!

''ఒరే వెనిమధ్య మ్యారేజి బ్యూరో వాళ్ళ దగ్గరకువెళ్ళి ''పెళ్ళికొడుకు కావలెను'' అన్న ప్రకటన ఇచ్చివచ్చాట్రా''.

మళ్ళీ నవ్వులు!

''ఒరేయ్'' పెళ్ళికొడుకు నీ కెందుకురా? ఒకడి సందేహం!

''నాక్కాద్రా లోకకల్యాణార్థం!'' అవతల వాడి వ్యంగ్యం.

'ఛీ! ఛీ! వీళ్ళు మనుష్యులుకారు. నర రూప రాక్షసులు! ఏం వీళ్ళకిమటుకు అక్కలూ చెల్లెళ్ళూ వుండరూ. ఆ ప్రసాద రావుకే నలభై ఏళ్ళు ఉండవ్వు, ఇంకా పెళ్ళి చేసుకోకుండా ముదిరిపోతున్నాడు బెండ కాయిలా, వాడూ తనని అనేవాడే. అయినా



# "మా అమ్మా నాన్నా తప్పిపోయేరు" అంది పిల్ల, చల్లగా

## 3 గంటల తరువాత. జెఎఫ్‌కె విమానాశ్రయము చుట్టూ ఎన్నో సార్లు తిరిగి ఆమె చెప్పింది నిజమేనని తెలుసుకొన్నాము.

పోటీవంటి చిన్న వయస్సుగల పిల్ల తప్పు చెప్పదు. కాని ఆమె తల్లి దండ్రులను గురించి అలా చెప్పలేము.

జె.ఎఫ్.కె. విమానాశ్రయము : న్యూ యార్క్ పట్టణము. మా విమానాశ్రయపు రిసెప్షనిస్ట్ చీరకొంగును పట్టుకొని ఒక చిన్న పిల్ల అడిగింది గదా "ఏమండీ, మా అమ్మా నాన్నా మీకు కనిపించేరా ?" "ఏమమ్మా, నువ్వు తప్పిపోయేవా ?" మా రిసెప్షనిస్టు ఆ పిల్ల కంటె ఎక్కువ కంగారు పడుతూ అడిగింది. "నేను కాదు, మా అమ్మా నాన్నా తప్పిపోయేరు." చల్లగా అంది ఆ అమ్మాయి తప్పు తనది కాదన్నట్లు. వెంటనే వాళ్ల కోసము వెతకడము ప్రారంభమవడము, తరువాత వాళ్లు కనపడడము జరిగేయనుకోండి.

అంటే, యిలా ప్రతి రోజు తల్లి దండ్రులు తప్పిపోవడము, మేము ఆ కుటుంబాన్ని కలిపి సంతోషపడడము రోజూ జరుగుతుందని కాదు. చెప్పవచ్చేదేమంటే, మీకు ముందు ప్రయాణానికి రిజర్వేషన్లు చేయడము, సమావేశములకు ఏర్పాట్లు జరవడము, హోటల్ రిజర్వేషన్లు, ప్రయాణపు ఏర్పాట్లు, ఎక్కడెక్కడ ఏ సరకులు దొరకుతాయో చెప్పడము కూడ మేము ఎంతో సంతోషముగా చేస్తాము. మీరు ఫలానాది కావాలని అడగడమే తరువాయిగాని మేము చేయడానికి సిద్ధముగానే ఉంటాము.

కనుక మీరు ఎయిర్-ఇండియాలో టికెట్టు కొంటే, మామూలు ప్రయాణమునకు కాకుండా, మీకు కావాలన్న విధముగా, మిమ్మల్ని అర్థముచేసుకొని సౌకర్యములు కలిగించే వారితో ప్రయాణమునకు టిక్కెట్టు కొన్నారన్నమాట.




AI. 6129

# నాకూ మొగుడున్నాడు

ఈ గొడవంతా తను నాలుగు రోజులక్రితం ఆ 'మ్యారేజి బ్యూరో' వాళ్ళదగ్గరికి వెళ్ళినప్పుడు ఈ ప్రసాదరావు చూసాడు. అదీ గొడవ. వయసు లెంతవచ్చినా బుద్ధిమటుకు రాదు! ఇలా గడిపేస్తారు దర్జాగా. భారంగా నిట్టూర్చింది- "ఏమిటీ లోకం? ఆఖరికి ఆ 'మ్యారేజి బ్యూరో' వాడుకూడా తనకే పెళ్ళికావాలని అనుకోలేదు, తన చెల్లెలికేమో అనుకున్నాడు. అందరికీ తనంటే లోకువ! ఎందుకనీ? పెళ్ళి కాకుండానే ముదిరిపోయిందనేగా అందుకే తనను చిన్నబుచ్చుతున్నారు. ఈ పురుష పుంగవులంతా కట్నాలు తీసుకోమని చెప్పి అంతంత ఉద్యోగాలు చేసుకుంటూ, అన్నేసి ఏళ్ళువచ్చినా తండ్రి చాటుపిల్లలా తల్లినీ తండ్రినీ వెంటవేసుకుని కట్నంకోసం తిరక్కుండా ఆదర్శంగా పెళ్ళిచేసుకుంటే తనలాంటి వాళ్ళ ఎందుకుంటారు? తనని అనే ఈ వెధవలకి బుద్ధి చెప్పేవాడు దేడి? అయినా అమ్మకీ నాన్నకీ ఉండాలి ఎంతసేపూ తన సంపాదనమీదే దృష్టి..." ఇంతలో ఆఫీసర్ పిలుపు వచ్చే[illegible]రికి. కల్యాణిలోని భావన [illegible]ం దానం[illegible] అదే ఆగిపోయింది.

* * *

ఏమిటో ఈ [illegible]చంమండి దూరంగా పో[illegible]యి ఏ స[illegible]సుల్లోనో కలిసిపోతే ఎంత బా[illegible]ండి? ఆ ఆలోచనకి తనలోతానే నవ్వుకుంది కల్యాణి. ఎక్కడికని వెడుతుంది? తను ఓ స్త్రీ. ఆ సృష్టికర్త మగవాడై పోయాడు! అందులో తనలాంటి ఆడవాళ్ళని సృష్టించి హృదయం లేనివాడినని నిరూపించు కు[illegible]ను ఎంతకాలం ఈ సా[illegible]రహితమైన జీ[illegible] సాగించాలి? ఏముంది ఈ జీ[illegible] లో [illegible]? ఎప్పుడైనా ఒకేరీతిగా సాగు[illegible]. [illegible] తన జీవితంలో మార్పు [illegible] నాటినుండీ తన [illegible] తన జీతం పూర్తిగా ఇవ్వకుండా [illegible] మిగు[illegible]డం మొదలు పెట్టింది. 'నా' అనే చింతలేని తనకూ ఈ[illegible] ఆ కోరిక రావడంతో. తనకే కోరికలు లేవనుకునే తనవాళ్ళే తనకు ఈనాడు దూరమవుతున్నారు. అయినా వాళ్ళకా అభిప్రాయం కలిగించడం తనదే తప్పు అయినా ఈ తప్పు [illegible] పట్టికలతో, ఏం లాభం? తను కష్ట[illegible]డి పోగుచేసిన డబ్బుతో ఎవడు [illegible] ఇందాక ఆ మ్యారేజి బ్యూరో [illegible] అన్నాడు రేట్లు చాలా హెచ్చుగా ఉన్నాయట. "ప్రయత్నిస్తాను" అన్నాడు- అయినా ఈ తిప్పలన్నీ కన్నవాళ్ళు పడాలి. వాళ్ళకేం చింతాలేదు. ఎందుకొచ్చిన గొడవ? తనకు పెళ్ళి అవ్వదు. అయినా పెళ్ళికాకపోతే ఏం మునిగిపోతూంది? ఈ పెళ్ళిచేసుకున్న వాళ్ళంతా సుఖపడిపోతున్నారా?- ఆఫీసర్ ఎక్స్‌ట్రాగా పనిచేయించడంతో బస్ దాటి పోగా, నడక సాగించింది కల్యాణి, ఏ రిక్షావాడు సరైన రేటు చెప్పకపోవడంతో-

ఇంకా ఎండగానే ఉంది.

ఒక్కసారి ఉలిక్కిపడింది కల్యాణి-పెద్ద కారు ఆగి ఉంది తన పక్కన.

"హాయ్ కల్యాణీ" ఎవరో కార్లోంచి ముద్దుగా పిలుస్తున్నారు – పరిచితమైన కంఠమే ఆశ్చర్యంగా చూసింది కల్యాణి. కారులోని మనుష్యులకీ తన పేరు తెలుసా?!

కిరీటంలా వేసుకున్న ముడి, చెవులకు పెద్ద పెద్ద స్టడ్స్, లిప్‌స్టిక్ వేసుకుని మెరిసి పోతూన్న పెదాలు.

ఎక్కడో చూసినట్టుంది ఎవరుచెప్మా?- ఆలోచనలో పడింది.

"అరే నేను జ్ఞాపకంలేనూ? వసుంధరని" జ్ఞాపకమొచ్చింది కల్యాణికి.



ఆమధ్య లండన్‌లో జరిగిన "ప్రపంచ సుందరి" పోటీలో ఎన్నికైన మొదటి అమెరికన్ యువతి మార్జోరీ వాలెస్. 19 సంవత్సరాల ఈ మోడల్ అమ్మాయి తన వృత్తిని కొనసాగిస్తూ సినిమాల్లో కూడా నటించాలని ఉబలాట పడుతున్నది.

కారులోని బొచ్చుకుక్క భౌ! భౌ!!మంది.

"హాయ్ టామీ" స్టీరింగ్ దగ్గర కూర్చునివున్న వ్యక్తి అదమాయించాడు మొరిగే ఆ కుక్కని!

"అబ్బ! మనం కలుసుకుని ఎంతకాలమయింది? రావే" అంటూ డోర్ తెరిచి ఆహ్వానించింది. కల్యాణి ఏదో ఆలోచిస్తూనే కార్లోకి అడుగు పెట్టింది.

అందమైన హైదరబాద్ రోడ్లమీద, చక్కటి ఆకారు పూలరథంలా సాగిపోతూంది! బస్ కుదుపులతో అలసిపోయిన ఈ శరీరం మెత్తటి ఈ కారు సోఫాల్లో హాయిగా సేద తీర్చుకుంటూంది! అందుకనే అన్నారు కారుల్లో వాళ్లని అదృష్టవంతులని!!

"ఊఁ ఇప్పుడు ఎక్కడుంటున్నావు? ఏంచేస్తున్నావు?" అడుగుతూంది.

ఆలోచనల్లో ఉన్న కల్యాణి నవ్వులాంటి నవ్వు నవ్వుతూ "ఊఁ - ఇక్కడే – ఉంటున్నాను" అంది.

"మీ వారు ఏంచేస్తున్నారు?" వసుంధర అడిగింది.

కల్యాణి చిన్నబోయింది. అందరూ ఇదే ప్రశ్న "నాకు ఇంకా మారేజి అవలేదు" బోర్డులా తలవంచుకుంది కల్యాణి.

"ఓఁ" అంది వసుంధర హిందీ సినిమా హీరోయిన్‌లా.

వసుంధర దగ్గరున్న కుక్కపిల్ల భౌ! భౌ! మంది మళ్ళీ.

"ఓఁ డోన్ట్‌ఫీయర్! మా టామీ ఏం అనదు-సీ డియర్ హౌ ఇట్ క్రియేట్స్ న్యూసెన్స్! ఓ నాటీ డాగ్!" తమాషాగా పెదాలు తిప్పి, కుక్కతల నిమిరింది. ఈ సారి ఆ కొలభైరవుడు తోక ఊపాడు.

ఎంతమందో మనుషులకులేని అదృష్టం ఆ కుక్కకి ఉన్నందుకు కల్యాణి మనసు అను కోకుండా బాధపడింది.

వసుంధర కల్యాణివంక చూసి నవ్వుతూ "అయనే......"కొత్త పెళ్ళికూతురిలా సిగ్గుపడింది. (సారీ! అభినయించింది)

కారు డ్రైవ్ చేస్తున్న అతను ఈ సారి గట్టిగా నవ్వుతూ-"నేనే వసుంధర భర్తని" అన్నాడు తమాషాగా భుజాలు ఎగరేస్తూ.

కల్యాణి నవ్వింది. అతన్ని పరీక్షగా చూసింది. పంజాబీ వాడిలా ఉన్నాడు. శతగోడీధర అన్న ఉండన్న! అందులోనూ వసుంధర కొనగలిగిందంటే ..

"ఓఁ ఏమిటే కబుర్లు" అడుగుతూంది వసుంధర. (ఇంకావుంది)

# వారఫలం

మహేష్

**1-2-1974 శుక్రవారం మొదలు**
**7-2-1974 గురువారం వరకు**

**మేషం** :— ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. పాతల విషయాలను తెల్సుకొంటారు. వృత్తిలో పోటీవారి పోటీ తగ్గుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో మీ మంచితనమే పనికి వస్తుందని గ్రహించగలరు. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధుమిత్రులను కలుసుకొంటారు.

**వృషభం** :— వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. ప్రయోజనం గల పరిచయాలు ఏర్పడతాయి. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు ఎలాగైనా నెరవేరతాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. విలువైన వస్తువులు పొందుతారు.

**మిథునం** — మీ ప్రయత్నాలకు ఆటంకాలు ఏర్పడతాయి. ఉద్యోగంలో శ్రమ కలుగుతుంది. మీ తాలూకు వస్తువులు పోవచ్చును. వారం మధ్యలో భాగస్వామ్య వ్యాపారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

**కర్కాటకం** :— మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం మధ్యలో అధికవ్యయం జరుగుతుంది. మీ తాలూకు వారి వలన మనస్పర్థలు కలుగుతాయి. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

**సింహం** :— అన్ని వ్యవహారాల్లోను గౌరవం బాగుంటుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. ప్రముఖుల సాంగత్యం లభిస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో నేటి స్నేహ బలహీనతలు కూడా జారిపోవచ్చును. పుణ్యకార్యాలు చేస్తారు. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. బంధు మిత్రులను కలుసుకొంటారు.

**కన్య** :— వృత్తిలో అనుకూల వార్తలు వింటారు. నూతన వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. మీరు ఇదివరకు చేసిన ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు.

**తుల** :— ఉద్యోగంలో ప్రయాస కలుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. స్థిరాస్తి వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. అలంకార వస్తువులు కొంటారు.

**వృశ్చికం** :— ఇతరులతో కలిసి చేసే వ్యాపారాలు లాభిస్తాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. పోటీవారిలో గౌరవం లభిస్తుంది. వారం మధ్యలో శ్రమ కలుగుతుంది. వృత్తిలో చికాకులు యేర్పడతాయి. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. శుభకార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

**ధనుస్సు** :— వ్యాపారంలో పోటీదారి పోటీ పెరుగుతుంది. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వారం ఆఖరులో ప్రతికూల పరిస్థితి యేర్పడుతుంది. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. దైవకార్యాలు నెరవేరతాయి.

**మకరం** :— వృత్తిలో మీ ఆలోచనలు ఫలిస్తాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కల్గుతుంది. వ్యాపారంలో శ్రమ మీద అనుకూలత లభిస్తుంది. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. ఎవరితోను వాద ప్రతివాదాలు తగవు.

**కుంభం** :— మీ కార్యక్రమాలు వాయిదాపడిగా వుంటాయి. పోటీవారిలో గౌరవం లభిస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. మీరు విషయాలు తెల్సుకొంటారు. ఏ వ్యవహారంలోను ఇతరుల మీద ఆధారపడడం తగదు. స్త్రీలకు— పుణ్యకార్యాలు చేస్తారు. వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు.

**మీనం** — వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. పెద్దల సాంగత్యం లభిస్తుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. ఆర్థిక వ్యవహారాల్లో [illegible] తగ్గు. పుణ్యకార్యాలు చేస్తారు. వారం ఆఖరులో వర్తక వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

## ఏమిటో? అమాయకత్వం!

నూతన సంవత్సర శుభకానుకగా గుజరాత్ శాఖ సోషలిస్టు పార్టీ కార్యదర్శి మిస్టర్ రూపి కేంద్రా ప్రధాని శ్రీమతి గాంధికి ముక్కిపోయిన జొన్నపిండి, నాసిరకం గోధుమలు, పుచ్చిన జొన్నలు, అంతకు తక్కువగాని బియ్యం పోపార్సెలులో పంపారట రేషను షాపులలో దొరుకుతున్నవివేనమ్మా అని కూడా ఆయన దాంతో





# ఒక వారం విపరీతం

రాసిపంపిన లేఖలో పేర్కొన్నారట — ఆవిడని వండుకు తింటారా ఏమన్నానా!

## కొత్త ఏడాదినాడే దారుణం

కొత్తగూడెం గ్రామ పంచాయతీ సభ్యుడు, కార్మిక నాయకుడూ అయిన త్రిప్పటి నరసింహులు కొన్ని స్థానిక సమస్యలను గురించి పైవారితో చర్చించడానికో ఇద్దరు స్నేహితులతో మొన్న జనవరి ఒకటో తేదీన హైదరాబాదుకు బయలు దేరుతుండగా దారికాసిన కొందరు ఆయన్ని చంపి, పారిపోయారట. ఇది రాజకీయ విరోధ పర్యవసానంగా పోలీసు పేర్కొన్నది.

## లడ్డూలమ్మితేనే లక్షా?

తిరుపతి వెంకటేశ్వరునికి జనవరి ఒకటో తేదీన హుండీఆదాయం రెండు లక్షలు దాటిందట. లడ్డూలు అమ్మితే 96 వేలరూపాయలు, స్వామి కేలండర్లమ్మితే 14 వేల రూపాయలు ఒకే రోజుఆదాయం తెచ్చాయట.

## "గడ్డి" తిన్న "ఫుడ్" అధికారి

ఢిల్లీలోని ఫుడ్ (అనగా ఆహారం) కార్పొరేషన్ అధికారి ఇక్బాల్‌సింగ్ కొనుగోలులో ఏవో ఇద్దరు ఆసాములతో లాలూచీపడి, వారికి సుమారు ఏడు లక్షల రూపాయలు లాభం వచ్చేలా చేసి, తాను ఏ అరవై రెండు వేలు తద్వారా పొందాడట. ఈ విషయం సి. బి. ఐ. ఆరాలు తీసి, ఆయన్ను పట్టుకుందట. ఈ ఇక్బాల్‌సింగ్‌గారు ఆ కార్పొరేషన్‌కు అధికారేగాక ఏ ఉపమంత్రీ కూడాను.

**భా**రత పవిత్రదేశం స్వాతంత్ర్యం సంపాదించిన నాటినుంచినేటికి మొత్తం అనేక రాష్ట్రాలలో 34 సార్లు రాష్ట్రపతిపాలన విధించబడిందట — ఇట్సె లాండ్మార్కాఫ్ డెమొక్రసీ...యూనో!

**ఆం**ధ్రప్రదేశ్‌లోని 12 జిల్లాలలో ప్లాను, నాన్ ప్లాను, అనే ఎంప్లాయిడ్ స్కీము (అనగానేమి) లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు, ఎయిడెడ్ అప్పర్ ప్రయిమరీ స్కూళ్లలో పని చేస్తున్నవారికి గత 20 నెలలుగా జీతాలు రాక్క చేతికందనేలేదని, వారు తస్మాత్ చాలా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ప్రదేశ్ టీచర్సు యూనియన్ అధ్యక్షుడు వారాళ్ళ బాలకృష్ణశాస్త్రి అన్నారట మర్చిపోనా!

**బె**ర్లిన్‌లో నగరపాలక సంఘం సభ్యుడు మిస్టర్ వాల్టర్ అనేఆయనభార్య మొన్న డిసెంబరు 29వ తేదిన ఒకే కాన్పులో అయిదుగుర్ని కన్నదట. ప్రపంచ

దానికీ మిగిలిన ముగ్గురు పిల్లలు (ఇద్దరుపోగా) తల్లి కులాసాగా వున్నారట. ఆమె కిది రెండోకాన్పట. మొదటి అవళ్ళాయి ఇప్పుడుండేళ్ళట.

ఆర్కాటు జిల్లా పోళూరు తాలూకా కలశపాకం అనే వూరుకు చెందిన మురుగన్ అనే అతనికి అతని భార్య 20 ఏళ్ళ మరకతానికి పెళ్ళై ఇన్నాటి నుండీ పోతేమట పెళ్ళయి రెండేళ్ళయినా ఆనందం పొందలేని మరకతం మీద కిరసనాయిలు పోసుకుని, నిప్పంటించుకుని, ఆత్మహత్య చేసుకున్నదట.

—ఫాలాక్షుడు ●

## అపేక్ష

(37వ పేజీ తరువాయి)

కాస్త వర్షం ఎక్కువయేసరికి గబగబా లోపలి కొచ్చేసింది.

వర్షం మెల్లగా ఎక్కువవడం ప్రారంభించింది. కాసేపటికి గాలివిసురు కూడా ఎక్కువయింది. జల్లు వరండాలోకి వచ్చింది. అక్కడ పడుకున్న బాబ్జీ, ఆడపిల్లలు ముగ్గురూ మేల్కొన్నారు. ఆడపిల్లలు లోపల గదిలోకి వెళ్ళి పడుకున్నారు. బాబ్జీ, ఇంకా మేలుకొని బయటకు చూస్తూ నిలబడ్డ తల్లిని అడిగాడు.

'నాన్న యింకారాలేదా?'

'రాలేదు. పదకొండు అయింది.' ఆమె గొంతులో కాస్త ఆందోళన వ్యక్తం అయింది.

'వర్షం మూలాన ఎక్కడో ఆగిపోయి వుండాలి' అన్నాడు తన మంచంకూడా లోపలి గదిలోకి వేస్తూ.

అయివుంటుంది అనుకుంది.

'ఆయన వొచ్చేస్తార్లే! నువ్వు పడుకోరాదా!' అంటూ బాబ్జీ లోపలికెళ్ళి పడుకున్నాడు.

జానకి బదులు చెప్పకుండా నిలబడిపోయింది, చాలా సేపు. ఓ సారి లోపలికెళ్ళి టైము చూసి వచ్చింది.

పదకొండున్నర అయింది.

వర్షం తగ్గుముఖం పట్టింది.

'షాపులో ఎప్పుడూ ఆలస్యం అవదు. మరి ఎక్కడికి వెళ్ళినట్టు? ఏదీ అర్థం కాకుండా వుంది' జానకి కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

వర్షం పూర్తిగా తగ్గిపోయింది. మేఘాలు అసలు లేవు. పైన చుక్కలు మళ్ళా వెలిశాయి.

వర్షం తగ్గి చాలా సేపయింది. వర్షం వస్తోందని ఎక్కడున్నా ఆగినా, ఈపాటికి వచ్చేయాల్సింది. 'ఎక్కడున్నారో ఏమో.' అనుకుంది.

'బాబ్జీని లేపి సైకిలు వేసుకొని ఆయన షాపుకి వెళ్ళిరమ్మని చెప్తే. బాబ్జీ వెళ్తాడా?' 'ఎందుకే అంత కంగారు. ఆయన వచ్చేస్తుంటాడు.' అంటాడు.

'మొన్న వాడికోసం ఆయన రోడ్డుమీద రెండు మూడుగంటలు నిలబడి ఎదురు

చూశారు ఎంతసేపు ఆందోళన పడ్డారో ! అటువంటి ఆందోళన పీడికి లేశమాత్రమైనా లేదేం ? తండ్రికి కొడుకుమీద ఉండేంత ప్రేమ కొడుక్కి తండ్రిమీద ఉండదా?'

# అపేక్ష

'ఆయునికి ఏదో జరిగి ఉంటుంది. సైకిలు మీద వస్తూ ఎక్కడ పడిపోయారో... ఎప్పుడూ ఇంత ఆలస్యం అవలేదు. రాత్రి పూట బయట ఎక్కడా ఉండలేరు, ఇంటికి రాకుండా. ఏదోకీడు జరిగి ఉంటుంది....'

జానకికి దుఃఖం పొంగుకొచ్చింది. కొంగ నోట్లో పెట్టుకుని శబ్దం రాకుండా వుండ డానికి ప్రయత్నించింది

గేటు చప్పుడయింది. జానకి కళ్ళనీళ్ళు తుడుచుకుంది గబగబా.

సుబ్బరామయ్య సైకిలు తీసుకుని లోపలి కొచ్చాడు.

'వర్షంలో తడిచారా' అడిగింది.

'కొద్దిగా తడిచాను...మధ్యలో ఓ యింటి దగ్గర నిలబడ్డాను వర్షం తగ్గేవరకు... ఇవాళ షాపులో లెక్కలవి చూడాల్సి వచ్చింది, దాంతో ఆలస్యం అయిపోయింది బయలు దేరడం' అన్నాడు.

సుబ్బరామయ్య గదిలోకి వచ్చి బట్టలు మార్చుకున్నాడు.

జానకి అన్నం వడ్డించింది. సుబ్బరామయ్య కాళ్ళు చేతులు కడుక్కుని భోజనంముందు కూర్చున్నాడు.

'మీరు ఎంతకీ రాకపోయేసరికి నాకెంత భయమేసిందో చెప్పలేను...బాబ్జిని మీషాపుకి పంపిద్దామనుకున్నాను . . కాని వాడు మంచి నిద్రలో ఉన్నాడు ..వాడికి నిద్రెలాపట్టిందో!.. మొన్నమీరు వాడికోసం అంతసేపు ఎదురు చూశారుకదా. . చాలాసేపు ఆందోళన పడ్డారు కదా... మీరు రాకపోతే వాడికి కొంచెంకూడా బాధ అనిపించలేదు చూశారా !' మనసులోని మాట చెప్పింది.

సుబ్బరామయ్య నవ్వాడు.

'ఎవరిమీద ప్రేమ వుంటే వాళ్ళకోసం ఎదురు చూస్తారు, బాధపడ్తారు' సుబ్బ రామయ్య నవ్వాడు, జానకి కళ్ళల్లోకి చూస్తూ.

'వాడికి మీరంటే ప్రేమలేనట్టే వుంది' భయంగా అంది.

సుబ్బరామయ్య మెల్లగా నవ్వి 'పిచ్చిదానా ! అటువంటి సందేహాలు పెట్టుకోకు. వయసు మళ్ళిన వాళ్ళం కనుక, మనకి ఆందోళనలూ, భయాలు ఎక్కువ. గుండె నిబ్బరం తక్కువ. వయసులో వున్నవాడు కనుక, వాడికి ఆందోళనలూ, భయాలూ వుండవు. అంత మాత్రంచేత మన మీద వాడికి ప్రేమ లేదు అనుకోకూడదు' జానకి బాధపడకుండా [వుండేందుకు] చెప్పాడు.



673

**Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor. S. Radhakrishna**




ASOKA
AMLA
BRILLIANTINE
ASOKA
Nath